
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



భవిష్యత్‌కు భరోసా.. సీబీజీ!

కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిలో భారత్ దూకుడు

దేశంలో 5వేల ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యంతో ముందుకు

త్వరలోనే ఏపీలోనూ 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు

వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడతో ఇంధన ఉత్పత్తి

పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయం.. కాలుష్యానికి చెక్

రైతులకు ఆదాయ మార్గం.. గ్రామీణ ఉపాధికి అవకాశం

యూరప్, అమెరికా, ఆసియా దేశాలు సీబీజీపై దృష్టి

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం 13లో

గురువారం | 14-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 209 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 9.44 తదుపరి చతుర్దశి తె. 6.19; నక్షత్రం: అశ్విని రా. 12.33 తదుపరి భరణి; వర్జ్యం: రా. 8.59-10.24; దుర్ముహూర్తం: ఉ. 10.07-10.52, మ. 2.36-3.21; అమృతఘడియలు: రా. 6.08-7.33; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సైకో స్కీమ్!

వైసీపీ సర్కారులో కళ్లు చెదిరే స్కామ్

సోషల్ మీడియా కార్యకర్తలకు పథకాల సొమ్ము



స్కీమ్‌ల వెనుక స్కామ్‌లుంటాయని తెలుసు! కానీ.. స్కీమ్‌ల లబ్ధిదారుల జాబితానే గోల్‌మాల్ చేసి, సోషల్ మీడియా కార్యకర్తలకు సొమ్ములు దోచిపెట్టిన సంగతి ఇప్పుడు బయటపడింది. మరీ ముఖ్యంగా.. 'అమ్మ ఒడి'లో భారీ అక్రమం జరిగింది.

గతంలో విద్యాశాఖలో పనిచేసిన ఓ ఐఏఎస్ అధికారి ఈ అక్రమాన్ని గుర్తించారు. తాడేపల్లి పెద్దలకు ఈ విషయం తెలిపారు. అంతే.. మరుసటి రోజు నుంచి తాడేపల్లి ప్యాలెస్‌లోకి ఆయనకు ప్రవేశం లేకుండా పోయిందని సమాచారం.

- అర్హులతో ప్రభుత్వ శాఖల నుంచి జాబితా
- కొందరి పేర్లు ఎత్తేసి, సైకోల పేర్లు జత చేసి
- బ్యాంకర్లకు వెళ్లే జాబితాలో గోల్‌మాల్
- 'అమ్మ ఒడి'లోనే అత్యధికంగా అక్రమాలు
- తాజా విచారణలో గుర్తించిన పోలీసులు
- ఖాతాలపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్
- ఇప్పటికే పాతిక వేలకుపైగా తేడాలు గుర్తింపు
- సీఐడీ లేదా విజిలెన్స్ విచారణకు సిఫారసు

14

అక్క, చెల్లెమ్మలకు దక్కాల్సిన 'అమ్మ ఒడి'లో కొంత భాగం వైసీపీ సోషల్ సైకోలకు దక్కిందని తెలుసా?

నేతన్నలకు అందాల్సిన సాయాన్నీ వైసీపీ సోషల్ కాలకేయులు నొక్కేశారని తెలుసా?

'వాహన మిత్ర'లాంటి పథకాల సొమ్ములనూ వీరు బొక్కేశారని తెలుసా?

ఇదెలా సాధ్యమంటారా? గత వైసీపీ సర్కారులో ఏదైనా సాధ్యమైంది. లబ్ధిదారుల జాబితానే మారిపోయింది!

ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన లిస్టు.. బ్యాంకులకు వెళ్లేసరికి అర్హులైన లబ్ధిదారుల పేర్లు కొన్ని ఎగిరిపోయాయి! ఆ స్థానంలో 'సోషల్ సైకోలు' వచ్చి చేరారు. ఇది... వైసీపీ సర్కారు హయాంలో కుంభకోణం!

బూతులే సిగ్గుపడేలా!

- వైసీపీ సోషల్ సైకో ఫ్యాక్టరీ దారుణాలు
- ఎవరిని ఎలా తిట్టాలో పైనుంచి ఆదేశాలు
- వర్రా 'సోషల్ పోస్టులు' నీచం, దారుణం
- గిట్టని వారిపై రాక్షసంగా విరుచుకుపడటమే
- తల్లి, చెల్లి, పుట్టుకలపై జుగుప్సాకర వ్యాఖ్యలు
- వయసు, వావీ వరస తేడాల్లేకుండా పోస్టులు
- మనస్సాక్షి అనేది ఉంటే.. జగనే వారించే వారు
- సోషల్ సైకోల కూపీ లాగుతున్న పోలీసులు
- 'ప్రశ్నించే వారిపై దాడి' అని వాపోతున్న జగన్

14

అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేంటి?

న్యాయమూర్తులు కూడా బాధితులే

కేసుల్లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

సోషల్ సైకోలపై ఉక్కుపాదం

- అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై కేసులు
- విచారణకు రావాలని డైరెక్టర్ ఆర్జీవీకి నోటీసులు
- స్టేషన్‌లో విచారణకు మాజీ మంత్రి కాకాణి హాజరు
- మాజీ మంత్రి అంబటి ఇంటి నుంచి ఒకరి అరెస్టు
- నటులు పోసాని, శ్రీరెడ్డిపై వేర్వేరు జిల్లాల్లో కేసులు
- హైదరాబాద్‌లో కంభంపాడు టెకీ అరెస్టు
- చంపుతానని బెదిరింపులు.. వర్రాపై మరో కేసు



2

హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త అమరావతిలోనే!

కార్యాలయాల ఏర్పాటుపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

సూత్రప్రాయంగా నిర్ణయం.. చట్టసవరణ చేయాల్సి ఉందని వెల్లడి

పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలుకు ధర్మాసనం ఆదేశం

ఇదే ఫైనల్ వార్నింగ్

13

ఇక్కడితో ఆపకపోతే పర్యవసానాలు దారుణంగా ఉంటాయి

ఉన్నత విద్యామండలి జేడీకి గత అకౌంట్స్ అధికారి బెదిరింపు

అకౌంట్ బుక్స్ అప్పగించకపోవడంపైనా వాగ్వాదం

బుల్డోజర్ న్యాయానికి సుప్రీం బ్రేక్!



ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించి, ఇంటిని కూల్చి, శిక్షించే అధికారం లేదు

- దోషి అయినా.. కూల్చడానికి వీల్లేదు
- కూల్చివేతల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారుల జీతాల నుంచి పరిహారం
- రాష్ట్రాలు, అధికారులు హద్దు మీరొద్దు
- ఒక వ్యక్తి నిందితుడైతే.. కూల్చివేతలతో కుటుంబం మొత్తాన్ని శిక్షించడం సరికాదు
- నిర్మాణాల కూల్చివేతలపై సుప్రీం తీర్పు
- ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించే కట్టడాలకు తీర్పు వర్తించదని స్పష్టీకరణ
- నోటీసిచ్చి.. 15 రోజులు గడువు ఇవ్వాలి
- దేశమంతా వర్తించేలా మార్గదర్శకాలు

అధికారులేమీ జడ్జీలు కారు. ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించి, ఇళ్లను కూల్చివేసే అధికారం వారికి లేదు. సొంత ఇల్లు అన్నది సామాన్యుల కల. దాన్ని నెరవేర్చుకోవడంలో ఎన్నో ఏళ్ల శ్రమ ఉంటుంది. నిందితులకు కూడా రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉంటాయి. ఒక వ్యక్తి దోషి అయితే, మిగిలిన కుటుంబ సభ్యులందరినీ రోడ్డున పడేయడం సరికాదు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క నిర్మాణాన్ని కూల్చినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లే - సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, నవంబరు 13: "అధికారి న్యాయమూర్తిలా వ్యవహరించి, ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించలేరు. అలా నిర్ధారించి అతని నివాస/వాణిజ్య భవనాలను కూల్చివేసి, శిక్షించాలని నిర్ణయించడానికీ వీల్లేదు. అలాంటి అధికారం కార్యనిర్వాహక అధికారికి లేదు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏదైనా కేసులో నిందితుడు లేదా దోషిగా నిర్ధారించారన్న కారణంతో నిబంధనలను అనుసరించకుండా ఓ వ్యక్తి ఇంటిని కూల్చివేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. వివిధ కేసుల్లో

మిగతా 2వ పేజీలో...



కార్పొరేషన్ అప్పులూ ప్రభుత్వ అప్పులే

- వైసీపీ హయాంలో రాష్ట్ర బడ్జెట్ నుంచే వాటి చెల్లింపులు
- బడ్జెట్‌లో చూపని అప్పులకు చెల్లింపులు తీవ్ర ఉల్లంఘనే
- రెవెన్యూ వ్యయాన్ని మూలధన వ్యయంగా చూపారు
- ఇదీ ఉల్లంఘనే.. కాగ్ స్పష్టీకరణ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు కార్పొరేషన్లే చెల్లిస్తాయంటూ వైసీపీ హయాంలో అప్పటి మంత్రులు, అధికారులు పదేపదే చెప్పినవి అబద్ధాలేనని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఆ అప్పుల అసలు, వడ్డీల చెల్లింపులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర

మిగతా 2వ పేజీలో...

మనమే ప్రతిపక్షం

- ప్రజాసమస్యలపై ప్రశ్నలు వేద్దాం
- మనమే సమాధానాలూ చెబుదాం
- అందరం కలిసి టీమ్ వర్క్ చేద్దాం
- సభపై ప్రజల్లో గౌరవం పెంచుదాం
- చీఫ్‌విప్, విప్‌లకు చంద్రబాబు నిర్దేశం

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):"అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర కూడా ఎన్డీయేనే పోషించాలి. ప్రశ్నలు మనమే వేద్దాం.. సమాధానాలూ మనమే చెబుదాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొత్తగా ఎంపికైన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సహా కూటమి పార్టీలకు చెందిన విప్‌లు బుధవారం ఉదయం అసెంబ్లీలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. "చీఫ్ విప్, విప్‌లపై పెద్ద బాధ్యత ఉంటుంది. ప్రజలంతా అసెంబ్లీలో జరుగుతున్న చర్చలు, ప్రసంగాలను చూస్తుంటారు. కాబట్టి

మిగతా 9వ పేజీలో...



2

రాష్ట్రాల్లో అణు విద్యుత్ ప్లాంట్లు

బొగ్గు లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరిన కేంద్రం



2

స్థానిక భాషల్లో వైద్య విద్య

వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లు.. ప్రధాని నరేంద్ర మోదీ



జలవనరుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ అధికారులు

పెన్నాకు గోదారి!

నదుల అనుసంధానంపై మళ్లీ కదలిక

- గోదావరి-కృష్ణా-పెన్నా ప్రాజెక్టుపై కూటమి సర్కారు కసరత్తు
- సీమ, దక్షిణ కోస్తాకు రోజుకు 2 టీఎంసీల మిగులు జలాలు
- పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంపు
- వైకుంఠపురం నుంచి బొల్లాపల్లికి.. అక్కడ కొత్త రిజర్వాయర్
- బొల్లాపల్లి నుంచి బనకచర్లకు జలాలు.. అట్నుంచి సోమశిల, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా కాలువలకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదన దశలోనే ఉన్న గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధాన ప్రక్రియ కార్యరూపం దాల్చడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆర్థిక సమస్యలున్నా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించడంపై దృష్టిసారిస్తోంది. రాయలసీమలోని ఉమ్మడి

మిగతా 13వ పేజీలో...



అమరావతికి మహా వరం


ఔటర్, తూర్పు బైపాస్ భూసేకరణ ఖర్చు భరిస్తాం.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం హామీ

- చంద్రబాబు ప్రయత్నాలతో తప్పిన రూ.6 వేల కోట్లకుపైగా ఆర్థిక భారం
- రాజధానిలో రోడ్ల పనులకూ ఊపు
- కేంద్ర వార్షిక ప్రణాళికలో బైపాస్
- త్వరలో ఔటర్‌పైనా నిర్ణయం
- ప్రతిగా స్టేట్ జీఎస్టీ, పన్నుల నుంచి మినహాయింపును కోరిన కేంద్రం
- అంగీకరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమరావతి శీఘ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించింది. రాజధాని అభివృద్ధిలో కీలకమైన రెండు ప్రాజెక్టుల భూసేకరణ ఖర్చును కేంద్రమే భరించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (ఎంవోఆర్‌టీహెచ్) సానుకూలత వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టుల్లో ఒకటి 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు. మరొకటి 59 కిలోమీటర్ల పొడవైన తూర్పు బైపాస్. ఈ రహదారుల నిర్మాణం చేయాలంటే వేల ఎకరాల భూమిని సేకరించాలి. ఇందుకు రూ.6 వేల కోట్లపైనే నిధులు అవసరం. ఏపీకి ఉన్న అప్పులు, ఆర్థిక కష్టాల నేపథ్యంలో భూ సేకరణ చేసే స్థోమత సర్కారుకు లేదు. ఆ ఖర్చును కేంద్రమే

మిగతా 2వ పేజీలో...



కోచింగ్ సెంటర్ల మోసాలకు చెక్

- తప్పుడు యాడ్స్ ఇస్తే తప్పదు జరిమానా
- విద్యార్థుల అనుమతి లేకుండా వారి ఫొటోలు, వివరాలు ప్రచురించకూడదు
- కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, నవంబరు 13: కోచింగ్ సెంటర్ల మోసపూరిత అడ్వర్టైజ్‌మెంట్లకు చెక్ పెట్టేలా కేంద్రం కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. వంద శాతం సెలెక్షన్ అని, కచ్చితంగా జాబ్ వస్తుందని తమ రిజల్ట్‌ను ఎక్కువ చేసి చూపిస్తూ కోచింగ్ సెంటర్లు తప్పుదోవ పట్టించేలా ఇచ్చే యాడ్స్ నుంచి విద్యార్థులకు

మిగతా 2వ పేజీలో...

కోచింగ్ సెంటర్ల మోసాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ కల్పించే ఉద్దేశంతో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) బుధవారం ఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్యలు తీసుకుంది. వినియోగదారుల చట్టం ప్రకారం తీసుకొచ్చిన ఈ కొత్త మార్గదర్శకాలు అతిక్రమించిన కోచింగ్ సెంటర్లకు జరిమానా విధిస్తారు. ఇప్పటికే 54 నోటీసుల ద్వారా కోచింగ్ సెంటర్లకు రూ. 54.6 లక్షల జరిమానా విధించామని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే పేర్కొన్నారు. తమ లక్ష్యం కోచింగ్ సెంటర్లను తక్కువ చేసి చూపడం కాదని, కానీ వినియోగదారులకు సరైన సమాచారం అందించేలా చూడటం అని ఆమె తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం.. ఆఫర్ చేసే కోర్సులు, కాలపరిమితి, ఫ్యాకల్టీల విద్యార్హత, ఫీజు వసూళ్లు, రిఫండ్ పాలసీలు, సెలెక్షన్ శాతం, ర్యాంకింగ్స్, జాబ్ గ్యారెంటీ అలాగే సెక్యూరిటీ తదితర వివరాలు తప్పుగా ప్రచురించడాన్ని నిషేధించారు. కోచింగ్ సెంటర్లు ఇచ్చే డిజిటల్, ప్రింట్, ఔట్‌డోర్ తదితర యాడ్స్‌లో తామందించే కోర్సులు, ఫ్యాకల్టీ అర్హతలు, మౌలిక సదుపాయాల వివరాలు స్పష్టంగా, కచ్చితమైన సమాచారంతో ప్రచురించాలి. విజేతలైన విద్యార్థుల నుంచి అనుమతి పత్రం లేకుండా వారి ఫొటోలు, పేర్లు, ఇతర వివరాలు కోచింగ్ సెంటర్లు వినియోగించడానికి వీల్లేదు. ఏఐసీటీఈ, యూజీసీ తదితర సంస్థల నుంచి అనుమతి ఉన్న కోర్సుల వివరాలు కోచింగ్ సెంటర్లు తమ యాడ్స్‌లో స్పష్టంగా పేర్కొనాలి. అయితే ఈ నిబంధనల నుంచి కౌన్సెలింగ్, స్పోర్ట్స్, సృజనాత్మక సంబంధిత కోచింగ్ సెంటర్లకు మినహాయింపు ఇచ్చారు.

రాష్ట్రాల్లో అణు విద్యుత్ ప్లాంట్లు

న్యూఢిల్లీ, నవంబరు 13: థర్మల్ పవర్ ప్లాంట్ల జీవితకాలం ముగిసిన రాష్ట్రాలతోపాటు బొగ్గు లభ్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలు అణు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును పరిశీలించాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కోరారు. మంగళవారం మంత్రి అధ్యక్షతన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యుత్ మంత్రుల సదస్సు నిర్వహించారు. పెట్టుబడుల లక్ష్యాలను చేరుకోవడానికి విద్యుత్ సంస్థలను గుర్తించి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ చేయాలని మంత్రి సూచించారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచాలని రాష్ట్రాలను కోరిన ఖట్టర్.. దానిని సాధించడానికి ప్రసార వ్యవస్థలను మెరుగుపర్చాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

వయనాడ్‌లో తగ్గిన పోలింగ్.. 65% నమోదు

న్యూఢిల్లీ, నవంబరు13: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో 65% పోలింగ్ నమోదైంది. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏప్రిల్‌లో పోటీ చేసినప్పటితో పోలిస్తే 9% పోలింగ్ తక్కువగా నమోదైంది. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసి నెగ్గిన రాహుల్ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఇక్కడి నుంచి ప్రియాంక గాంధీ తొలిసారిగా రాజకీయాల్లోకి దిగి, తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పోలింగ్ శాతం తగ్గడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. రాజస్థాన్‌లో 7, పశ్చిమబెంగాల్‌లో 6, అస్సాంలో 5, బీహార్‌లో 4, కర్ణాటకలో 3, మధ్యప్రదేశ్‌లో 2, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మేఘాలయలో ఒక్కో నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పశ్చిమబెంగాల్‌లోని భట్‌పారాలో జరిగిన హింసలో టీఎంసీ కార్యకర్త హత్యకు గురయ్యాడు.

అమరావతిలోనే హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త!

» కార్యాలయాల ఏర్పాటుపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవహక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ), లోకాయుక్త కార్యాలయాలను అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి హైకోర్టుకు నివేదించారు. ఇందుకు సంబంధించి చట్టసవరణ చేసి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేశారు. హెచ్‌ఆర్‌సీలో సిబ్బంది నియామకంతోపాటు ఫిర్యాదుల స్వీకరణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ మరో పిల్ వేసింది. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరపు న్యాయవాదులు డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబు, నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. రాజధాని అమరావతిలో ఏర్పాటు కానున్న జస్టిస్ సిటీలో అన్ని కోర్టులు, ట్రైబ్యునళ్లు, న్యాయ సంబంధిత సంస్థలను నెలకొల్పేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే, ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. ఎస్‌జీపీ స్పందిస్తూ కార్యాలయాలను అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని ధర్మాసనానికి నివేదించారు.

హెచ్‌ఆర్‌సీలో నియామకాలపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్, ఇతర సభ్యుల నియామకం విషయంలో తీసుకుంటున్న చర్యలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఏపీహెచ్‌ఆర్‌సీకి ఛైర్మన్‌తోపాటు ఇతర సభ్యులను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం బుధవారం ఇదే ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ ఏడాది మార్చి 15న నామినేషన్లను ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, తర్వాత ఎలాంటి పురోగతీ లేదని తెలిపారు. దీనిపై ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... ఛైర్మన్, సభ్యుల నియామకానికి తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వానికి చెప్పామని, త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

మస్క్, వివేక్‌కు కీలక బాధ్యతలు

» ట్రంప్ కొత్తగా సృష్టించబోయే డీఓజీఈకి నేతృత్వం

వాషింగ్టన్, నవంబరు 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ తన కేబినెట్ కూర్పుపై దృష్టి సారించారు. కీలక విభాగాలకు సమర్థులను ఎంపిక చేసేందుకు గట్టిగా కసరత్తు చేస్తున్నారు. అమెరికా చరిత్రలోనే తొలిసారిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డీఓజీఈ) ఏర్పాటు చేసి, దీని నేతృత్వ బాధ్యతలను మస్క్, వివేక్ రామస్వామికి అప్పగించాలని భావిస్తున్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రక్షాళన, అనవసరపు ఖర్చుల తగ్గింపు, మితిమీరిన నిబంధనలకు కోత పెట్టడంతోపాటు ఫెడరల్ ఏజెన్సీల పునర్‌నిర్మాణం బాధ్యతలను డీఓజీఈ చూస్తుంది. 2026 జులై 4వ తేదీలోపు మస్క్, వివేక్ రామస్వామి టాస్క్ పూర్తవుతుంది. సేవ్ అమెరికా-2 ఉద్యమానికి ఇది ఎంతో ముఖ్యమన్న ట్రంప్ తన పాలనకు వీరిద్దరూ మార్గం సుగమం చేస్తారంటూ ప్రకటన విడుదల చేశారు.

బుల్డోజర్ న్యాయానికి సుప్రీం బ్రేక్!



(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. 'బుల్డోజర్ న్యాయాని'కి బ్రేకులు వేసింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలయ్యేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అధికారులు ఒక వ్యక్తిని దోషిగా తేల్చలేరని, న్యాయమూర్తిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, అధికారులు హద్దుమీరి చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేతలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల వేతనాల నుంచి వసూలు చేయాలని ధర్మాసనం తన 95 పేజీల తీర్పులో పేర్కొంది. తీర్పు రాసే ముందు జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రజల సొంత ఇంటి కలపై ప్రముఖ హిందీ కవి ప్రదీప్ రాసిన కవితను ఉటంకించారు. "సొంత ఇల్లు ఉండాలనేది ప్రతి ఒక్కరి కల. ఇది ప్రతి ఒక్కరి హృదయంలోనూ ఉంటుంది. ఏ ఒక్కరూ తమ కలను కోల్పోవాలని ఎప్పుడూ కోరుకోరు" అని పేర్కొంటూ తీర్పును ప్రారంభించారు. సొంత ఇల్లు అనేది ఓ వ్యక్తి లేదా కుటుంబం ఆశ, కల అని.. అది వారి స్థిరత్వం, భద్రతకు సంబంధించిన అంశం కూడా అని ధర్మాసనం పేర్కొంది. కుటుంబం లేదా కుటుంబాల ఆవాసాన్ని కూల్చేసే అధికారం ఓ అధికారికి ఉంటుందా? అన్నది ప్రశ్న అని.. అలాగే ఓ వ్యక్తి దోషి అయినంత మాత్రాన కుటుంబం మొత్తాన్ని శిక్షించడం సరికాదని స్పష్టం చేసింది. ఇల్లు అనేది పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపింది. స్థానిక మునిసిపల్ చట్టాలను ఉల్లంఘించిన వారి ఆస్తులనే కూల్చివేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలపగా.. చట్టాలను ఉల్లంఘించిన వారందరి ఇళ్లనూ కూల్చలేదని, కొందరివే కూల్చారని ధర్మాసనం పేర్కొంది. తమ తీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని తెలిపింది. ఈ తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు సర్క్యులర్లు జారీ చేయాలని ఆదేశించింది.

మార్గదర్శకాలు ఇవే..

- షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టరాదు. ఒకవేళ కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తే.. వాటిపై అప్పీలుకు వెళ్లేందుకు యజమానులకు సమయం ఇవ్వాలి.
- ఎలాంటి గడువూ ఇవ్వకుండా రాత్రికిరాత్రే ఇళ్లు కూల్చివేయడం సరికాదు. మహిళలు, చిన్నారులు రోడ్లపైకి రావడం మంచిది కాదు.
- ప్రభుత్వ ఆస్తుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలు లేదా కూల్చివేయాలంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చిన నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించవు.
- షోకాజ్ నోటీసులు ఇళ్లు/భవనాల వెలుపల అతికించాలి. కూల్చివేతకు 15 రోజులు ముందుగానే నోటీసు ఇవ్వాలి. నోటీసు ఇచ్చిన తర్వాత, దాని గురించి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలి.
- మునిసిపల్ భవనాల కూల్చివేతలకు గాను కలెక్టర్లు నోడల్ అధికారులను నియమించాలి.
- నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనకు పాల్పడ్డారు? వ్యక్తిగత విచారణకు నిర్ణయించిన తేదీ? దాన్ని ఎవరు నిర్ధారించారు? వంటి వివరాలన్నీ నోటీసులో ఉండాలి. మునిసిపల్ అధికారులు మూడు నెలల్లో డిజిటల్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. జారీ చేసిన ఆదేశాలు, నోటీసుల వివరాలను డిజిటల్ పోర్టల్‌లో పెట్టాలి.
- అధికారులు బాధితుల వాదనలను వినాలి. సంబంధిత మినిట్స్‌ను రికార్డు చేయాలి. ఆ తర్వాతే తుది ఆదేశాలు జారీ చేయాలి. అక్రమ కట్టడం పూర్తిగా కూల్చేస్తారా? పాక్షికంగా కూలుస్తారా? అసలు కూల్చివేయాలన్న తీవ్రమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నారన్న వివరాలను తెలియజేయాలి. పూర్తి వివరాలతో కూడిన తుది ఆదేశాలను డిజిటల్ పోర్టల్‌లో పెట్టాలి.
- అక్రమ కట్టడాలని తేలితే వాటిని 15 రోజుల్లోగా కూల్చివేయడం లేదా తొలగించడానికి సంబంధిత యజమానికి అవకాశం ఇవ్వాలి. ఆలోపు అప్పీలేట్ సంస్థ స్టే ఇవ్వకపోతే కూల్చివేతలు చేపట్టాలి. కూల్చివేత ప్రక్రియను వీడియో తీయడంతో పాటు దాన్ని భద్రపరచాలి.
- కోర్టు ఆదేశాలను పాటించని అధికారులపై ధిక్కరణ చర్యలు ఉంటాయి. కూల్చిన ఆస్తుల పునరుద్ధరణ, బాధితులకు పరిహారాన్ని సంబంధిత అధికారులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఈ ఆదేశాలివ్వాలి.

సొంత ఇల్లు ఎన్నో ఏళ్ల కల..

"ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు ఉంటాయి. అందులో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయితే.. అక్కడ నివసించే విగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..?" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇల్లు, భవనాలను కూల్చే అధికారం కార్యనిర్వాహక అధికారులకు లేదని స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలు చేపట్టరాదని ఆదేశించింది. షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా కూల్చివేతలు చేపట్టరాదని.. అక్రమ కట్టడాల తొలగింపునకు ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలని పేర్కొంది. అయితే తమ ఆదేశాలు ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలకు వర్తించవని స్పష్టం చేసింది. ఏదైనా కేసులో నిందితుడు లేదా దోషిగా తేలినప్పటికీ.. వారికి కూడా రాజ్యాంగం కల్పించిన హక్కులు వర్తిస్తాయని ధర్మాసనం పేర్కొంది. న్యాయసూత్రాల ప్రకారం ఒక వ్యక్తి దోషిగా తేలే వరకు అతను అమాయకుడేనని.. ఆలోపే నిర్మాణాలను కూల్చివేయడమంటే మొత్తం కుటుంబ సభ్యులను శిక్షించినట్లేనని, రాజ్యాంగం ప్రకారం దానికి అనుమతి లేదని తెలిపింది. కూల్చివేతల నిర్ణయాలు తీసుకునే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారులు జవాబుదారీగా ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వ్యక్తుల స్వేచ్ఛను కాపాడడం కూడా ప్రధానమని గుర్తుచేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క నిర్మాణాన్ని కూల్చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేసింది.

లోకం తీరు



భారత్‌కు 'శ్వేత హంసలు'

టీయూ-160ఎం యుద్ధ విమానాల సరఫరాకు రష్యా సంసిద్ధత

న్యూఢిల్లీ, నవంబరు 13: సరిహద్దుల్లో పాకిస్థాన్, చైనాతో ఇబ్బందులు ఎదురవుతున్న వేళ.. భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే అద్భుత అవకాశం తలుపుతట్టింది. పొడవైన రెక్కలతో.. భారీ బాంబర్లతో శత్రువులపై విరుచుకుపడే బాంబర్ యుద్ధవిమానాలు టీయూ-160ఎం 'వైట్ స్వాన్'లను భారత్‌కు ఇచ్చేందుకు రష్యా సంసిద్ధత వ్యక్తం చేసింది. దీన్ని తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. పొడవైన రెక్కలు కలిగిన ఈ భారీ యుద్ధవిమానాలను తీసుకుంటే రన్‌వేలను పునరుద్ధరించాల్సి ఉంటుంది. అలాగే పైలట్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాల్సి ఉంటుంది. ఇవి గనుక అందుబాటులోకి వస్తే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో బలమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టు అవుతుంది.

- రష్యా వద్ద ఇప్పటికే ఉన్న టీయూ-160 యుద్ధ విమానానికి ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్.
- ప్రపంచంలోనే వేగంగా ఎగిరే సూపర్ సోనిక్ యుద్ధ విమానం, బరువైన పేలోడ్లను మోసుకెళ్లే బాంబర్ ఇదేనని రష్యా చెబుతోంది.
- దీనిలో నలుగురు సిబ్బంది కూర్చోవచ్చు. 12 దీర్ఘశ్రేణి క్షిపణులు లేదా 12 స్వల్పశ్రేణి అణు క్షిపణులను ఇది మోసుకెళ్లగలదు.
- దీనిలో నాలుగు ఇంజన్లు ఉంటాయి. ఒక్కసారి ఇంధనం నింపితే ఏకబిగిన 12 వేల కిలోమీటర్లు ప్రయాణించగలదు.
- ఇది 16వేల మీటర్ల ఎత్తులో గంటకు 2,220 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు.

శబరిమలలో కొత్తకొత్తగా..!

'స్వామి' పేరుతో యాత్రికుల కోసం చాట్‌బాట్.. మూడు చోట్ల వాతావరణ కేంద్రాలు

» దర్శనం వేళలు 18 గంటలకు పెంపు

(సెంట్రల్ డెస్క్)

శబరిమల యాత్రికులకు సేవల కోసం కేరళ ప్రభుత్వం 'స్వామి' పేరుతో చాట్‌బాట్ అందుబాటులోకి వచ్చింది. కేరళ సీఎం పినరయి విజయన్ బుధవారం 'స్వామి' చాట్‌బాట్ లోగోను ప్రారంభించారు. స్మార్ట్‌ఫోన్ ఇంటర్‌ఫేస్ ద్వారా భక్తులకు ఆరు భాషల్లో-- ఆంగ్లం, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో అయ్యప్ప స్వామి స్వయంగా వివరాలు అందించినట్లుగా సమగ్ర వివరాలు లభ్యమయ్యేలా ఈ చాట్‌బాట్‌ను రూపొందించారు. శబరిమలలో పూజాసమయాలు, ఇతర విశేషాలే కాకుండా.. భక్తులు విమానాలు, రైళ్లు, స్థానిక పోలీసుల వివరాలు, అటవీశాఖ సేవలను 'స్వామి' ద్వారా పొందవచ్చు. శబరిమల నడక మార్గాల్లో భక్తులకు వాతావరణ హెచ్చరికలను జారీ చేసేందుకు భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) శబరిమల చరిత్రలోనే తొలిసారి మూడు వాతావరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తిరువనంతపురం ఐఎండీ డైరెక్టర్ నీతా.కె.గోపాల్ బుధవారం తొలి బులెటిన్‌ను విడుదల చేశారు. గురు, శుక్రవారాల్లో శబరిమలలో భారీ వర్షాలు కురుస్తాయని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఇటీవల నెలవారీ పూజలకు కూడా భక్తులు శబరిమలకు పోటెత్తడంతో.. మండల, మకరవిళక్కు నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ వెల్లడించారు. గురువారం నుంచి మండల పూజల సీజన్ ప్రారంభమవుతుందని, భక్తుల సౌకర్యార్థం స్వామివారి దర్శన సమయాన్ని 18 గంటలకు పొడిగిస్తున్నామన్నారు. "తెల్లవారుజామున 3 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. తిరిగి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తాం. రోజుకు 80 వేల మంది భక్తులకు దర్శనం టికెట్లను విడుదల చేస్తాం. వీటిల్లో 70 వేలు ఆన్‌లైన్ బుకింగ్ కాగా.. మరో 10వేలు స్పాట్‌బుకింగ్. ఎరుమేలి, వండిపెరియార్, పంపా వద్ద స్పాట్ బుకింగ్ కౌంటర్లుంటాయి" అని ఆయన వివరించారు. పదునెట్టాంబడి వద్ద సెల్‌ఫోన్లను నిషేధిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక భాషల్లో వైద్య విద్య

ఐదేళ్లల్లో కొత్తగా 75వేల మెడికల్ సీట్లు: మోదీ

దర్భంగా, నవంబరు 13 : డాక్టర్ అవ్వాలంటే ఏ ప్రాంతం వారైనా, ఏ కాలేజీలోనైనా సరే మన దేశంలో ఆంగ్ల మాధ్యమంలో వైద్య విద్య పాఠాలు చదువుకోవాల్సిందే. త్వరలో ఈ విధానంలో మార్పు రాబోతుంది. వైద్య విద్యను హిందీ సహా ఇతర భారతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. దర్భంగాలో ఎయిమ్స్ ఆస్పత్రి శంకుస్థాపన సహా రూ.12,100 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులను మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. స్థానిక భాషల్లో వైద్య విద్యపై ప్రకటన చేశారు. అలాగే, దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లల్లో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కాగా, స్థానిక భాషలో వైద్య విద్య బోధన జరగాలని తమిళనాడు సహా పలు రాష్ట్రాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ ఇప్పటికే వైద్య విద్య హిందీ మీడియం పుస్తకాలను విడుదల చేసింది. బిహార్‌లో వైద్య విద్యను హిందీలో అందిస్తామని ఆ రాష్ట్ర మంత్రి కూడా ప్రకటించారు.



మోదీకి నితీశ్ పాదాభివందనం !

దర్భంగాలో జరిగిన సభలో బిహార్ సీఎం నితీశ్ ప్రధాని మోదీకి పాదాభివందనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్న మోదీ.. నీతీశ్‌తో కరచాలనం చేశారు. అంతేకాక, పార్టీ కార్యకర్తలు మోదీని గజమాలతో సత్కరిస్తుండగా ఆయన నితీశ్‌ను కూడా తన పక్కకు లాగి గౌరవం ఇచ్చారు. మోదీకి నితీశ్ పాదాభివందనం చేయడం ఈ ఏడాదిలో ఇది మూడో సారి.



ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌తో ట్రంప్ బుధవారం వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వెల్‌కమ్ బ్యాక్ ట్రంప్ అని బైడెన్ శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 20న జరిగే అధికార మార్పిడి ప్రక్రియ శాంతియుతంగా పూర్తవ్వడంపై ఇరువురు చర్చించారు.

విగత జీవిగా యజమాని.. రోదించిన మూగజీవి!

మనుషులు వెళ్లేందుకు సాహసించని మృతదేహం వద్దకు ఓ శునకం వెళ్లి.. తన విశ్వసనీయతను ఘనంగా చాటుకుంది. యజమాని మృతదేహంపై పడుకుని.. అక్కడున్న మనుషుల కళ్లు తెరిపించింది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం బండారుపల్లిలో పశువులకు గడ్డి తెచ్చేందుకు బుధవారం యశోదమ్మ (35) పొలానికి వెళ్లారు. గడ్డి మోపును ఇంటికి తెస్తుండగా.. గడ్డి పరకలు కంట్లో పడి దారి కనిపించక.. పొరపాటున పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లారు. ఎండుగడ్డి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి విగతజీవిగా మారారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పరుగు పరుగున అక్కడికి చేరుకున్నారు. వెళ్లడమైతే వెళ్లారుకానీ విద్యుత్ ప్రసరిస్తుందనే భయంతో.. మృతదేహం వద్దకు వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. ఈ ఘటనను చూసిన యశోదమ్మ పెంపుడు కుక్క విలవిల్లాడిపోయింది. యశోదమ్మ మృతదేహంపై పడుకుని తల్లడిల్లిపోయింది. అక్కడున్నవారంతా ఈ దృశ్యాన్ని చూసి నిశ్చేష్టులయ్యారు. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున వైరల్ అయ్యింది. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీకాళహస్తి



యజమాని మృతదేహంపై విలపిస్తున్న శునకం

అమరావతికి మహా వరం

(మొదటి పేజీ తరువాయి)

భరించాలని చంద్రబాబు ఇటీవల ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. అప్పుడు పరిశీలన చేస్తామని మాత్రమే కేంద్రమంత్రి చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబు సూచనల మేరకు ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి సీఎం విన్నపాల గురించి కేంద్రం వద్ద ప్రస్తావించారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, తూర్పుబైపాస్‌ల కోసం భూ సేకరణకు అయ్యే ప్రతీ రూపాయి తామే భరిస్తామని ఎంవోఆర్‌టీహెచ్ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక సమాచారం ఇచ్చింది. ప్రతిగా, పరోపకారం కింద తమకు స్టేట్ జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఇందుకు సర్కారు కూడా సరేనంది. స్టేట్ జీఎస్టీని మినహాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు ఆరువేల కోట్ల (ఔటర్ 4వేలు, తూర్పుబైపాస్ 2వేల కోట్లు) భారం తప్పింది. ఇదంతా సీఎం చంద్రబాబు చొరవతోనే జరిగిందని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

అద్భుతమైన ముందడుగు...

తెలుగుదేశం ప్రభుత్వం 2014-19 కాలంలోనే అమరావతి ఔటర్ రహదారి నిర్మాణం ప్రతిపాదించింది. దీన్ని భారత్‌మాల చాలెంజింగ్ కార్యక్రమం కింద చేర్చి అమలు చేసేందుకు కేంద్రం అప్పట్లో అంగీకరించింది. అయితే, భూ సేకరణ ఖర్చు సగం భరించాలని కేంద్రం షరతు విధించింది. దీనిపై చర్చోపచర్చలు సాగుతుండగానే ఎన్నికలు జరిగి జగన్ అధికారంలోకి వచ్చారు. అమరావతి రాజధానినే ధ్వంసం చేసిన జగన్, దానికోసం ఉద్దేశించిన ఔటర్ ప్రాజెక్టును కూడా పక్కనపెట్టించారు. కానీ, అప్పటికే అలైన్‌మెంట్, భూ సేకరణ డీపీఆర్‌లు రెడీ అయ్యాయి. ఈ ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం వ్యతిరేకించిందన్న కారణంతో కేంద్రం కూడా పక్కనపెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలివిడత ఢిల్లీకివెళ్లినప్పుడు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి పెద్ద ప్రజంటేషన్ ఇచ్చారు. అమరావతి ఔటర్‌కు రూ.26 వేల కోట్ల నిర్మాణ వ్యయం కానుంది. ఇందులో భూసేకరణ వ్యయం 4వేల కోట్లపైనే. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణంతోపాటు, భూ సేకరణ కేంద్రమే చేయాలని చంద్రబాబు గట్టిగా కోరడం సత్ఫలితాన్నిచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణంలో ఇదో అద్భుతమైన ముందడుగు అని మంత్రి జనార్దన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాగా, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఏ స్కీమ్ కింద చేపట్టాల్నో కేంద్ర రోడ్డు రవాణా శాఖ పరిశీలన చేస్తోంది. ఈ ప్రాజెక్టుపై డీపీఆర్ తయారు చేయాల్సి ఉంది.



చంద్రబాబును కలిసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్

విజనరీ ఉన్న నేత చంద్రబాబు

» అమరావతిని అద్భుతంగా తయారు చేస్తారు

» పిల్లల్లో శాస్త్రీయ ఉత్సుకత పెంచాలి

» ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్ ఉద్బోధ

విజయవాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంచి విజనరీ ఉన్న నాయకుడని ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్ వ్యాఖ్యానించారు. ఆయన అమరావతిని అద్భుతంగా తయారు చేస్తారన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో విజయవాడలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి 'గానం-ధ్యానం-జ్ఞానం' పేరిట జరిగిన మహాసత్సంగ్ కార్యక్రమంలో రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. జీవితం ఒక మహావృక్షమని, దానికి ఉండే వేళ్లు పురాతనమైతే, ఆకులు, పూలు నూతనమని ఆయన చెప్పారు. పిల్లల్లో శాస్త్రీయ ఉత్సుకతను తల్లిదండ్రులు పెంచాలన్నారు. అనేక విశేషాల సమ్మేళనమే సంస్కృతి అని, ప్రజలంతా వసుధైక కుటుంబంలా ఉండాలన్నారు. జీవితంలో ఒత్తిడితో ఎంతోమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఆత్మహత్య భావనను ఆధ్యాత్మిక శక్తి ద్వారా దూరం చేసుకోవచ్చునని ఆయన సూచించారు. ప్రపంచ శాంతి కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ పనిచేస్తోందని, ప్రపంచంలో 25 వేలమంది ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో టీచర్లుగా 10 వేల కేంద్రాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. గానం, ధ్యానం, జ్ఞానం మనిషి జీవితాన్ని మలుపు తిప్పుతాయని చెప్పారు. రాజధాని అమరావతికి, కృష్ణానదికి చెంతనే ఉన్న విజయవాడను హ్యాపీయెస్ట్ సిటీ చేయడానికి ప్రజలు కంకణం కట్టుకోవాలని గురూజీ రవిశంకర్ కోరారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైనవారితో రవిశంకర్ 15 నిమిషాలపాటు ధ్యానం చేయించారు.

చంద్రబాబును కలిసిన రవిశంకర్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో గురూజీ రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రవిశంకర్‌కు సీఎం సాదరంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం అనేక విషయాలపై వారిద్దరు ముచ్చటించుకున్నారు.

కార్పొరేషన్ అప్పులూ ప్రభుత్వ అప్పులే

(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్ నుంచే రూ.10,037 కోట్లు ఖర్చు చేశారని తెలిపింది. ఈ అప్పులను బడ్జెట్లో చూపకుండా వాటి తిరిగి చెల్లింపులకు బడ్జెట్ నుంచి నిధులు వాడటం తీవ్రమైన ఉల్లంఘనగా పేర్కొంది. అలాగే, కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు కోసం ఇచ్చిన నిధుల్లో రూ.2,844 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయిందని తెలిపింది. మూలధన వ్యయంలో గత ఆర్థిక సంవత్సరం వైసీపీ ప్రభుత్వం వెనుకబడింది. బడ్జెట్‌లో రూ.27,308 కోట్లు కేటాయించగా, రూ.23,330 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారని కాగ్ తెలిపింది. అలాగే, గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వ్యయాన్ని, మూలధన వ్యయంగా చూపించారని, ఇది కూడా ఉల్లంఘనే అని కాగ్ పేర్కొంది. జీఎస్‌డీపీలో 9 శాతం వృద్ధి నమోదైనట్లు వెల్లడించింది. 2023-24లో అప్పులపై వడ్డీల కోసం రూ.29,481 కోట్లు చెల్లించారని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ల అప్పులు మినహా రాష్ట్ర ఇతర అప్పులు రూ.4.15 లక్షల కోట్లకు పైగా ఉన్నాయని, జీఎస్‌డీపీలో ఇది 34 శాతమని కాగ్ పేర్కొంది.

'ప్రకాశం' డీఎల్‌డీవో టి.ఉషారాణి సస్పెన్షన్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా మాజీ పంచాయతీ అధికారి, డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి టి.ఉషారాణిని ప్రభుత్వం బుధవారం సస్పెండ్ చేసింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించి భారీగా డబ్బు తీసుకుని బదిలీలు నిర్వహించినట్టు నిరూపితం కావడంతో ఆమెను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కలెక్టర్ ఆదేశాలు పక్కన పెట్టి ఉషారాణి ఇష్టారీతిన బదిలీలు నిర్వహించినట్టు సస్పెన్షన్ ఉత్తర్వులో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ వదిలివెళ్లకూడదని ఆదేశించారు.

అసెంబ్లీ తర్వాతే నీటి సంఘాల ఎన్నికలు

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభా సమావేశాల తర్వాత రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జల వనరుల శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే విడుదల చేసిన షెడ్యూల్ మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలు గురువారం నుంచి చేపట్టాల్సి ఉంది. అయితే .. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22 తర్వాత సాగునీటి సంఘాలకుఎన్నికలు జరుగుతాయి.

ఎయిడెడ్ కాంట్రాక్టు టీచర్లకు జీతాలు విడుదల

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో జీవో 58 ద్వారా కాంట్రాక్టు టీచర్లుగా విధుల్లో చేరిన వారికి జీతాలు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవో ప్రకారం గతేడాది విధుల్లో చేరిన సుమారు వంద మంది టీచర్లకు వైసీపీ ప్రభుత్వం జీతాలు విడుదల చేయలేదు. ఆ సమస్య ఇటీవల ప్రభుత్వం దృష్టికి రావడంతో వెంటనే వారి జీతాల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. టీచర్స్ గిల్డ్ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మరింత సులభంగా శ్రీవాణి దర్శన టికెట్లు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



శ్రీవాణి దర్శన టికెట్‌ను అందజేస్తున్న టీటీడీ అదనపు ఈవో

తిరుమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇచ్చే శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేసినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గోకులం సమావేశ మందిరం వెనుక వైపు శ్రీవాణి దర్శన టికెట్ల నూతన కౌంటర్‌ను ఆయన బుధవారం ఉదయం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వయంగా భక్తుల వద్ద వివరాలు తీసుకుని మొదటి టికెట్‌ను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న శ్రీవాణి కౌంటర్ క్యూలైన్‌లో వర్షం పడినప్పుడు భక్తులు ఇబ్బంది పడటాన్ని గుర్తించి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. శ్రీవాణి భక్తులు ఇకపై ఎలాంటి అసౌకర్యం లేకుండా టికెట్లు పొందవచ్చన్నారు. రోజుకు 900 టికెట్లు ఆఫ్‌లైన్ ద్వారా కేటాయిస్తున్నట్టు తెలిపారు. గతంలో టికెట్ కేటాయింపునకు 3 నుంచి 4 నిమిషాలు పట్టేదని, ప్రస్తుతం ఒక నిమిషంలో భక్తులకు టికెట్ కేటాయించేలా అప్లికేషన్‌లో మార్పులు చేసినట్టు వివరించారు. ఐదు కౌంటర్ల ద్వారా భక్తులు సులభతరంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తాలిబాన్‌తో స్నేహం

భారతదేశంలో అఫ్ఘానిస్థాన్ రాయబారిగా ఇక్రముద్దీన్ కమిల్‌ను తాలిబాన్ ప్రకటించింది. ముంబైలోని అఫ్ఘానిస్థాన్ దౌత్యకార్యాలయంనుంచి ఈ యువవిద్యార్థి తన కార్యకలాపాలు నిర్వహిస్తాడని తాలిబాన్ మంత్రి ప్రకటించారు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తరువాత, ఆ ప్రభుత్వాన్ని ఇంకా భారత్ అధికారికంగా గుర్తించాల్సి ఉండగా జరిగిన తొలి నియామకం ఇది. భారత ప్రభుత్వం ఇంకా ఆమోదించవలసి ఉన్నప్పటికీ, కమిల్ పేరును రెండుదేశాలు ఇప్పటికే ఏకమాటగా అనుకున్నాయని వార్త. కమిల్ భారత్‌లో ఏడేళ్ళపాటు చదువుకున్నాడు. మనదేశం ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో న్యాయశాస్త్రంలో డాక్టరేట్ చేశాడు. ముంబైలోనే ఉంటూ ఇప్పటికే అనధికారికంగా తన విధులు నిర్వహిస్తున్నాడని, భారతదేశంలో అఫ్ఘాన్ల శ్రేయస్సుకోసం పనిచేస్తున్న అఫ్ఘాన్ జాతీయుడన్న గుర్తింపుతో మన ప్రభుత్వ వ్యవస్థ అతడికి సహకరిస్తున్నదని వార్తలు వెలువడ్డాయి. తాలిబాన్ పాలనను గుర్తించనప్పటికీ, రెండుదేశాల మధ్యా సంబంధాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తమదేశంలో దౌత్యవేత్తలను నియమించి, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి, గతంలో మాదిరిగా భారత్ సన్నిహితంగా ఉండవచ్చునని తాలిబాన్ ఎప్పటినుంచో అంటోంది. ఇప్పుడు కమిల్ నియామకాన్ని ఆమోదించిన పక్షంలో దౌత్యసంబంధాన్ని భారత్ పునరుద్ధరించినట్టు లెక్క. కొత్తగా ఏ గుర్తింపూ ఇవ్వకుండానే అతడితో మనదేశం వ్యవహరించవచ్చునన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి.

భారత విదేశీవ్యవహారాలశాఖలో, పాకిస్థాన్–అఫ్ఘానిస్థాన్–ఇరాన్ వ్యవహారాల విభాగంలో జాయింట్ సెక్రటరీగా ఉన్న జేపీ సింగ్ గతవారం కాబూల్‌లో పర్యటించారు. అఫ్ఘాన్ రక్షణ, విదేశాంగమంత్రులతో చర్చల్లో, అనేక అంశాలతో పాటు, కమిల్ నియామకానికి కూడా అంగీకారం కుదిరిందని అంటారు. ఐక్యరాజ్యసమితిలో స్థానం గురించి తాలిబాన్ తహతహలాడుతున్న తరుణంలో మనం ఇలా సంబంధాలు నెలకొల్పుకోవడానికి ఉత్సాహపడుతున్నామని విశ్లేషకులు అంటున్నారు.

జేపీ సింగ్ పర్యటనలో అఫ్ఘాన్ రక్షణమంత్రి మహ్మద్ ముజాహిద్ భారతదేశంపట్ల పూర్తి సానుకూల దృక్పథాన్ని స్పష్టపరుస్తూ, భారత వ్యతిరేక కార్యకలాపాలకు తమ గడ్డ అడ్డాకాబోదని గట్టిగా హామీ ఇచ్చారట. రెండవ విడత పాలనలో భారతదేశానికి సంబంధించినంతవరకూ గత మూడేళ్ళలో తాలిబాన్ ప్రవర్తన ఇబ్బందికరంగా లేనిమాట నిజం. ప్రధానంగా పాకిస్థాన్ మాటను విశ్వసించి, అఫ్ఘానిస్థాన్‌నుంచి అమెరికా తన సైన్యాన్ని ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఆ ప్రక్రియ కొనసాగుతూండగానే తాలిబాన్ సేనలు దేశాన్ని ఆక్రమించాయి. అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సంతోషంగా అల్లాను తలుచుకున్నారు. పాకిస్థాన్ చెప్పుచేతల్లో తాలిబాన్ ఉంటుందని, నచ్చినట్టుగా వాడుకోవచ్చునని ఆయన నమ్మారు. కానీ, ఇందుకు భిన్నంగా, స్వతంత్రంగా వ్యవహరించడంతో పాటు, లష్కర్, జైష్ వంటి పాక్‌ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను తాలిబాన్ తన భూభాగంలో ఏమాత్రం అనుమతించలేదు. పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐఎస్ఐ) ఆశీస్సులున్న ఇస్లామిక్ స్టేట్ అనుబంధ గ్రూపులతో పోరాడుతున్నది కూడా. దీనికితోడు, పాకిస్థాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్న తెహ్రీక్–ఎ–తాలిబాన్ వంటి సంస్థల కారణంగా ఆ రెండు దేశాల మధ్యా దూరం మరింత పెరిగిపోయింది. పాకిస్థాన్‌లో ఉంటున్న లక్షలాదిమంది అఫ్ఘాన్లను వెళ్ళగొట్టడం వరకూ సంబంధాలు చెడిపోయాయి. అఫ్ఘానిస్థాన్‌లో తన ప్రత్యేక ప్రతినిధి ఆసిఫ్ దురానీని సెప్టెంబరులో పాకిస్థాన్ ఉపసంహరించుకోవడం దిగజారుతున్న సంబంధాలకు నిదర్శనం.

ఈ నేపథ్యంలో, భారత్–అఫ్ఘాన్ దగ్గరకావడంలో ఆశ్చర్యమేమీ లేదు. గతంలో పార్లమెంట్ భవనం నిర్మాణం సహా చాలా ప్రాజెక్టులు చేపట్టిన భారతదేశంనుంచి మరింత సాయాన్ని, మరిన్ని మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని తాలిబాన్ కోరుతోంది. భారతదేశంలో అఫ్ఘాన్ జనాభా ఎక్కువగా ఉండటంతో పాటు, చదువుకోసం వైద్యంకోసం అక్కడనుంచి అధికులు వస్తున్న నేపథ్యంలో, వారికి విస్తృతమైన సేవలు అందించేందుకు కార్యాలయాలు తెరవాలని, నియామకాలు జరుపుకోవాలని కూడా ఆశిస్తోంది. గతంలో పోల్చితే అమానుషత్వం తగ్గినప్పటికీ, మహిళలు, విద్య, బహిరంగ శిక్షలు ఇత్యాది విషయాల్లో తాలిబాన్ పెద్దగా మారలేదు. రెండుదేశాలు పరస్పర ప్రయోజనాలకోసం కృషిచేయడమే కాక, భారత్‌తో సన్నిహిత సంబంధాలకు వీలుగా తాలిబాన్ మరికొంత మార్పు చెందవలసి ఉంది.

లక్ష పుస్తకాల సేకర్త!

నవంబర్ 14 నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం కూడా. ఇవి రెండూ కాక గ్రంథాలయ వారోత్సవాల ఆరంభం కూడా. ఈ శుభ సందర్భంలో ఒక గొప్ప వ్యక్తిని గూర్చి పాఠకులకు చెపుదాం అనుకుంటున్నాను.

తెలుగు రాష్ట్రాలలో పెద్ద వ్యక్తిగత గృహ గ్రంథాలయాలు కలిగివున్న నార్ల వెంకటేశ్వరరావు, ఆరుద్ర, కొంగర జగ్గయ్య, ఎ.బి.కె. ప్రసాద్, పొత్తూరి వెంకటేశ్వర రావు, చలసాని, సి.వి.యస్. ధన్ తదితరుల్ని గూర్చి వినే ఉంటారు. వీరిలో నార్ల గ్రంథాలు అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి, ఆరుద్ర పుస్తకాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి, ఎ.బి.కె. పుస్తకాలు సి.ఆర్. ఫౌండేషన్‌కి ఇచ్చి వేయబడ్డాయి. 5 వేల నుంచి 25 వేల వరకు పుస్తకాలు గల హోం లైబ్రరీలు, అనేకమంది ప్రముఖ సాహితీవేత్తల దగ్గర, పాత్రికేయుల దగ్గరా, వామపక్ష రాజకీయ నాయకుల దగ్గరా ఉండటం కూడా గమనిస్తున్నాం.

కాని ఒక సాదాసీదా ప్రభుత్వోద్యోగి, ఇప్పటిలా జీతాలు లక్షల్లో లేని ఆ రోజుల్లో, ఆ తర్వాత వచ్చే పెన్షన్ తోనూ, లక్ష వరకు పుస్తకాలే గాక అనేక వేల జర్నల్స్, నాలుగు లక్షలకు పైగా పేపర్ కట్టింగ్స్ బైండింగ్‌లు, ఒకే పుస్తకానికి వచ్చిన వివిధ అనువాదాలు, ఒకే పుస్తకం వివిధ ప్రచురణలు కలిగి ఉండటం... ఇవన్నీ లారీల్లో వేసుకొని బదిలీ అయిన ప్రతి ఊరికీ తిరగటం – ఇవేవీ సాధారణ విషయాలు కావు. ఆ అసాధారణ వ్యక్తి లంకా సూర్యనారాయణ.



ఒక సాదాసీదా ప్రభుత్వోద్యోగి, ఇప్పటిలా జీతాలు లక్షల్లో లేని ఆ రోజుల్లో, ఆ తర్వాత వచ్చే పెన్షన్ తోనూ, లక్ష వరకు పుస్తకాలే గాక అనేక వేల జర్నల్స్, నాలుగు లక్షలకు పైగా పేపర్ కట్టింగ్స్ బైండింగ్‌లు, ఒకే పుస్తకానికి వచ్చిన వివిధ అనువాదాలు, ఒకే పుస్తకం వివిధ ప్రచురణలు కలిగి ఉండటం... ఇవన్నీ లారీల్లో వేసుకొని బదిలీ అయిన ప్రతి ఊరికీ తిరగటం – ఇవేవీ సాధారణ విషయాలు కావు. ఆ అసాధారణ వ్యక్తి లంకా సూర్యనారాయణ.

1936 ఆగస్ట్ 23న గుంటూరు జిల్లా గొట్టిపాడు గ్రామంలో పుట్టి, సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో పని చేసి, 1992లో పదవీ విరమణ చేసిన ఈ పెద్దాయన మా గుంటూరులో దర్శనీయ స్థలం లేదనే లోటును తీరుస్తూ తన సమస్త పుస్తక సంపదను కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గుంటూరులో వున్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి (బృందావన్ గార్డెన్స్) ఇచ్చేశారు. వారు అన్నమయ్య గ్రంథాలయం పేరిట మూడు అంతస్తుల మేడలో బీరువాల్లో భద్రపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచారు.

ఆనాటి నుంచి మా ఊరు వచ్చిన ప్రతి సాహితీవేత్తా, పుస్తక ప్రియుడూ అక్కడికి వెళ్లి ఆ పుస్తకాల్నీ, లంకా గారిని చూసి ఆయన ఆతిథ్యాన్ని తీసుకోకుండా వెళ్ళరు. ఈ పుస్తక సంపద ఇచ్చిన సమాచారంతో 30 మంది డాక్టరేట్లు పొందారంటే అది చిన్న విషయం కాదు. "ఇదంతా ఆ పెద్దాయన బ్లడ్ అండ్ స్వెట్. ఇది ఫలిస్తుంది." అని దీవించిన శ్రీరమణ మాటలు నిజమయ్యాయి.

యాదాద్రి భువనగిరి జిల్లా వెల్లంకి గ్రామంలో డా. కూరెళ్ల విఠలాచార్య కర్ణాటకలోని మాండ్యలో తన సంపాదనలో 80శాతం డబ్బుని, తనకున్న ఒకే ఒక ఇంటిని అమ్మి, తన పదవీ విరమణ బెనిఫిట్స్‌ని కూడా వినియోగించి రెండు లక్షల పుస్తకాల్ని సేకరించి ఇంటిలోనే గ్రంథాలయం నడుపుతున్న అంకెగౌడ్‌ని; తన సమస్త సంపదని (10 మిలియన్ డాలర్లు) వెచ్చించి 4 లక్షల పుస్తకాలు, 3 లక్షల రాతప్రతులు సేకరించిన హస్టింగ్టన్ (కాలిఫోర్నియా) గురించి; తమిళనాట రోజా ముత్తయ్య, బెంగాల్‌లో అశుతోష్ ముఖర్జీల గురించి విన్నామేగాని అదే ఒరవడి కలిగిన లంకా సూర్యనారాయణను చూడటం, ఆయనతో సుదీర్ఘ పరిచయ భాగ్యం కలిగి ఉండటం జీవితంలో ఆనందదాయకమైన విషయం. 70–80 దశకాల్లో నలభై సంవత్సరాల వయస్సులో నవోదయ పబ్లిషర్స్‌లో పుస్తకాలు వెదుక్కుంటూ కనిపించే ఈ మానవుడు ఎనభై ఎనిమిదేళ్ల వయస్సులో ఆదివారం ఫుట్‌పాత్‌లపై సెకండ్ హ్యాండ్ పుస్తకాల దగ్గర తచ్చాడుతూ కన్పిస్తుంటాడు.

లంకా సూర్యనారాయణ అపురూప సేకరణలో 500 భగవద్గీతలు, 300 భాగవతాలు, 100 మహాభారతాలు, 550 రామాయణాలు, ఐదువేల ఆత్మకథలు, రవీంద్రుని 'గీతాంజలి' కావ్యానికి అదిపూడి సోమనాధరావు తొలి తెలుగు అనువాదం నుంచి డా. భార్గవి ఇటీవలి అనువాదం దాకా మొత్తం 51 తెలుగు అనువాదాలు; 1600 శతకాలు; 700 నిఘంటువులు... ఇవి ఆయన సేకరణలో కొన్ని. కేవలం పది పైసలు ఇచ్చి ఒక మిఠాయి బండి వాడి దగ్గర మిల్టన్ పూర్తి రచనలు కొన్నారట. గుంటూరు విజయవాడలే కాదు; ఢిల్లీ, బొంబాయి లాంటి నగరాలు వెళ్లినప్పుడు కూడా ఫుట్‌పాత్‌లపై అపురూప గ్రంథాలు సేకరించారు.

ఈ గ్రంథాలయంలో పుస్తకాలు చూసి పక్కన పెడితే వరుస క్రమం తప్పకుండా వారే సర్దుకుంటారు. కోరుకున్న వ్యక్తులకు కోరుకున్న పుస్తకాలు స్కాన్ చేసి, పెన్‌డ్రైవ్‌లో ఇస్తారు. అన్నమయ్య గ్రంథాలయం కేటలాగ్ వికీపీడియా పేజీలో దొరుకుతుంది. ఇంకా ఇతర ప్రాంతాల వారు 0863–2246365 నంబర్‌లో సంప్రదిస్తే కేటలాగ్ సాఫ్ట్‌కాపీని ఈమెయిల్ ద్వారా కూడా అందుకోవచ్చు. అన్నట్లు ఈయన సేకరించిన పుస్తకాల్లో చదివి ఇస్తానని తర్వాత ఇవ్వకుండా ఉన్న పుస్తకం గాని, కొట్టేసిన పుస్తకం గాని ఒక్కటి కూడా లేదని ఆయన మిత్రులు చెబుతారు. అన్ని పుస్తకాల దొంతరల్లో మనకు కావాల్సిన పుస్తకం ఒక్క నిముషంలో తీసి ఇవ్వగలరు.

పుస్తకాలు ఎక్కువగా ఉండే వ్యక్తుల ఇళ్లల్లో పుస్తక పరిజ్ఞానం తక్కువగా ఉన్న ఆడవాళ్ల పోరు చాలామందికి అనుభవమై ఉంటుంది. లంకా గారి మర్యాదల్నీ, ఆయన పుస్తకాల గుట్టల్నీ, దానికోసం ఆయన పెట్టిన ఖర్చుని అర్థ శతాబ్దానికి పైగా భరించిన వారి శ్రీమతి వరలక్ష్మి గారు, ఇంకా ఆయన చెప్పకుండానే ఆయన ఏమి చెబుతారో ఊహించి ప్రవర్తించే గ్రంథాలయ సంచాలకురాలు సుభాషిణి గారు దొరకటం లంకా సూర్యనారాయణ అదృష్టం. కాగా లంకా సూర్యనారాయణ గుంటూరు వారు కావటం గుంటూరు ప్రజల అదృష్టం.

• చెరుకూరి సత్యనారాయణ

బాలల సినిమా పండుగ మళ్లీ ఎప్పుడు?

చాచా నెహ్రూ పుట్టిన రోజు అంటే పిల్లలకు పండుగే... తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకు మొన్న మొన్నటివరకూ బాలల దినోత్సవం అంటే బాలల చలన చిత్రోత్సవం అనే కదా. నవంబర్ నెల అనగానే అందరికీ గుర్తొచ్చేది రెండేళ్లకోసారి విచ్చేసి సందడి సందడి చేసే అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవమే. ఊహలకే రెక్కలు తొడిగినట్టు, ఆకసం నుంచి తారలు జారిపడినట్టు, చందమామే పిల్లలకు మంచి కథలు చెప్పడానికి దివి నుంచి దిగివచ్చినట్టు... ఉండేది ఆ చిత్రోత్సవం. అదో అనిర్వచనీయమైన అనుభవం. ఎన్నెన్ని అద్భుతమైన చిత్రాలు... ఎన్నెన్ని కళాఖండాలు... వాటిని తనివితీరా చూసి, మనసారా ఆస్వాదించి మనవాళ్లు ఎంతగా తాదాత్మ్యం చెందారు! ఎన్నెన్ని ఉత్తేజపూరితమైన చిత్రాలు చూసి పిల్లలు ఎంతగా ఆశ్చర్యచకితులయ్యారు! దేశ దేశాల జానపద సాహిత్యం నుంచి, ఇతిహాసాల నుంచి, వర్తమాన వైచిత్రిక స్థితిగతుల నుంచి, దైనిక దుర్భర జీవన యవనిక నుంచీ వచ్చిన మరచిపోలేని వినూత్నమైన కథలు తిన్నగా మన మధ్య నిల్చుని మనతో సంభాషించేవి. ఎక్కడెక్కడో ప్రాణం పోసుకుని పరుగులు తీసుకుంటూ పరోపకారి పాపన్న వంటి పాత్రలు మన కోసమే అరుదెంచినట్టు ఉండేది. సున్నితమైన అంశాలతో పిల్లలని, పెద్దలనీ సమానంగా అలరించే ఇరాన్ సినిమాలు అంటే అందరికీ ప్రత్యేకమైన అభిమానం. ఎన్నెన్ని తియ్యని అనుభవాలు... పిల్లలతో పాటు కవులు, కళాకారులు, చిత్రకారులు, పాత్రికేయులు, సినిమా విమర్శకులు, దర్శక నిర్మాతలు, నటీనటులు... ఎందరో ఔత్సాహిక కళాకారులు ఈ హైదరాబాద్ చలన చిత్రోత్సవంలో చురుకుగా పాల్గొనేవారు. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో పిల్లలు బిరబిరా గలగలా ఉత్సాహం ఉరకలెత్తగా వచ్చి ఈ చిత్రోత్సవంలో పాల్గొనేవాళ్లు. ప్రపంచ వ్యాప్తంగా సృజనాత్మకతకు ప్రతీకలుగా వచ్చిన ఆ చిత్రాలతో ఆ మధ్య వరకు మిలమిలా మెరిసిపోయిన హైదరాబాద్ వెండితెరలు కొన్నేళ్లుగా వెలవెలబోతున్నాయి. అంతమందిని మైమరిపించిన ఆ చిత్రోత్సవాలు ఇప్పుడు ఏమైపోయాయి? హైదరాబాద్ చిత్రోత్సవం అంటేనే అదో భావోద్వేగం... ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. అంతటా నిస్తేజం. బంగారు, వెండి ఏనుగులతో ఉత్తమ చిత్రాలను గుర్తించి, గౌరవించిన మన చలన చిత్రోత్సవం ఇప్పుడు ఏకంగా చిరునామా లేకుండాపోయింది! ఎందుకీ దైన్య స్థితి?

సినిమా అంటే కేవలం కదలాడే బొమ్మలు కాదని విశ్వసించిన మన తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఉత్తమ చిత్రాలను తీసుకువచ్చి ప్రదర్శిస్తే అవి మన యువతీ యువకులపై నిర్మాణాత్మక ప్రభావం చూపిస్తాయని, తద్వారా దేశ సంస్కార వికాసానికి, కళా ప్రాభవానికీ కొత్త దారులు ఏర్పడతాయని భావించారు. అందుకే అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల నిర్వహణకు 1952లో అంకురార్పణ చేశారు. ప్రధాన స్రవంతి సినిమా ఒకవైపు ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తున్నా, జీవితంలో ఏదో ఒక విలువ కోసమో, కనీ కనిపించని ఒక జీవిత పార్శ్వాన్ని తడిమి, మనసును ఆర్ద్రం చేసి చూపించడానికో సృజనాత్మక దర్శకులు చేసే ప్రయత్నాలను కూడా నెహ్రూ గమనించారు.



హైదరాబాద్ బాలల చలన చిత్రోత్సవాలకు గ్రహణం ఎందుకు పట్టింది, బాధ్యత ఎవరిదన్న రంధ్రాన్వేషణ ప్రస్తుతం అప్రస్తుతం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మూలపడిన పాత ఫైళ్ల దుమ్ము దులిపించి, మళ్లీ బాలల చిత్రోత్సవాన్ని హైదరాబాద్‌కు రప్పించేందుకు తొలి అడుగు వేస్తే, హైదరాబాద్ కళామతల్లికి మళ్లీ పూర్వ వైభవం ఖాయం.

అటువంటి చలన చిత్రాల దర్శక నిర్మాతలను ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో సినిమా పురస్కారాలను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తమ చలన చిత్రాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే దర్శకులకు సాయంగా ఉంటుందని నెహ్రూ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి కూడా నెహ్రూ శ్రీకారం చుట్టారు. సినిమా అంటే మన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలకు ప్రతీక అని నమ్మి అలనాటి చిత్రాల తరగని గనిగా పూణేలో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే నటీనటులు, దర్శకులు, సినిమా రచయితలు, ఛాయాచిత్ర దర్శకులు కాదలచిన ఔత్సాహికులకు మంచి శిక్షణ ఇవ్వడం కోసం ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కడెక్కడో నిర్మించిన చిత్రాలను వడపోసి మన ప్రేక్షకులకు అందించే దిశగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు బీజం వేశారు. అందుకు ఏకంగా ఒక డైరెక్టరేట్‌నే ఏర్పాటు చేశారు. ఆ పరంపరలోనే పిల్లల కోసం అంటూ ముంబై కేంద్రంగా ఒక ఫిల్మ్ సొసైటీ ఏర్పాటు అయ్యింది. ఈ సొసైటీ నిర్వహణలో పిల్లల కోసం ఉత్తమ చిత్రాల ప్రదర్శన కూడా మొదలైంది. కొన్ని నిర్వహణ లోపాలు ఎదురుకావడంతో వాటికి పరిష్కారంగా 2005లో నాటి కేంద్ర సమాచార శాఖ మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని బాలల చలన చిత్రోత్సవాలకు శాశ్వత వేదికగా ప్రకటించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే చిత్రోత్సవాల సమయంలో సినిమా ప్రదర్శనలకు వీలుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాశ్వత థియేటర్లు నిర్మిస్తామన్నారు. చిత్రోత్సవాలు లేని సమయంలో అక్కడే అలనాటి ఆణిముత్యాలు అనదగిన తెలుగు, హిందీ పాత చిత్రాల ప్రదర్శనకు ఈ థియేటర్లను వినియోగించుకోవచ్చు. భారతీయ చిత్రాలపైనా, తెలుగు సినిమా చరిత్ర పైనా అమెరికాలో లాగా మంచి ఆడియో విజువల్ ప్రదర్శనలు, అలాగే సినిమాలపై ఒక గ్రంథాలయం, సినిమా పరిశోధనలకు దేశదేశాల నుంచి వచ్చే అతిథులకోసం విడిది సౌకర్యాలు కల్పించాలన్నది ఆనాటి ప్రకటన సారాంశం. వాటితో పాటు అసలు చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీనే హైదరాబాద్‌కు తరలించాలనే ఆకాంక్షను ఆ రోజున జైపాల్ రెడ్డి వ్యక్తం చేశారు. అందుకు వెంటనే సానుకూలంగా స్పందించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో 15 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. శాశ్వత భవనాలు సిద్ధమయ్యేలోపు హైదరాబాద్ నడిబొడ్డున గల ఐమాక్స్ తదితర ముఖ్యమైన థియేటర్లలో చిత్రోత్సవాల సమయంలో మిగిలిన చిత్రాల ప్రదర్శనలు ఆపి చిత్రోత్సవాల సినిమాల ప్రదర్శనలకు కేటాయించాలని కూడా నిర్ణయించారు.

ఆ దిశగా కొన్ని మంచి అడుగులు పడ్డాయి. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హోదాలో డాక్టర్ కెవి రమణ హైదరాబాద్ లోని ముఖ్యమైన థియేటర్ల యాజమాన్యాన్ని ఒప్పించి బాలల చిత్రోత్సవాలను అద్వితీయంగా నిర్వహించారు. సినిమాలు చూడడానికి ఎక్కడెక్కడినుంచో వచ్చే బాల ప్రతినిధులకు విడిది సౌకర్యాలతో పాటు ఐమాక్స్‌కి విచ్చేసే వారందరికీ భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేసేవారు. అంతకు ముందు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అద్భుతంగా నిర్వహించిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలే ఈ బాలల చిత్రోత్సవ నిర్వహణకు స్ఫూర్తి. (ఇప్పటికీ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ఆతిథ్యం అంటే హైదరాబాద్‌దే అగ్రతాంబూలం అని ఎంతో అభిమానంతో గుర్తు చేసుకుంటారు.)

ఒక చిత్రోత్సవంలో ఇరాన్ చిత్రం– ది కార్ట్, మరో చిత్రోత్సవంలో రష్యన్ చిత్రం– ది సెలెస్టియల్ క్యామెల్, మరో చిత్రోత్సవంలో చైనా చిత్రం– ది ఇన్విజిబుల్ వింగ్స్ (తెలుగులో 'నింగి...నేల... నాదే') బంగారు ఏనుగులను గెల్చుకున్నాయి. ఈ చిత్రాలను చూసినవారు ఇప్పటికీ వాటిని మరిచిపోలేరు. తెలంగాణ సంస్కృతిని విదేశీ ప్రతినిధులకు పరిచయం చేయడానికి 2017లో జరిగిన 20వ బాలల చలన చిత్రోత్సవంలో మన పిల్లలు ఐమాక్స్‌లో ప్రత్యేకంగా బతుకమ్మ ఆడారు. విదేశీ ప్రతినిధులు కూడా ఆ ఆట పాటల్లో పిల్లలతో కలిసిపోయారు. అదో పెద్ద సంబురం. అప్పటివరకూ అంతా బాగానే ఉంది. 2019లో 21వ బాలల చలన చిత్రోత్సవం జరగవలసి ఉంది. కాని జరగలేదు. 2020లో ఆ చిత్రోత్సవం జరుగుతుందని అన్నారు. జరగలేదు. 2021లో కోవిడ్ విలయంతో దేశం మొత్తం ఒక నిశ్చల చిత్రంగా మారిపోయింది... ఇక చిత్రోత్సవం ఎక్కడా! ఆ తర్వాత అయినా చిత్రోత్సవాలు జరుగుతాయని అందరూ ఆశగా ఎదురుచూశారు. ఇంతలో చిత్రోత్సవాలను నిర్వహించే చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీని కేంద్రం 2022లో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థలో విలీనం చేసేసింది. ఇప్పుడు దాని ఆలనా పాలనా చూసేవారెవ్వరో ఎవరికీ తెలియదు. హైదరాబాద్‌లో బాలల చిత్రోత్సవాలు నిర్వహించే రోజులలో ముంబై నుంచి వచ్చే సొసైటీ ప్రతినిధులు ఇక్కడివారిపై ఆధిపత్యం చెలాయించేవారు. అది ఇక్కడి నిర్వాహకులకు చాలా బాధ కలిగించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అది పక్కన పెడితే చిత్రోత్సవ నిర్వహణకు అయ్యే ఖర్చును భరించడానికి సొసైటీ ఆసక్తి చూపకపోవడంతో ఆ ఖర్చును చాలా వరకూ ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వమే భరించేది. ఖర్చు అంతా మాదే అయినప్పుడు సొసైటీని కూడా మాకే అప్పగించేస్తే అంతా మేమే చూసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చూచాయగా చెప్పిందే గాని దానికోసం గట్టిగా పట్టుపట్టిన దాఖలా లేదు.

ఆబాలగోపాలాన్నీ అలరించిన బాలల చిత్రోత్సవాల పరిస్థితి రాను రాను కర్నుని మరణంలా ముచ్చటించుకోవలసివస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు, గౌరవం పొందిన మన హైదరాబాద్ బాలల చలన చిత్రోత్సవాలకు గ్రహణం ఎందుకు పట్టింది, బాధ్యత ఎవరిదన్న రంధ్రాన్వేషణ ప్రస్తుతం అప్రస్తుతం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మూలపడిన పాత ఫైళ్ల దుమ్ము దులిపించి మళ్లీ బాలల చిత్రోత్సవాన్ని హైదరాబాద్‌కు రప్పించేందుకు ఈరోజే తొలి అడుగు వేస్తే, హైదరాబాద్ కళామతల్లికి మళ్లీ పూర్వ వైభవం ఖాయం. సినిమా మణిహారమైన హైదరాబాద్‌కు అందరూ మళ్లీ బ్రహ్మరథం పట్టడమూ ఖాయం. ఇది అత్యాశ కాదు కదా!

■ జగన్
సీనియర్ జర్నలిస్టు
(నేడు బాలల దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఉషోదయాలకు ఊపిరి పోద్దాం!

యుద్ధాకాశపు కన్నీటి మేఘాల
రణధ్వనుల మధ్య లక్షల
బాలల ఆకలికడుపుల గేయాలు
అనునాదం చెందుతున్నాయి

భయపు వరదలో బాల్యపు
పరిమళం బక్కచిక్కి
తుపాకుల మోతలమధ్య
రాకెట్ల వర్షంలో తడుస్తున్నాయి

బతకడానికి బతిమాలుతూ
చంపడాన్ని తీవ్రంగా నిరసిస్తూ
శాంతికాంతి జ్వాలల వెలుగుకై
పసిపిల్లల దండు ఆర్తనాదాలతో
పలకబలపపు చరితల ఆనందపు
రహదారులను వెతుకుతున్నాయి

ఈ ఆధునికత అలజడులలో
ఒత్తిడి మాయలో బడుల్లో..
పేదరికపు సమరంలో బస్టాండుల్లో..

బాలకార్మికుల అర్ధనగ్న బతుకు చిత్రాలు
నేటి స్వతంత్ర భారతంలో
ఇంకా దర్శనమిస్తూనే వున్నాయి

యుద్ధం లేని బాల్యపు
ఉషోదయాలకు
ఊపిరి పోయాలి.
ఒత్తిడి లేని జీవితచదువులకు
జ్ఞాన ద్వారాలు తెరవాలి.

పసిపిల్లల నిండు పున్నమి
వెన్నెల వెలుగులలో ప్రపంచమంతా
రేపటితరపు కలల రాతలు
అందమైన బాల్యపు జలపాతపు
సవ్వడుల సంగీతాన్ని వినిపించాలి.
కలాల కవనపు గీతాలు
విశ్వశాంతి సౌధాల
నిలయాలై వికసించాలి.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

బిర్సా పోరాట స్ఫూర్తి అమరం!

పట్టుమని ఈ నేల మీద పాతికేళ్లు మాత్రమే జీవించినా ఆదివాసీలకు ఆరాధ్య దైవంగా మారాడు బిర్సా ముండా. జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లా ఉలిహత్ గ్రామంలో 1875 నవంబర్ 15న సుగుణ ముండా, కర్మిహాట్ దంపతులకు జన్మించాడు. చయిబాసాలోని మిషనరీ స్కూల్‌లో చదువుకోవటానికి క్రైస్తవం లోకి మారాడు. చదువుకుంటూనే అడవి మీద ఆధారపడే ఆదివాసుల హక్కులకై పోరాడాడు. అప్పట్లో ఆదివాసీ భూములపై బ్రిటిష్ పాలకులు అధిక పన్నులు వసూలు చేసేవారు. చెల్లించని వారి ఆస్తులను లాక్కునేవారు. భూములను తిరిగి ఇచ్చేయాలని ఒక రోజు తెగ పెద్దలతో కలిసి బిర్సా ముండా తెల్లదొరలపై ఒత్తిడి చేశాడు. దాంతో మిషనరీ స్కూల్ ఆయనను బహిష్కరించింది. వారి ఎదుటే నుదుట నామం పెట్టి, జంధ్యం ధరించి, ఇకపై క్రైస్తవం లోకి ఒక్క ఆదివాసీని కూడా మారకుండా చూస్తానని బిర్సా ప్రతినబూనాడు. కుంతి, తామర్, బసియా, రాంచీ ప్రాంతాలను సరిహద్దులుగా చేసుకుని ఆదివాసీ హక్కుల కోసం మిలిటెంట్ ఉద్యమాన్ని నడిపాడు. బిర్సాయిత్ మతాన్ని స్థాపించాడు. ఆదివాసీలు ఆయనను ధర్తీలబా (దేవుడు)గా కొలిచారు. ఆదివాసీ ప్రతిఘటన ప్రమాదాన్ని గుర్తించిన బ్రిటిష్ పాలకులు ఆయనను అరెస్ట్ చేసి 1900 జూన్ 9న విషప్రయోగంతో చంపేశారు. నేడు ఆ పోరాటవీరుడి అమర స్ఫూర్తి దేశమంతటా వ్యాపించింది.

---- ఎన్. సీతారామయ్య

(రేపు బిర్సా ముండా 150వ జయంతి)

ట్రంప్ గెలుపు డెమొక్రాటిక్ పార్టీ పుణ్యమే!

అమెరికా ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత వెర్మోంట్ రాష్ట్రానికి చెందిన ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ ఒక బహిరంగ లేఖ విడుదల చేశాడు. ఆ లేఖలో మొదటి వాక్యం ఇది– - "శ్రామిక వర్గాన్ని వదిలేసిన డెమొక్రాటిక్ పార్టీని ఇప్పుడు శ్రామిక వర్గం వదిలేయడంలో ఆశ్చర్యమేమీ లేదు". అమెరికా ఎన్నికల ఫలితాలకి ఇంతకంటే క్లుప్తమైన, సంపూర్ణమైన, విశ్లేషణ ఇంకొకటి ఉండదు.

అమెరికాలో గత 50 ఏళ్ళుగా సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు పతనం చెందుతూ వస్తున్నాయి. ఆదాయ అసమానత పెరిగిపోతూ వస్తోంది. 1950లలో ఒక ఫ్యాక్టరీ కార్మికుడి జీతంతో ఇద్దరు పిల్లలున్న ఒక కుటుంబం మధ్యతరగతి జీవనం గడపగలిగేది. కానీ క్రమంగా మాన్యుఫాక్చరింగ్ ఉద్యోగాలన్నీ అమెరికా కంటే చవక జీవన ప్రమాణాలున్న దేశాలకి తరలిపోయాయి. దాని వల్ల వచ్చిన లాభాలు మాత్రం కొద్దిమంది ధనవంతుల జేబుల్లోకి జేరిపోయాయి. ఇప్పుడు అరవై శాతం మంది అమెరికన్లు ఒక్క నెల జీతం రాకపోయినా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.

2008లో ఒబామా 'మార్పు తెస్తా'ననే వాగ్దానంతో ఎన్నికలలో నిలబడ్డాడు. మార్పు కోసం జనం ఓటు వేశారు. రిపబ్లికన్ పార్టీ బలంగా ఉన్న ఇండియానా, ఉత్తర కరోలినా వంటి రాష్ట్రాలను కూడా ఒబామా గెలుచుకున్నాడు. కానీ గెలిచిన తరవాత ఆ మార్పు వాగ్దానాన్ని వదిలేశాడు. ఆర్థిక అసమానతలకూ, కార్పొరేట్ల ధనదాహానికీ, రాజకీయాల్లో డబ్బు పాత్రకీ వ్యతిరేకంగా, 2011లో దేశవ్యాప్తంగా లక్షలమంది పాల్గొన్న 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలని అతి క్రూరంగా అణచివేశారు. దివాళా తీసిన పెద్ద పెద్ద కార్పొరేషన్లకి బిలియన్ల డాలర్ల ప్రజాధనాన్ని ఇచ్చి ఆదుకుంది డెమొక్రాటిక్ పార్టీ ప్రభుత్వం. ప్రజాధనాన్ని తీసుకున్న కంపెనీలు కోలుకున్న తరవాత షేర్ మార్కెట్లో లాభపడ్డాయే గాని, సామాన్య జనానికి గానీ, అప్పులు చేసి మరీ పెద్ద పెద్ద కంపెనీలను ఆదుకున్న ప్రభుత్వానికి గానీ ఏమీ మేలు చేకూరలేదు. ఆర్థిక లోటు మాత్రం పెరిగిపోతూ వచ్చింది. వీటన్నిటి వల్లా అప్పటిదాకా దన్నుగా ఉండిన శ్రామిక జనాలు డెమొక్రాటిక్ పార్టీకి క్రమంగా దూరమవుతూ వచ్చారు.

2016 ఎన్నికలలో ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి బరిలో నిలబడ్డాడు. అమెరికాలో అసలు ఎన్నికలకి ముందు ప్రైమరీ ఎన్నికలని జరుగుతాయి. ఆ ప్రైమరీలలో ప్రతీ పార్టీ, రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో నిలబడడానికి, తన అభ్యర్థిని ఎన్నుకుంటుంది. 2016 ప్రైమరీలలో బెర్నీ సాండర్స్ ఆర్థిక అసమానతలనీ, కార్పొరేట్ అవినీతినీ, ఫార్మా, ఇన్సూరెన్సు కంపెనీల లాభాపేక్షనీ వ్యతిరేకిస్తూ, ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం పనిచేయాలనే నినాదంతో నిలబడ్డాడు. డెమొక్రాటిక్ పార్టీతో విసిగిపోయి, ఎన్నికలకే దూరమైపోయిన సామాన్య జనం లక్షలాదిగా బెర్నీని సమర్థించారు. ముఖ్యంగా యువత బెర్నీని ఆదరించింది. బెర్నీ ర్యాలీలు జనంతో కిటకిటలాడగా, అదే పార్టీలోని బెర్నీ ప్రత్యర్థి హిల్లరీ ర్యాలీలు వెలవెలబోయాయి. మీడియా బెర్నీని వెలివేసినా, ప్రైమరీలలో కొత్త ఓటర్లు ఓటు వేయడానికి డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వం అవాంతరాలు సృష్టించినా, కార్పొరేట్ కంపెనీలు మిలియన్ల డాలర్లు హిల్లరీ ప్రచారానికి గుమ్మరించినా, కేవలం సామాన్య జనం ఇచ్చిన 10–20 డాలర్ల విరాళాలతో ప్రచారం చేసిన బెర్నీ 23 రాష్ట్రాలు గెలుచుకున్నాడు. దేశ వ్యాప్తంగా 43 శాతం ఓట్లు సాధించాడు. కానీ, పార్టీ అభ్యర్థిగా నామినేషన్ గెలుచుకున్న హిల్లరీ, బెర్నీ ద్వారా డెమొక్రాటిక్ పార్టీకి వచ్చిన మద్దతుని తన వేపు తిప్పుకోవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అంతేకాక "గంటకి జీతం కనీసం పదిహేను డాలర్లు ఇవ్వాలి" అనే డిమాండునీ, అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలనే డిమాండునీ అవహేళన చేసింది. మొత్తం మీద మళ్ళీ శ్రామిక జనాల్ని నిస్పృహలోకి నెట్టివేసి, ట్రంప్ బూచిని చూపి "నాకు తప్ప ఇంకెవరికి ఓటేస్తారు మీరు" అన్న నిర్లక్ష్యంతో గెలిచిపోతాననుకుంది హిల్లరీ. కానీ శ్రామిక జనాన్ని దూరం చేసుకున్న కారణంగా ట్రంప్ చేతిలో ఓడిపోయింది.



కమల హారిస్ కేవలం ట్రంప్ అవినీతి మీదా ట్రంప్ నేర చరిత్ర మీదా మాత్రమే దృష్టి సారించింది. "ట్రంప్ చెడ్డవాడు కాబట్టి నాకు ఓటు వేయండి" అన్న ఏకైక నినాదంతో గెలవాలని ప్రయత్నించింది. అసలు సామాన్య జనం సమస్యల్లో ఉన్నారనే మాటే ఎత్తకుండా ప్రచారం జరిపింది. "అంతా బాగానే ఉంది, నిరుద్యోగం అదుపులో ఉంది, స్టాక్ మార్కెట్లు పైపైకి వెళుతున్నాయి" –అన్న ధనికవర్గ అవగాహనతో ప్రచారం జరిపింది. ట్రంప్ దీన్ని తనకి అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యాడు.

2020లో మళ్ళీ చరిత్ర పునరావృతమైంది. బెర్నీ మళ్ళీ నిలబడ్డాడు. ఈసారి బెర్నీ పేరూ, బెర్నీ శ్రామిక జన పక్షపాతమూ, జనానికి తెలిసి ఉండడం చేత రాష్ట్రం తరవాత రాష్ట్రం బెర్నీ గెలవడం మొదలుపెట్టాడు. దాంతో దడ పట్టుకున్న పార్టీ నాయకత్వం బైడెన్ తప్ప మిగతా అభ్యర్థుల్ని అందరినీ బరిలో నుంచి తొలగించి, ఒబామాకి నల్ల జాతీయులలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి నల్ల జాతీయులు ఎక్కువగా ఉన్న దక్షిణ కరోలినా రాష్ట్రం బైడెన్ గెలుచుకొనేలా చేసి, బెర్నీ ఉప్పెనకి అడ్డుకట్ట వేశారు. బైడెన్ నామినేషన్ గెలిచేలా చేశారు. కానీ ఇన్ని నమ్మకద్రోహాల వల్ల శ్రామిక జనాలని శాశ్వతంగా దూరం చేసుకుంది డెమొక్రాటిక్ పార్టీ! కానీ ట్రంప్ దుష్పరిపాలనతో కూడా జనం విసిగిపోయి ఉండడం చేత చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు, బొటాబొటీగా కేవలం 10–20 వేల ఓట్ల తేడాలతో 4–5 రాష్ట్రాలు గెలిచి మొత్తానికి అధ్యక్షుడు కావడానికి అవసరమైన ఎలెక్టోరల్ ఓట్లను బైడెన్ సంపాదించుకున్నాడు.

కానీ శ్రామిక జనాల పరిస్థితి ఏమీ మెరుగుపడలేదు. కోవిడ్ వ్యాధి వ్యాప్తి తగ్గాక ఆర్థిక వ్యవస్థ కొంత కోలుకున్నప్పటికీ, నిరుద్యోగం అదుపులో ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. సామాన్య జనాల జీతాలు అంతగా పెరగక, ఎన్నో ఇక్కట్లు పడవలసి వచ్చింది. 2024లో డెమొక్రాటిక్ పార్టీ, ప్రైమరీని పేరుకి మాత్రమే నిర్వహించింది. ఎటువంటి డిబేట్లూ లేకుండా బైడెన్‌ని అభ్యర్థిగా ఎన్నుకుంది. ప్రైమరీ దశలో డిబేట్లు నిర్వహించి ఉంటే బైడెన్ మానసిక క్షీణత అప్పుడే బయటపడి ఉండేది. కొత్త అభిప్రాయాలతో జనానికి ఒక ఆశ కలిగించే అభ్యర్థి ఎవరైనా గెలిచి ఉండేవారు. ఆఖరికి ట్రంప్‌తో జూలైలో జరిగిన డిబేట్‌లో బైడెన్ మానసిక క్షీణత బయటపడింది. అప్పటికయినా 'ప్రజాస్వామికంగా' ఓపెన్ కన్వెన్షన్ నిర్వహిస్తే జనాన్ని ఉత్తేజపరచగలిగే అభ్యర్థిని ఎన్నుకుని ఉండొచ్చు. దానికి విరుద్ధంగా ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నాలుగేళ్ల పాటు ఉపాధ్యక్షురాలిగా ఉండి కూడా ఎటువంటి ప్రజాదరణా లేని, తనకంటూ ఒక గుర్తింపునీ తెచ్చుకోలేని కమలా హారిస్‌ని అభ్యర్థిగా నియమించారు. అప్పటికైనా కమల కొత్త వాగ్దానాలతో ముందుకి వచ్చి ఉండవచ్చు. సామాన్య జనం ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎలా పరిష్కరించగలనో అన్నది వివరించి ఉండవచ్చు. కమల అవేవీ చేయకుండా కేవలం ట్రంప్ అవినీతి మీదా ట్రంప్ నేర చరిత్ర మీదా మాత్రమే దృష్టి సారించింది. "ట్రంప్ చెడ్డవాడు కాబట్టి నాకు ఓటు వేయండి" అన్న ఏకైక నినాదంతో గెలవాలని ప్రయత్నించింది. అసలు సామాన్య జనం సమస్యల్లో ఉన్నారనే మాటే ఎత్తకుండా ప్రచారం జరిపింది. "అంతా బాగానే ఉంది, నిరుద్యోగం అదుపులో ఉంది, స్టాక్ మార్కెట్లు పైపైకి వెళుతున్నాయి" –అన్న ధనికవర్గ అవగాహనతో ప్రచారం జరిపింది. ఒక ఇంటర్వ్యూలో "బైడెన్ కంటే మీ ప్రభుత్వం ఎలా తేడాగా ఉంటుంది?" అన్న ప్రశ్నకి "ఏమీ తేడాగా ఉండదు" అని సమాధానం ఇచ్చింది.

ట్రంప్ దీన్ని తనకి అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యాడు. ప్రజల కష్టాలన్నిటికీ, ధరలు పెరగడానికీ, జీతాలు పెరగకపోవడానికీ అక్రమ వలసదారులే కారణమనే భ్రమ కలిపించాడు. తనను గెలిపిస్తే 2 కోట్ల అక్రమ వలసదారుల్ని తిరిగి పంపించేస్తాననీ, దాని వల్ల ధరలూ నేరాలూ తగ్గిపోతాయనీ జనాల్ని భ్రమింపజేశాడు. చైనా దిగుమతుల మీద 60శాతం పన్ను విధిస్తాననీ, దాని ద్వారా ఇతర దేశాలకి తరలిపోయిన ఉద్యోగాలు వెనక్కి రప్పిస్తానని వాగ్దానాలు చేశాడు. గత 30 ఏళ్లుగా తమకు వెన్నుపోటు పొడిచిన డెమొక్రాటిక్ పార్టీతో విసిగిపోయిన జనంలో కొంత మంది ట్రంప్ మాయ మాటలకి బుట్టలో పడ్డారు. నిజానికి ట్రంప్ వాగ్దానాలు పొంతన లేనివి. దిగుమతి పన్నులు, ధరల్ని పెంచుతాయి గానీ, తగ్గించవు. అక్రమ వలస దారుల్ని బహిష్కరిస్తే అమెరికాలో వ్యవసాయం కుప్పకూలుతుంది. ధరలు ఇంకా పెరుగుతాయి.

డెమొక్రాటిక్ పార్టీ ఇప్పటికైనా సామాన్య జనానికి సహాయపడే ఎజెండాని చేపట్టకపోతే అమెరికా ఫాసిజం ఊబిలో ఇంకా లోతుగా కూరుకుపోతుంది. భారతదేశంలో గత పదేళ్లలో మత అసహనం ఎలా పెరిగిపోయిందో అలా అమెరికాలో శ్వేత జాత్యాహంకారం ఇంకా పెరిగిపోతుంది. ట్రంప్‌కి ఎలాగూ ప్రజల సమస్యల్ని తీర్చగలిగే ఆసక్తి గానీ, శక్తిగానీ లేవు. తన అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ట్రంప్ తన జిగ్రీ దోస్తు మోదీ ఎలా ద్వేష రాజకీయాల్ని పెంచి పోషించాడో అలాగే ద్వేషాన్ని ఎగదోస్తాడు. ఈ భ్రమల్లోనించీ జనం బయటపడడానికి రెండు మూడు దశాబ్దాలు పట్టవచ్చు.

◆ వి.ఎస్. రవి
(శాండియాగో, కాలిఫోర్నియా)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ఎన్.టి.ఆర్

జిల్లా వార్తలు

గురువారం 14 నవంబరు 2024



మరపురానిది, మరిచిపోలేనిది బాల్యం.. మమతానురాగాల మేళవింపు బాల్యం.. అందుకే బాల్యదశ అందరికీ ఎంతో అమూల్యం.. ఈ చిత్రం చూడండి.. నున్న మామిడితోటల్లో జరిగిన కార్తీక వనసమారాధనలో భాగంగా తల్లిదండ్రులంతా సహపంక్తి భోజనాలు చేస్తుండగా, ఈ చిన్నారులు కూడా కలిసిమెలిసి ఎంత చూడచక్కగా భోజనం చేస్తున్నారో. ఏ అరమరికలు, ఎలాంటి పొరపచ్చాలు లేకుండా కలివిడిగా ఉన్న వీరు కార్తీక వనసమారాధనలోని అసలైన అంతరార్థాన్ని చెప్పకనే చెప్పారు.

• బాల్యం.. అమూల్యం..

నేడు ప్రపంచ బాలల దినోత్సవం





ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- ప్రకృతి సంరక్షణ చాలా అవసరం
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్
- మహాసత్సంగ్‌కు విశేష స్పందన

8లో



స్థలం కబ్జా..

హత్యకు సుపారీ

ఆయన నగరానికి చెందిన ప్రముఖ వైసీపీ నేత. పేరు పూనూరు గౌతంరెడ్డి. సత్యనారాయణపురంలోని సుమారు రూ.5 కోట్ల విలువైన స్థలంపై ఆయన కన్నుపడింది. ఇంకేముంది దర్జాగా కబ్జా చేసేశారు. అయితే, తన స్థలం కోసం అసలు యజమాని పోరాడటం ప్రారంభించారు. న్యాయస్థానాల్లో కేసులు వేశారు. దీంతో యజమాని అడ్డు తొలగించుకునేందుకు గౌతంరెడ్డి ప్లాన్ వేశారు. కిరాయి మూకలకు సుపారీ ఇచ్చారు. చివరికి ఆయన ప్లాన్ విఫలమై గుట్టంతా బట్టబయలైంది.

- వైసీపీ నాయకుడు గౌతంరెడ్డి అరాచకాలు
- రూ.5 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ
- అందులో భార్య పేరిట భవనం నిర్మాణం
- దొంగ పత్రాలతో నకిలీ ఆస్తి పన్ను నెంబరు
- యజమాని హత్యకు రూ.24 లక్షల సుపారీ
- కత్తులతో దాడిచేసిన నలుగురు వ్యక్తులు
- గౌతంరెడ్డి సహా ఆరుగురిపై కేసు
- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



సత్యనారాయణపురంలో వైసీపీ నేత గౌతంరెడ్డి కబ్జాచేసి నిర్మించిన భవనమిదే.. (ఇన్‌సెట్‌లో) వైసీపీ నేత గౌతంరెడ్డి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గండూరి ఉమామహేశ్వరరావుకు సత్యనారాయణపురం లక్ష్మీనగర్‌లో ఉన్న కెనరా బ్యాంకు ఎదురుగా సర్వే నెంబరు 126/1లో 325 గజాల స్థలం ఉంది. ఆయన చనిపోయాక ఆస్తి పంపకాల్లో నాల్గో కుమారుడు, ప్రకాశం బ్యారేజీ ఆర్కిటెక్ట్ అయిన గండూరి రాధాకృష్ణమూర్తికి ఆ స్థలం వారసత్వ ఆస్తిగా సంక్రమించింది. రాధాకృష్ణమూర్తి 1981లో చనిపోగా, ఆయన సతీమణి విజయలక్ష్మి సదరు స్థలానికి యజమానురాలిగా కొనసాగుతూ మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్ను కడుతున్నారు. అయితే, 2014లో వైసీపీ నేత గౌతంరెడ్డి.. వేరే ఆస్తి కాగితాలను విజయలక్ష్మి స్థలం కాగితాలుగా చూపి కార్పొరేషన్ అధికారులను పక్కదారి పట్టించారు. ఆ స్థలానికి నకిలీ ప్రాపర్టీ ట్యాక్స్‌ను సృష్టించారు. దీంతో ఒకే స్థలానికి విజయలక్ష్మి పేరుతో ఒక ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నెంబరు, వైసీపీ నేత పేరుతో మరో ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నెంబరు ఏర్పడ్డాయి. ఈ విషయంపై విజయలక్ష్మి, ఆమె కుమారుడు గండూరి ఉమామహేశ్వరశాస్త్రి వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ చేసి 2018లో గౌతంరెడ్డి పేరుతో ఉన్న తప్పుడు ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నెంబరును రద్దు చేశారు. దీంతో పాటు ఆ స్థలంలో గౌతంరెడ్డి చేపట్టిన నిర్మాణాన్ని డిమాలిష్ చేయాల్సిందిగా ఆర్‌సీ నెంబర్ ఏ9-101477/2018 ఉత్తర్వులు జారీ చేశారు. మున్ముందు ఆ స్థలంలో గౌతంరెడ్డి పేరుతో ఎలాంటి ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ, రాజకీయ ఒత్తిళ్లతో డిమాలిషన్ జరగలేదు. మరోవైపు తమ స్థలం కోసం స్థల యజమాని ఉమామహేశ్వరశాస్త్రి న్యాయస్థానాలను ఆశ్రయించారు. కేసులు నడుస్తుండగానే గౌతంరెడ్డి తాను కబ్జా చేసిన స్థలంలో 225 గజాలను తన భార్యకు గిఫ్ట్ డీడ్‌గా రాసేశారు. ఆమె పేరుతో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ప్లాన్‌కు అనుమతి ఇవ్వాలంటూ వీఎంసీకి దరఖాస్తు చేశారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో ఆగమేఘాలపై అనుమతి వచ్చేసింది. భవన నిర్మాణం కూడా

మిగతా 8లో..

యజమాని హత్యకు కుట్ర

గౌతంరెడ్డి కబ్జాకాండపై స్థల యజమాని ఉమామహేశ్వరశాస్త్రి వీడియోలు తీసి యూట్యూబ్‌లో పోస్టు చేయడం, పత్రికలకు ఎక్కుతుండటంతో ఆయనపై వైసీపీ నేత కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో గౌతంరెడ్డి, ఆయన డ్రైవర్ బండ శ్రీను హత్యాయత్నానికి పాల్పడ్డారని ఉమామహేశ్వరశాస్త్రి ఆరోపిస్తున్నారు. ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు నలుగురు వ్యక్తులు తన ఇంట్లోకి వచ్చి, తనపై కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని వాపోయారు. తన అరుపులకు చుట్టుపక్కల వారు రావడంతో నలుగురు వ్యక్తులు పారిపోయారని, వారు వెళ్లే సమయంలో తన ఇంటి దస్తావేజులు, సెల్‌ఫోన్, పర్సు తీసుకుపోయారని శాస్త్రి ఆరోపించారు. ఈ మేరకు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌతంరెడ్డి, అతని డ్రైవర్ బండ శ్రీను కలిసి ముందస్తు పథకం ప్రకారం తన హత్యకు కుట్ర చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు 364/2024 నెంబరుతో కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో గౌతంరెడ్డి, ఆయన డ్రైవర్ బండ శ్రీనుతో పాటు నలుగురు వ్యక్తుల పేర్లను చేర్చారు. గతంలోనూ తనపై గౌతంరెడ్డి మనుషులు దాడులకు యత్నించారని శాస్త్రి ఆరోపించారు. గత మార్చి 4న గౌతంరెడ్డి అనుచరులు తనపై దాడి చేశారని, దీనిపై రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు కేసు నమోదు చేయలేదని శాస్త్రి తెలిపారు.



గ్రహణం వీడిన వేదాద్రి ఎత్తిపోతల!

టీడీపీ హయాంలో రూ.489 కోట్లతో ప్రతిపాదనలు

- వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్
- పనులు నిలిపేసిన నాటి కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ప్రారంభం
- పాతపేరును కొనసాగించాలంటున్న రైతులు

6లో

దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంకు లైసెన్స్ రద్దుతో

ఆందోళన

వన్‌టౌన్‌లోని బ్యాంక్‌కు ఖాతాదారుల క్యూ

- వివరాలు తెలుసుకున్న డిపాజిట్‌దారులు
- అన్యాయం జరగదు : సెక్రటరీ బంకా శ్రీనివాసరావు



వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లైసెన్స్ రద్దుతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. వన్‌టౌన్‌లోని ఆర్ఆర్ అప్పారావు వీధిలో ఉన్న బ్యాంక్‌కు బుధవారం ఖాతాదారులు భారీగా తరలివచ్చారు. లక్షలాది రూపాయలు డిపాజిట్ చేసిన ఖాతాదారులు తమ డబ్బు భద్రంగా ఉంటుందో లేదోనని ఉద్యోగు లను అడిగి తెలుసుకున్నారు. 1929లో ప్రారంభించిన ఈ బ్యాంకు మరో నాలుగేళ్లలో వందేళ్లు పూర్తి చేసుకోనుంది. సుమారు పదేళ్ల క్రితం బ్యాంకు పాలకమండలి, అధికారులు వ్యవహరించిన తీరు, అడ్డగోలుగా ఇచ్చిన రుణాలను వసూలు చేయకపోవటం వలన నష్టాల్లోకి వెళ్లింది. సుమారు మూడేళ్ల క్రితం రూ.300 కోట్ల టర్నోవర్ కాలక్రమేణా తగ్గిపోయింది. బ్యాంకులో జరిగిన అవినీతి అక్రమాలపై అనేక కేసులు నమోదు కావడంతో పాటు ఆరోపణలు కూడా వచ్చాయి. రుణాలు సకాలంలో వసూలు చేయకపోవటంతో సుమారు వడ్డీ రూ.100 కోట్లకు చేరింది. దీంతో ఆర్బీఐ అధికారులు 2018 నుంచి బ్యాంకు లావాదేవీలను నిలిపివేశారు. కేవలం రికవరీలే వసూలు చేయాలని ఆదేశించారు. అయితే, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో వందేళ్లు పూర్తి చేసుకోవాల్సిన బ్యాంకు ఆకస్మికంగా లైసెన్స్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. గత పాలకవర్గం, అధికారుల తీరుతో ప్రస్తుతం డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారు. లైసెన్స్ రద్దయ్యిందని తెలియటంతో బ్యాంకుకు క్యూ కట్టారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల

- 14 పంపులను ఆన్ చేసిన అధికారులు

విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ నుంచి కృష్ణానదికి గోదావరి నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 14 పంపులను అక్కడి అధికారులు ఆన్ చేశారు. వాటిద్వారా సుమారు 4 వేల క్యూసెక్కుల నీరు కృష్ణాకు చేరుతోంది. గోదావరికి ప్రస్తుతం 20 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో పట్టిసీమ పంపులను ఆన్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టిసీమ నుంచి నీటిని వదలడం ఇది రెండోసారి.

ఇసుక తవ్వకాలు ప్రారంభం

రీచ్‌ల నుంచి తొలగిపోయిన వరద నీరు

- తవ్వకాలకు 15 రీచ్‌ల గుర్తింపు
- ఎనిమిది రీచ్‌ల్లో కొనసాగుతున్న తవ్వకాలు
- అనుమంచిపల్లిలో అందుబాటులో ఇసుక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇసుక కొరత సమస్య తీరనుంది. జిల్లాలో గుర్తించిన రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. వరద నీరు తగ్గిపోయిన రీచ్‌ల్లో తవ్వకాలు సాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 15 రీచ్‌లు ఉండగా, వాటిలో ఎనిమిది రీచ్‌లలో తవ్వకాలు మొదలుపెట్టారు. వాస్తవానికి కిందటి నెలలోనే తవ్వకాలు జరపాలని భూగర్భ గనుల శాఖ అధికారులు భావించారు. ఇసుకను తవ్వి, వాహనాల్లో పోసి, అక్కడి నుంచి స్టాక్ యార్డులకు తరలించి, అన్‌లోడ్ చేసే పనులను కాంట్రాక్టుకు ఇచ్చారు. కార్మికులతో ఇసుకను తవ్వించడానికి ప్రణాళిక సిద్ధం చేసిన క్రమంలో ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద రావడం మొదలైంది. ఈ రీచ్‌ల్లోకి నీరు చేరడంతో తవ్వకాలు ఆగిపోయాయి. ఇప్పుడు వరద తగ్గడంతో తిరిగి తవ్వకాలు ప్రారంభమయ్యాయి.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రస్తుతం ఒక స్టాక్ పాయింట్‌లోనే ఇసుక నిల్వ ఉంది. కీసర, మొగలూరు, అనుమంచిపల్లిలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వాటిలో అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో ప్రస్తుతం 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచే ఇసుకను విక్రయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 15 రీచ్‌లు ఉండగా, ప్రస్తుతం ఎనిమిదింటిలో తవ్వకాలకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. పెనుగంచిప్రోలు మండలంలోని శనగపాడు, రంగనాయకపాలెం, పెనుగంచిప్రోలు 1, 2 రీచ్‌లు, కంచికచర్ల మండలంలోని పెండ్యాల 1, 2 రీచ్‌ల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. కంచికచర్ల మండలంలో కాసరబాద, ఇందుపల్లిలో ఇసుకను తవ్వుతున్నారు.

వరద కారణంగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణరంగం ఊపందుకుంది. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన కొద్దినెలలకు కృష్ణానదికి భారీస్థాయిలో వరదలు వచ్చాయి. ఫలితంగా ఇసుక అందుబాటులోకి రాలేదు. స్టాక్ పాయింట్లలో ఇసుక తగ్గిపోయింది. వాస్తవానికి గతనెల 16 నుంచి రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ పనులకు ఎగువ నుంచి వస్తున్న వరద అడ్డుగా మారింది. ప్రస్తుతం బ్యారేజీకి ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ నీరు పులిచింతల, వజినేపల్లి, కీసర నుంచి వస్తోంది. ఈ నీటి వల్ల రీచ్‌లకు వచ్చిన ఇబ్బందేమీ లేదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. రీచ్‌ల్లో నిలిచిపోయేంత స్థాయిలో వరద రావడం లేదని పేర్కొంటున్నారు. పులిచింతలలోని జలవిద్యుత్ కేంద్రం నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ఎనిమిది రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నందున, మిగిలిన రీచ్‌ల్లోనూ తవ్వకాలు ప్రారంభమైతే.. చాలావరకు కొరత తీరుతుందని భూగర్భ గనుల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్గానిక్ బెల్లం.. ఆరోగ్యం పదిలం

సేంద్రియ వ్యవసాయంవైపు యువ రైతు అడుగులు



6లో

వైభవంగా పాండురంగని రథోత్సవం

» ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు » అడుగడుగునా స్వామివారికి భక్తుల మంగళహారతులు



పాండురంగని రథం నడుపుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



రథోత్సవంలో కళాకారుల కోలాట ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాండురంగ స్వామి రథోత్సవం బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మచిలీపట్నం పురవీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కూటమి నేతలు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. ట్రాక్టర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర నడిపారు. ఊరేగింపులో పాండురంగ స్వామికి నారికేళాలు, మధుర ఫలాలు సమర్పించారు. భక్తులకు ఎన్ఆర్ఐ సతీష్ 500 కిలోల లడ్డూలు పంచారు. చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమైన రథం పరాసుపేట, నాయర్‌బడ్డీ, కోనేరుసెంటర్, రేవతీ, లక్ష్మీటాకీసు, జిల్లాపరిషత్ సెంటర్ల మీదుగా చిలకలపూడి పాండురంగ స్వామి గుడి వద్దకు రథం చేరుకుంది. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి సమ్మెట శ్రీహరి నాయర్‌బడ్డీ సెంటర్‌లో భక్తులకు స్వీట్లు, తేనీరు అందజేశారు. కోనేరుసెంటర్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్, చిలకలపూడి సీఐ నబి, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబులు బందోబస్తును పర్యవేక్షించారు.

కళాకారుల విన్యాసాలు

పాండురంగ స్వామి రథం ముందుకు సాగగా వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. పాండురంగ స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. స్వర్ణపతకాలు సాధించిన మాధవి బృందం 700 భగవద్గీత శ్లోకాలు, సంపూర్ణ భగవద్గీత పారాయణ చేశారు.



మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

కార్తీక స్నానాలకు ఏర్పాట్లు

» కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా మంగినపూడి సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావులు బీచ్‌ను సందర్శించారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే మంగినపూడికి సుమారు లక్షన్నర మంది యాత్రికులు బీచ్‌ను సందర్శించే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు జిల్లా అధికారులకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. పోలీసు ఔట్‌పోస్టు, గజ ఈతగాళ్లను, బోట్లను ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం, ట్రాఫిక్ నియంత్రించేందుకు ఒన్‌వే చేయాలన్నారు. మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలన్నారు. కార్యక్రమంలో డీపీవో అరుణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి, ఆర్డీవో స్వాతి, ఆర్అండ్‌బి ఈఈ లోకేశ్వరరావు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, లంకే హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ బాలాజీ బోటుపై కొంచెం సేపు ప్రయాణం చేసి ఒడ్డున ఎంత మంది భక్తులు సముద్రం వద్దకు వచ్చి స్నానం చేసేందుకు వీలు ఉంటుందో పరిశీలించారు.

క్రీడా వికాసానికి పెద్దపీట: రవినాయుడు

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రీడాకారులకు ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం చంద్రబాబు.. క్రీడారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించారని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు చెప్పారు. క్రీడా వికాసానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడాకారులు బాగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువత రాణించేందుకు సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు.

నమ్మకాన్ని వమ్ము చేయను : పంచుమర్తి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో చీఫ్ విప్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ కృతజ్ఞతలు తెలిపారు. తనపై వారు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని చెప్పారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ... 'గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లపైగా అప్పు చేసింది. గతంలోనే సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేస్తే.. అప్పుడు మాట్లాడని వైసీపీ నేతలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌పై గందరగోళం చేయాలని చూస్తున్నారు. బటన్లు నొక్కి డబ్బులు వేయకుండా మోసం చేసిన గత ప్రభుత్వం కాదిది' అని పంచుమర్తి అన్నారు.

వైసీపీ సభ్యులు వచ్చి ఉంటే బాగుండేది: సుందరపు

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభ హుందాగా, మంచి వాతావరణంలో నడుస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చెప్పారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... 'మొదటిసారి ఎన్నికైన నాకు బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం వచ్చింది. ఒక్కరోజే 20 మంది మాట్లాడారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా వైసీపీ సభ్యులు కూడా అసెంబ్లీకి వచ్చి ఉంటే బాగుండేది' అని వ్యాఖ్యానించారు.

బకాయిలు విడుదల చేయాలి: పీడీఎఫ్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డీఏ, పీఆర్సీ బకాయిలు రూ.22 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ, '12వ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే గత ప్రభుత్వ జీవోను కొనసాగించాలి. పంటల బీమా అమలుపై రైతు సంఘాలతో చర్చించి, రైతులకు భారం లేకుండా చూడాలి' అని కోరారు.

అతిసార మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాలి: కల్యాణి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో అతిసార వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వైసీపీ ఎమ్మెల్సీ వరదు కల్యాణి డిమాండ్ చేశారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ... 'అతిసార మృతులకు పరిహారం ఏమీ ఉండదన్నట్లు మంత్రి సత్యకుమార్ మండలిలో చెప్పారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే నీటి కాలుష్యం ఏర్పడింది. మృతులంతా నీటి కాలుష్యంతోనే అతిసార బారిన పడినందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని డిమాండ్ చేశారు.

హామీలపై మండలిలో చర్చిస్తాం: వంకా

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హామీలపై మండలిలో చర్చిస్తామని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కూటమి ప్రభుత్వం ఊసెత్తడం లేదని ఆయన విమర్శించారు.

గ్రహణం వీడిన వేదాద్రి ఎత్తిపోతల!

» టీడీపీ హయాంలో రూ.489 కోట్లతో ప్రతిపాదనలు
» వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్
» పనులు నిలిపేసిన నాటి కాంట్రాక్టర్
» కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ప్రారంభం
» పాత పేరును కొనసాగించాలంటున్న రైతులు

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం రాకతో వేదాద్రి ఎత్తిపోతల పథకానికి గ్రహణం వీడింది. అయితే బిల్లుల చెల్లింపులు జరగటం లేదని మూడేళ్ల క్రితం పనులు వదిలి పలాయనం చిత్తగించిన కాంట్రాక్టర్ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 2019 ఫిబ్రవరిలో టీడీపీ ప్రభుత్వంలో రూ.489.28 కోట్ల ప్రతిపాదనతో 38,627 ఎకరాల ఆయకట్టు సాగులో కృష్ణానదిపై ముక్త్యాల ఎత్తిపోతల పేరుతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల్లో ప్రభుత్వం మారటం, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన



ఎక్స్‌కవేటర్ నిర్మాణ పనులు

జగన్‌మోహన్‌రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరుతో అదే ప్రాజెక్టును రూ. 100 కోట్ల తక్కువతో నిర్మిస్తున్నామని ఆగస్టు 28, 2021లో వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పేరుతో పథకానికి రూ.368 కోట్లతో శంకుస్థాపన చేశారు. రూ. 100 కోట్లు మిగిల్చామని నాడు జరిగిన సమావేశాల్లో వైసీపీ నేతలు ఊదరగొట్టినా ఆరోజు ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మాత్రం టీడీపీ హయాంలో ప్రతిపాదించిన అంచనా వ్యయం అని ఉండటం గమనార్హం. రివర్స్ టెండరింగ్‌తో తగ్గించామని రూ.100 కోట్లపై నోరు మెదపకుండా బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్ పనులు వదిలి వెళ్లిన సంగతి విదితమే.

అనుమానాలెన్నో

టీడీపీ హయాంలో ముక్త్యాల పథకంతో జగ్గయ్యపేట,



ప్రస్తుతం ఇంటెక్‌వెల్

వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని 28 గ్రామాలలో 38,267 ఎకరాల ఆయకట్టు సాగుతో పాటు ఆయా మండలాల పరిధిలోని చెరువులు, తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతాయని ప్రతిపాదనల్లో తెలిపారు. తాజాగా వేదాద్రి వద్ద పథకం ఏర్పాటు చేస్తే ప్రధానంగా జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని కొంత భాగానికి నీటి సరఫరా ఉంటుందని రైతులు అంటున్నారు. 28 గ్రామాలకు లబ్ధి చేకూరేలా ప్రతిపాదించిన



కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

పథకం వేదాద్రిలో నిర్మిస్తే గ్రామాల పరిస్థితి అగమ్య గోచరమవుతుందని అంటున్నారు. మెట్ట ప్రాంతాల్లో సాగర్ జలాలపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు రాష్ట్ర విభజనతో తెలంగాణా నుంచి సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారు.

● వేదాద్రి వద్ద నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఇంటెక్‌వెల్ బావిలో ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉన్నందున ఇనుము తుప్పు పట్టి ఉంటుందని, దానిపైనే ఎత్తిపోతల పథకం



కాంట్రాక్టర్ పనులు వదిలి వెళ్లిన సమయంలో ఇంటెక్ వెల్

నిర్మిస్తే భవిష్యత్తులో కృష్ణానదికి వరదలు వస్తే ఆ ఇంటెక్‌వెల్ తట్టుకుంటుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణ సంస్థ మాత్రం నిల్వ నీటిని బయటకు తోడి ఇంజనీరింగ్ నిపుణుల పరిశీలన అనంతరం పనులు ప్రారంభిస్తామంటున్నారు. ప్రాజెక్టు కోసం జంగిల్ క్లియరెన్స్‌తో పాటు షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు లేని సమాచారం

రూ.కోట్లతో వేలాది ఎకరాల సాగుకు పునర్నిర్మాణం చేపడుతున్న ప్రాజెక్టు విషయంలో కాంట్రాక్టు సంస్థకు సంబంధించి సర్పంచ్, ప్రజాప్రతినిధులకు సమాచారం లేకపోవడం కొస మెరుపు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో తిరిగి పనులు ప్రారంభించి పథకానికి గతంలో పెట్టిన పేరుతో సాగిస్తారా లేక మారుస్తారా అని రైతులు తర్జనభర్జన పడుతున్నారు. జగన్ హయాంలో పెట్టిన పేరు మార్చాలని రైతులు కోరుతున్నారు.

కాలేజీ పాస్‌లకు ప్రత్యేకం!

» జగ్గయ్యపేట డిపో వింత పోకడ
» బడి బస్సు రూటు మార్చిన అధికారులు

జగ్గయ్యపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాలేజీ పాస్‌లు ఉన్న వారికే ఈ బస్సు 'ప్రత్యేకం'.. అంటూ జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో అధికారుల వింత స్లోగన్ 'ప్రగతి చక్రాల'కు ప్రతిబంధకంగా మారింది.. బస్సుకు ఉన్న బోర్డు తొలగించి కాలేజీ పాస్‌లు ఉన్న వారికే.. అంటూ కాగితంపై రాసి అంటించటం అటు ఆర్టీసీ వర్గాల్లోను, ఇటు ప్రయాణికుల్లోను చర్చకు దారి తీసింది.

సాధారణంగా బడి బస్సులు పల్లెల నుంచి పట్టణాలకు, సమీపంలో పెద్ద గ్రామాల్లో ఉన్న హైస్కూళ్లకు వచ్చే పిల్లల కోసమే అయినా సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. బడిబస్సు ఎక్కే ప్రయాణికులకు కండక్టర్ టికెట్లు కొట్టి చార్జీలు వసూలు చేస్తాడు. ఇటీవల డిపోలో కార్మికులకు, అధికారులకు మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇదిలా ఉంటే ఆర్టీసీ కొత్త వివాదం వెలుగులోకి వచ్చింది. టిమ్స్ ఆపరేషన్ వచ్చిన డ్రైవర్లను కాకుండా ఇతర డ్రైవర్లను బడిబస్సులకు పంపుతున్నారు. టికెట్లు కొట్టడం రాదని మొత్తుకున్నా డ్యూటీలు వేస్తుండటంతో వాళ్లు టిమ్స్ మిషన్లను పక్కనపెట్టేసి పాస్‌లు ఉన్న వారినే ఎక్కిస్తున్నారు. డ్యూటీ డ్రైవర్లు ఏకంగా కాగితంపై రాసి బడి బస్సు బోర్డుకే కాలేజి పాస్‌లు ఉన్న వారికే ఈ బస్సు అని అంటించేశారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో గందరగోళానికి దారితీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రం ఆక్యుపెన్సీతో ఉన్న డిపో ఈ విధానంతో పూర్తిగా అటకెక్కినట్టేనని కార్మిక నేతలు అంటున్నారు. దీనిపై ఆర్టీసీ డిపో రఘురాంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తనకు ఈ విషయం తెలియదని, సంబంధిత అధికారులను విచారించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.



ఆర్టీసీ బస్సుఅద్దం వెనుక రాసిన బోర్డు

ఆర్గానిక్ బెల్లం.. ఆరోగ్యం పదిలం

» సేంద్రీయ వ్యవసాయం వైపు యువ రైతు అడుగులు

(మోపిదేవి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్య అభ్యసించి యువత కంప్యూటర్ రంగంవైపు పరుగులు పెడుతుంటే.. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బాలతేజ మాత్రం ఆరోగ్యవంతమైన



గానుగ బెల్లం పాకం తయారు చేస్తున్న కూలీలు

సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నాడు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బాలతేజ ఐదెకరాల చెరకు పంటను సేంద్రీయ విధానంలో సాగుచేసి పూర్తి



ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసిన బెల్లం

ఆర్గానిక్ పద్ధతిలో బెల్లం తయారు చేస్తున్నాడు. కొక్కిలిగడ్డ గ్రామంలో యంత్రాలను ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సలహాలు పాటిస్తూ.. రసాయనాలు, మందులు వినియోగించకుండా సేంద్రీయ పద్ధతిలో వేప పిండి, జీవామృతం, యజ్ఞాస్త్రంతో చెరకు పంట సాగుచేశాడు. పంట దిగుబడి రావటంతో ఆర్గానిక్ విధానంలో బెల్లం తయారు చేస్తున్నాడు. ప్రస్తుతం 1000 కేజీల బెల్లాన్ని తయారు చేసినట్టు బాలతేజ చెప్పాడు. మార్కెటింగ్ సౌకర్యం సమకూరిస్తే మరింత ఉత్పత్తికి అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. టన్ను చెరకుతో 95 కేజీల బెల్లం తయారు చేయవచ్చని రైతులు చెబుతున్నారు.

యూనిట్ ఉద్యోగుల ప్రోత్సాహం

- బాలతేజ, రైతు



ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఉద్యోగులు నరసింహారావు, సురేష్‌ల సూచనలతో రెండేళ్లుగా ఆర్గానిక్ పద్ధతిలో చెరకు సాగుచేసి బెల్లం తయారు చేస్తున్నా. చెరకు సాగు, బెల్లం తయారీకి కూలీలు, పెట్టుబడి రూపంలో అధిక మొత్తంలో ఖర్చు అవుతుంది. ఇప్పటికి 1000 కేజీల బెల్లం తయారు చేయటం జరిగింది. ప్రభుత్వం ఆర్గానిక్ ఉత్పత్తులకు రాయితీలు కల్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

- పి.నరసింహారావు, ఏపీ సీఎన్ఎఫ్ మండల యూనిట్ ఇన్‌చార్జి



ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన యువరైతు తేజ తన వ్యవసాయ భూమిలో తయారు చేస్తున్న ఆర్గానిక్ బెల్లాన్ని ఈ ప్రాంత వాసులు వినియోగించేలా అవగాహన కల్పిస్తాం. మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

అసెంబ్లీ వేదికగా

చింతలపూడిపై వసంత తొలి ప్రశ్న



ఇబ్రహీంపట్నం/నందిగామ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిని పూర్తిచేసి గోదావరి జలాలను ఎన్ఎస్పీ కాలువల్లో పారించాలని మూడోజోన్‌లోని ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగునీరు అందించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. బుధవారం జరిగిన ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో తొలి ప్రశ్నగా ఆయన చింతలపూడి ఎత్తిపోతల పథకంపై అడిగారు. టీడీపీ హయాంలో 2014-19 వరకు సుమారు రూ.4,200 కోట్లు ఖర్చు చేసి చింతలపూడిని పరుగులు పెట్టిస్తే వైసీపీ ప్రభుత్వం రైతు ప్రయోజనాలను గాలికొదిలేసి ప్రాజెక్టును పక్కన పెట్టిందన్నారు. పథకం పూర్తి అయితే ఎన్టీఆర్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 35 మండలాలకు కొత్తగా 2 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని సభ ముందు ఉంచారు. చింతలపూడి ఆలస్యానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని ప్రాజక్టు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలో చింతలపూడి పూర్తికి కృషిచేస్తామని మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు.

ప్రజాహితం కోసం పనిచేస్తా.. సౌమ్య



ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజాహితం కోసం పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తానని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శాసనసభలో ఆమె మాట్లాడుతూ, మహిళా పోలీసులకు ఆరుశాఖల విధులు అప్పగించి వైసీపీ ప్రభుత్వం వారికి సరైన జాబ్ క్యాలెండర్ లేకుండా చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వారికి స్పష్టమైన జాబ్‌చార్ట్ కేటాయించాలని, కేవలం మహిళా విభాగం బాధ్యతలు మాత్రమే అందించాలని కోరారు.

పేదలకు శాశ్వత ఇళ్లు.. : బోడె ప్రసాద్



పేదలకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వాటిపై పూర్తి హక్కులు లబ్ధిదారులకు కల్పించాలని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా తమకు కేటాయించిన స్థలాలపై పూర్తి హక్కులు తమకు లేవని, బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదని పలువురు లబ్దిదారులు తెలిపారని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలని కోరారు.

పీఏసీఎస్ సీఈవోపై వేటు

నందిగామరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోళ్లమూడి పీఏసీఎస్ సీఈఓ(కార్యదర్శి) కటారపు రామారావుపై ఉన్నతాధికారులు వేటువేశారు. సహకార సంఘంలో ఉద్యోగం చేస్తూ డప్పు కళాకారుల పెన్షన్ తీసుకోవడంపై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఏపీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ 2024, ఎస్జీటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి జి.రమేష్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వంద మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, డీఈడీ, టీటీసీ, టెట్ మార్కుల లిస్టు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు మచిలీపట్నం ఈడేపల్లిలోని పద్మావతి మహిళా బిఈడీ కళాశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 9849420123కు సంప్రదించాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

20న ప్రోస్టేట్ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

పటమట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రోస్టేట్ కేన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానూరులోని నాగార్జున హాస్పిటల్ సహకారంతో ప్రోస్టేట్ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఈ నెల 20న అశోక్‌నగర్‌లోని రూట్స్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ డాక్టర్ పి. విజయభాస్కర్ తెలిపారు. ప్రోస్టేట్ గ్రంధి పెరుగుదల వలన వయస్సు పెరిగే కొద్ది ఇది కేన్సర్‌కు దారితీస్తుందన్నారు. 50 ఏళ్లు దాటిన పేరుషులు అల్ట్రా సౌండ్ స్కేచ్, పీఎస్ఏ అనే రక్త పరీక్ష ప్రతీ సంవత్సరం చేయించుకోవడం ద్వారా ప్రోస్టేట్ కేన్సర్ ముప్పు గుర్తించగలమన్నారు. వివరాలకు 9849872499 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రోగుల సహాయకులకు ఉచిత భోజనం

● 2023లో సర్వజనాసుపత్రిలో ఉచిత భోజనం ప్రారంభించిన బేతెస్థ మినిస్ట్రీస్ ● రోజుకు 500 మందికి అన్నదానం

(ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి)

సర్వజనాసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు బేతెస్థ గాడ్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్టు తరుపున ప్రతి రోజు సుమారు 500 మందికి ఉచిత భోజనం పెడుతున్నారు. 2023 జూన్ ఒకటి నుంచి ఉచిత భోజనం కార్యక్రమాన్ని నేటి వరకు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో చేరిన రోగులకు ప్రభుత్వం ఉచిత భోజన పెడుతుంది. అయితే వారికి సహాయకులుగా వచ్చే వారికి భోజనం పెడితే మంచిదని తలంచిన బేతెస్థ గాడ్ మినిస్ట్రీస్ సంస్థ వ్యవస్థాపకుడు పాస్టర్ కొల్లిపర ఇస్సాక్ ఈ ఉచిత భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు సహాయకులుగా ఉండే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.



రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న పాస్టర్ కొల్లిపర ఇస్సాక్ (ఫైల్ ఫొటో)

కళ్లారా వారి బాధలు చూశా

1989లో మూత్ర పిండాల వ్యాధికి చికిత్స చేయించుకునేందుకు పాత ప్రభుత్వాసుపత్రిలో చేరాను. డాక్టర్లు రెండు కిడ్నీలు పాడయ్యాయన్నారు. చికిత్స పొందుతున్న సమయంలో రోగుల సహాయకులు పడే బాధలు ప్రత్యక్షంగా చూశాను. వారి కోసం ఏదైనా చేయాలని భావించాను. అందుకే ఉచిత భోజన పథకం ప్రారంభించాను. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటాం.

- పాస్టర్ కొల్లిపర ఇస్సాక్, బేతెస్థ గాడ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు

అభివృద్ధిని వివరించి.. సభ్యత్వ నమోదు చేయండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారు సభ్యత్వం పొందేలా డివిజన్లలోని ప్రతీ నాయకుడు, కార్యకర్త చూడాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం గద్దె స్వయంగాపరిశీలించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ నాయకులు, సమన్వయకర్తలు డివిజన్‌లో ఎక్కువ మంది సభ్యత్వం తీసుకునే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ప్రతీ ఒక్కరికీ సంక్షేమాన్ని అందజేస్తున్న సీఎం చంద్రబాబుకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నాభత్తుని బాబీ, కర్రా రమేష్‌బాబు, వరికూటి ఆంజనేయులు, రంగనాయులు పాల్గొన్నారు.


14వ డివిజన్‌లో సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న గద్దె

రీడింగ్ రూమ్ ప్రారంభం

భారతీనగర్: తూర్పు పరిధి నాల్గవ డివిజన్‌లో లయోలా గార్డెన్స్ ఏరియాలో రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని రీడింగ్‌రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ వైసీపీ పాలనలో డ్రైయిన్ల నిర్వహణ సరిగా లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని డ్రెయిన్లను శుభ్రం చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ డివిజన్‌లో మిగిలిన ప్రాం తాల్లో కూడా నాలుగు రీడింగ్ రూమ్‌లను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడాలి బాబు, దావులూరు ప్రకాష్, జి.రామ్మోహన్‌రావు, ఎన్.శంకరరావు, టీఎంఎస్.రాజు, ఆళ్ల వెంకటేశ్వరరావు, కే.సురేష్, కే.కృష్ణ, గంట రవి పాల్గొన్నారు.

జాతీయ మల్లాఖంబ్ పోటీలకు బోయపాటి విద్యార్థి అరవింద్‌కుమార్ ఎంపిక

మొగల్రాజపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోయపాటి శివ రామకృష్ణయ్య నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి కె. అరవింద్‌కుమార్ జాతీయ మల్లాఖంబ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి మల్లాఖంబ్ పోటీలకు పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14 లో కె.అలేఖ్య, అండర్ 19లో వి.చందు (8వ తరగతి)లు రజిత పతకాలు సాధించారని చెప్పారు. త్వరలో ఉజ్జయినిలో జరిగే జాతీయ పోటీలకు కె. అరవింద్‌కుమార్ అర్హత సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులను కార్పొరేటర్ సీహెచ్ ఉషారాణి అభినందించారు. పాఠశాలను దత్తత తీసుకున్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అరవింద్ కుమార్‌కు మొమెంటో, బ్యాగ్, సర్టిఫికెట్‌ను బహూకరించారు. పోటీల్లో పాల్గొనడానికి అయ్యే ఖర్చులను భరించడానికి ముందుకు వచ్చారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ ఎం.రాజకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.


విద్యార్థులను, కోచ్ రాజకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగరాజు, కార్పొరేటర్ ఉషారాణి

దర్శిపేటలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పటమట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దర్శిపేట రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి కల్యాణమండపంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, స్వామి వ్రతంలో ఐదు కథలను భక్తులకు అర్థమయ్యే రీతిలో వినిపించారు. వ్రతంలో పాల్గొన్న 200 మంది దంపతులకు వెండి డాలర్‌ను అందజేశారు. అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికా రి యామా శివన్నారాయణ, తాండవ రంగలక్ష్మి పాల్గొన్నారు.


సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

భారతీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నాల్గవ డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్ బ్యాంక్ కాలనీలోని పరిటాల ఓంకార కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. పటమట సీఐ పవన్ కిశోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. దొంగతనాలు ఏ విధంగా జరుగుతాయి, నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏసీపీ, సీఐలు వివరించారు.డయల్ 100, 112 వల్ల ఉపయోగాలు తెలియజేశారు. స్థానికులు గొల్లపూడి నాగేశ్వరరావు, దాస్, యలమంచిలి రాజేష్, జి నరసింహారావు, కె. శ్రీనివాస బాబు, చలసాని వాసు, పి. సాంబశివరావు, జి. రామకృష్ణ, పి. సుబ్రహ్మణ్యం, ఎ. రమేష్, సిహెచ్ సుబ్బారావు, చలసాని రోజా పాల్గొన్నారు.

COURT NOTICE

IN THE COURT OF THE HON'BLE I ADDL. Sr. CIVIL JUDGE :: GUNTUR
E.A. 56/2024 in E.P. 60 / 2022 in O.S. 29 / 2019
Between:
Inampudi Vanaja Kumari ..Claim Petitioner
And
1)Dandu Uma, 2) Kusampudi Shanmukha Varma. ...Respondents.
To,
Kusampudi Shanmukha Varma, S/o. Naga Vardhana Varma, R/o. Flat No. 408, Green Meadows Apartment, Bharatha Matha Temple Road, Nandamuri Nagar, Vijayawada-15, Krishna Dist. (R2/JDR).
పై నెంబరు పిటీషనును Claim Petitioner తగు పరిపరిహారములు కోరుచూ రెస్పాండెంట్స్‌పై దాఖలు చేసి సదరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీకు పలు పర్యాయములు కోర్టు నోటీసులు పంపించినను బుద్ధి పూర్వకంగా తీసుకొనక కాలయాపన చేస్తున్నందువలన మీ హాజరు నిమిత్తమై శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీచేసియున్నారు. కనుక సదరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీరు ది.02-12-2024వ తేది ఉ॥గం॥ 10-30ని॥లకు పై చెప్పిన కోర్టువారి ఎదుటహాజరై సదరు పిటీషనులో మీకుగల ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల సదరు పిటీషనును మీ పరోక్షమందు తీర్మానం చేయబడు నని తెలియజేయటమైనది. వాయిదా తేదీ: 02-12-2024.
సాయికృష్ణ శ్రీనివాస్ గోవిందరాజు, క్లయిమ్ పిటీషనరు తరపు అడ్వకేట్, బ్రాడీపేట, గుంటూరు

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

ఎమ్మెల్యే సుజనా చౌదరి

లబ్బీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మాదక ద్రవ్యాలు వినియోగం వలన ఏర్పడే దుష్ఫలితాల పట్ల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు అందరం సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. బెంజిసర్కిల్‌లోని జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఎంజే నాయుడు హాస్పటల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. వైద్యులంతా మానవతా దృక్పథంతో సమాజసేవలో భాగ స్వాములు కావాలని, వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ మాదక ద్రవ్యాలు వినియోగానికి వ్యతిరేకంగా చైతన్యం కలిగించేలా ఇటువంటి కార్యక్రమాన్ని రూపొందిచడం అభినందనీయమన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడకం వలన సంభవించే అనర్థాలను ప్రచారం చేయడంతో పాటు అవకాశం ఉన్న చోట అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజే నాయుడు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ మాధవి, డాక్టర్ వంశీ, హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ ఎంజే నాయుడు, రాధిక రెడ్డి, సిద్ధార్థ మహిళా కళాశాల మాజీ డైరెక్టర్ టి.విజయ లక్ష్మి, కార్పొరేటర్ అపర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

ఖాళీ స్థలాల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భారతీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్‌లోని కరెన్సీ నగర్, శ్రీ రామచంద్ర నగర్, గణేష్ నగర్, కనకదుర్గ నగర్ కాలనీల్లో ఉన్న ఖాళీస్థలాల్లో బుధవారం జిల్లా మలేరియా అధికారి మోతిబాబు ఆధ్వర్యంలో వీఎంసీ సిబ్బంది ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. 'దోమలతో ప్రజలు బేజారు' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించిన నగర పాలన సంస్థ అధికారులు సిబ్బందిని పంపి యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, మెడికల్ సూపర్‌వైజర్ జగదీష్, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


ఖాళీ స్థలాల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తున్న వీఎంసీ సిబ్బంది

ప్రతిభను వెలికి తీసేందుకు చిత్రలేఖనం

విజిలెన్స్ శాఖ కమిషనర్ అనిల్ చంద్ర పునీత

మొగల్రాజపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు చిత్రలేఖనం వంటి పోటీలు దోహదం చేస్తాయని విజిలెన్స్ శాఖ కమిషనర్ అనిల్ చంద్ర పునీత చెప్పారు. అనంత్ డైమండ్స్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)సంయుక్త ఆధ్వర్యంలో రమేష్ ఆసుపత్రి రోడ్డులో స్పా కళాశాల ఆవరణలో బుధవారం చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ ఛైర్మన్ పి.రమేష్ మాట్లాడుతూ ఈ నెల 17న స్పా కళాశాల ఆవరణలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంత్ డైమండ్స్ వ్యవస్థాపకుడు జాస్తి అనంత పద్మశేఖర్, స్పా కళాశాల రిజిస్ట్రార్ కేవీ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంతోష్ కుమార్, టి. మాధవరావు, చిత్రకారులు టి.మృత్యుంజయరావు, చిన్న స్వార్తి, శ్రీధర్, కళాసాగర్, బీఎస్‌వీ రమేష్, పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ ఛైర్మన్ సింలూరి శ్రీనివాసరావు, గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు

ధర్నాచౌక్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు మూడు నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పని ఒత్తిడి, నిర్ణీత సమయం టార్గెట్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. తమకు ప్రమోషన్లు కల్పించకపోవడంతో చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి సచివాలయ ఉద్యోగికి మొబైల్, 5జీ సిమ్‌కార్డు ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఉదయం 7 గంటలకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అదనపు లోడు వాడుతున్న 104 సర్వీసులు గుర్తింపు

రూ.3.44లక్షల జరిమానా

సత్యనారాయణపురం, నవంబరు 13: ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో అదనపులోడు వాడుతున్న 104 సర్వీసులను గుర్తించి వారికి రూ.3.44లక్షల జరిమానా విధించామని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు.

ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విజిలెన్ విభాగం నుంచి ఆరు టీమ్‌లు, ఆపరేషన్ విభాగం నుంచి 50 టీమ్‌లు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీలలో అదనపు లోడు వారుతున్న వారిని గుర్తించి జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్ విభాగానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, ఆపరేషన్ టౌన్ విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. రవీంద్ర బాబు, నగరంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

Before the Motor Accidents Claims Tribunal Cum -IV Additional District Judge:: Tirupati
M.V.O.P.No.71 of 2023
D.Lokeswari ... Petitioner
Vs
1.P.Santha Rao and others ...Respondents

Notice to the Respondent No.1
P.Santha Rao (Driver) S/o. Venkata Rama Rao, Driver of Mahindra Furio Lorry Bearing No.AP 39-TK-2388, Residing at D.No.61-20-8/4, Ward No.46, Ramalingeswara Nagar, Vijayawada, Krishna District.
Sir,
Please take notice that the Accident O.P. was filed by the Petitioner for Rs. 2,00,000/- and the same has been posted on 20-11-2024 for your appearance. Please attend on that day before the above said court by 10.30 a.m., and file your objections if any. Otherwise the matter will be decided exparte.
B.K.RAMESH
Advocate for Petitioner, Tirupati
Cell No.98498 23443

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT HYDERABAD AT: HYDERABAD
O. S. No. 1508 OF 2024
Between:
State Bank of India, Secretariat Branch, Dr.B.R.Ambedkar TS Secretariat, Saifabad, Hyderabad - 500022. Rep. by its Authorised Officer ... Plaintiff
AND
Sri. Kondeti Manikantha S/o. Kondeti Subba Rao, Age: 36 Yrs, OCC: Police Constable, O/o. The Director General APSPF, D. No. 74-14-1A, Rajanarendra Building, Yanamalakuduru Road, Krishnanagar, Patamata, Vijayawada, A.P-520 007. & R/o. H. No. 6-3-1020, Raj Bhavan Road, Somajiguda, Hyderabad 500 060. ...Defendant
Take notice that the above-named plaintiff have instituted the above suit against you for recovery of outstanding amount of Rs.1,87,434/- (Rupees One Lakhs Eighty Seven Thousand Four Hundred Thirty Four Only) along with interest from the date of suit till the realization together with subsequent interest. You are hereby directed to appear before the Hon'ble VII Junior Civil Judge, City Civil Court Hyderabad at Hyderabad in person or through your counsel on 29.11.2024, at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence as per law.
// By Order of the Court //
K. JAYARAJ, Advocate



హెల్త్ వర్సిటీ వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుయువత

హెల్త్ వర్శిటీలో వైఎస్ విగ్రహం తొలగించాలి

గుణదల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత ఆలోచనతో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి డిమాండ్ చేశారు. వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ వర్శిటీ వద్ద నిరసన తెలియజేసిన అనంతరం యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సిహెచ్. శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కక్షపూరిత ఆలోచనతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎన్టీఆర్ ఆరోగ్యవిశ్వవిద్యాలయం పేరును వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ పేరును తొలగించడమే కాకుండా బోర్డులు చెరిపేసి వైఎస్ విగ్రహాన్ని పెట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్ఆర్ పేరును తొలగించి డాక్టర్ ఎన్టీఆర్ పేరు పెడుతున్నట్లుగా గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నెల రోజులు కావస్తున్నా ఇంత వరకు వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. వైఎస్ విగ్రహం తొలగింపు విషయమై తక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు.

గుణదల మాత మహోత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



ఉత్సవ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్

గుణదల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న గుణదల మాత 101వ మహోత్సవాలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉత్సవ కమిటీకి సూచించారు. గుణదల పుణ్యక్షేత్రం ప్రాంగణంలో గుణదల మాత 101వ మహోత్సవాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని చెప్పా రు. కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ, 2025 జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు గుణదల కొండపై జరిగే నవదిన ప్రార్థనల్లో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ, గుణదలమాత పుణ్యక్షేత్రంలో లూర్దు మాత భక్తుల నీరాజనాలు అందుకుంటుందన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్, ఫాదర్ పల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమస్, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ దామాల విజయ్‌కుమార్, నువ్వుల విజయరాజ్, సిస్టర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




పతకాలు సాధించిన ఆర్చర్లు

జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఏపీకి ఓవరాల్ చాంప్

విజయవాడస్పోర్ట్సు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రం నడియాడ్‌లో ఈనెల 12న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించడంతోపాటు బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినట్లు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జి భానుమూర్తి రాజు బుధవారం తెలిపారు. ఆర్చరీ కాంపౌండ్‌లో బాలికల జట్టులో మాదల సూర్యహంసిని (భీమవరం), కర్రి సుష్మిత(కాళ్ల), రిషి కీర్తన కామినేని (విజయవాడ), స్ఫూర్తి వేగేసిన (కాళ్ల)బంగారు పతకాలను సాధించారన్నారు. ఆర్చరీ కాం పౌండ్ బాలికల 50 మీటర్ల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని మా దల సూర్యహంసిని సాధించిందన్నారు. రికర్వ్ రౌండ్‌లో బాలుర 60 మీటర్ల విభాగంలో కోదండ పాణి ధర్మేష్ జత్య(నెల్లూరు) స్వర్ణ పతకం సాధించాడన్నారు. సత్తా చాటిన ఆర్చర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అభినందించారు.

బాలుడి కుటుంబానికి న్యాయాధికారి పరామర్శ



బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న శోభారాణి

పెనుగంచిప్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల దాడిలో రెండు రోజుల క్రితం చనిపోయిన బాలుడు బాలతోటి ప్రేమ్ కుమార్ తల్లిదండ్రులు నాగమణి - గోపాల్‌రావులను జగ్గయ్యపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శోభారాణి బుధవారం రాత్రి పరామర్శించారు. సంఘటన జరిగిన తీరు ను ఆమె అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరావు, తోటచర్లకు చెందిన సామ్యూల్ పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురా వాలనిమేజిస్ట్రేట్ ఎం.శోభారాణి పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని ఆమె పరిశీలించారు. వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బార్ అధ్యక్షుడు సుందర్‌రావు, ఎస్.కె.అర్జున, బి.శంకర్ పాల్గొన్నారు.



గౌతంరెడ్డి గూండాల చేతిలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న స్థల యజమాని ఉమామహేశ్వరశాస్త్రి

స్థలం కబ్జా.. హత్యకు సుపారీ

(5వ పేజీ తరువాయి)

జరిగిపోయింది. స్థల వివాదం కోర్టులో ఉందని అసలు యజమానులు మొరపెట్టుకున్నా వీఎంసీ అధికారులు పట్టించుకోలేదు.

రూ.24 లక్షలకు సుపారీ.. పోలీసుల అదుపులో నలుగురు

శాస్త్రి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు మొత్తం 9 మందికి ఈ దాడితో సంబంధముందని గుర్తించారు. శాస్త్రిపై దాడి చేసిన వారందరూ జగ్గయ్యపేట నియోజకవర్గం చిల్లకల్లుకు చెందినవారు కాగా, వారిలో ఒకరిని మంగళవారం చిల్లకల్లులో అరెస్టు చేశారు. బుధవారం మరో ముగ్గురిని హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. సత్యనారాయణపురానికి చెందిన ఓ న్యాయవాది ద్వారా వీరితో గౌతంరెడ్డి రూ.24 లక్షలకు సుపారీ కుదుర్చుకున్నాడని సమాచారం. కేసు విచారణలో ఉందని, అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

దుర్గా కో-ఆపరేటివ్ ఖాతాదారుల ఆందోళన



వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కో- ఆపరేటివ్ అర్బన్‌లో అక్రమాల నేపథ్యంలో ఆర్‌బీఐ అధికారులు తనిఖీలు నిర్వహించి, బ్యాంకు లైసెన్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్ద డిపాజిట్ దారులందరూ బారులు తీరారు. ఖాతాదారులు ఆందోళనను, ఆవేదనను వ్యక్తం చేశారు. ఖాతాదారులేమంటున్నారో వారి మాటల్లోనే



రూ.15 లక్షలు డిపాజిట్ చేశా

ప్రభుత్వ ఉద్యోగిగా రూపాయి రూపాయి కూడగట్టి పలు దఫాలుగా నాలుగేళ్ల క్రితం రూ.15 లక్షలు డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి కనీసం వడ్డీ కూడా ఇవ్వలేదు. డిపాజిట్లు వస్తాయో లేదో? ఎంతకాలం ఎదురు చూడాలో తెలియటం లేదు.

- ప్రసన్న కుమార్, చిట్టినగర్

మూడేళ్లయినా వడ్డీ ఇవ్వలేదు



మూడేళ్ల క్రితం రూ.5 లక్షలు డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి వడ్డీ ఇవ్వలేదు. డిపాజిట్ తిరిగి ఇచ్చేయమని అడుగుతున్నా.. బ్యాంకు అధికారులు ఆర్బీఐ నిబంధనలు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. డబ్బులు వస్తాయో లేదో తెలియటం లేదు.

- కృష్ణవేణి, వన్‌టౌన్



కుమార్తె వివాహం కోసం దాచా

రూపాయి రూపాయి కూడబెట్టుకుని కుమార్తె వివాహం నిమిత్తం బ్యాంకులో దాచుకున్నా. అవసరాల నిమిత్తం కొన్ని రోజుల నుంచి డబ్బులు ఇవ్వమని అడుగుతుంటే తరువాత ఇస్తామని చెబుతున్నారు. బ్యాంకు వద్దకు వచ్చి సిబ్బందిని అడిగితే ఇబ్బంది ఏమి ఉండదంటున్నారు.

- ఉప్పాల అచ్చమ్మ



రూ.50 లక్షలకు రెండేళ్ల నుంచి వడ్డీ కూడా ఇవ్వటం లేదు

ప్రభుత్వ ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయిన తరువాత వచ్చిన రూ.50 లక్షలను రెండున్నర ఏళ్ల క్రితం డిపాజిట్ చేశాను. ఇప్పటి వరకు కనీసం వడ్డీ కూడా ఇవ్వలేదు. అసలు, వడ్డీ కలుపుకుంటే రూ.54 లక్షలు అయ్యింది. డబ్బులు ఇవ్వమని బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా ఆర్బీఐ నిబంధనల మేరకు లక్షన్నర రూపాయలు మాత్రమే ఇస్తామంటున్నారు.

- ఖాన్, రిటైర్డ్ ఉద్యోగి

డిపాజిట్ కాలపరిమితి ముగిసినా డబ్బు ఇవ్వలేదు



పలు దఫాలుగా 2019లో రూ.10 లక్షలు డిపాజిట్ చేశాను. ఆనాటి నుంచి ఇప్పటి వరకు వడ్డీ ఇవ్వలేదు. డిపాజిట్ కాలపరిమితి ముగిసినా డబ్బులు ఇవ్వలేదు. మూడు నెలలకు ఒకసారి రెన్యూవల్ చేసుకుంటున్నాను. డబ్బులు లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

- గంగాధర్, ప్రైవేటు ఉద్యోగి

డిపాజిట్‌దారులకు అన్యాయం జరగదు



బ్యాంకు ఇచ్చిన రుణాలు అసలు రూ.50 కోట్లకు వడ్డీ కలిపి రూ.200 కోట్లు రావాల్సి ఉంది. ప్రస్తుతం బ్యాంకు వద్ద రూ.60 కోట్లు ఉన్నాయి. ఆర్బీఐ అధికారులు పర్యవేక్షణలో బ్యాంకు లావాదేవీలు జరుగుతాయి. డిపాజిట్‌దారులకు అన్యాయం జరగదు. అయిదారు రోజుల్లో లిక్విడేటర్‌ను నియమిస్తారు. ఆర్బీఐ అధికారుల ఆదేశాలు, బ్యాంకు నిబంధనల మేరకు డిపాజిట్‌దారులకు డబ్బులు ఇవ్వటం జరుగుతుంది.

- బంకా శ్రీనివాసరావు, సెక్రటరీ, దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంకు

స్వాతంత్ర్య సమరయోధురాలు నరసాయమ్మ కన్నుమూత



రాంపిళ్ల నరసాయమ్మ భౌతికకాయం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

చిట్టినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ (95) బుధవారం విజయవాడలో కన్నుమూశారు. నరసాయమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఆమె పెద్ద కుమారుడు హనుమత్ దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ. రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. మూడో కుమారుడు గౌరీ శివశంకర్ కొత్తపేటలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. కుమార్తె తమ్మిన గౌరీబాయి వ్యాపార రంగంలో ఉన్నారు.

తెల్లదొరలను ఎదుర్కోవాలనే లక్ష్యంతో తన భర్త సర్దార్ రాంపిళ్ల సూర్యనారాయణతో కలిసి ఆమె విజయవాడ పాల ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న కొండపై బాంబులు తయారు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం నరసాయమ్మ, సూర్యనారాయణ దంపతులపై బెజవాడ బాంబు కుట్ర కేసు పెట్టి అరెస్టు చేసింది. కొన్ని నెలలపాటు బ్రిటీష్ పాలకు నరసాయమ్మను జైలులో నిర్బంధించారు. స్వాతంత్ర్యానంతరం గోవా దీవుల విముక్తి పోరాటంలో భర్త సూర్యనారాయణతో కలిసి నరసాయమ్మ పాల్గొని జైలు జీవితం గడిపారు. ఆమె జైలులో ఉన్న సమయంలోనే రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్ పుట్టారు. దేశ అభ్యున్నతికి గాంధీ మార్గమే ఉత్తమమని భావించి గాంధీ దేవాలయాన్ని స్థాపించారు. గాంధీ దీక్షలను ప్రచారం చేశారు. కేంద్రప్రభుత్వం హోంమంత్రిత్వ శాఖ సలహా మండలిలో నరసాయమ్మకు స్థానం కల్పించడంతో స్వాతంత్ర్య సమరయోధుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేశారు. సమరయోధులకు పెన్షన్ భారీగా పెంచడంలో నరసాయమ్మ పాత్ర ఎనలేనిది. రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, రామనాథ్ కోవింద్ వంటి ప్రముఖుల చేతుల మీదుగా నరసాయమ్మ పలు మార్లు సత్కారాలను అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పలు సందర్భాల్లో నరసాయమ్మను సత్కరించారు. పలు జాతీయ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని తన ప్రసంగాల ద్వారా జాతిని ఉత్తేజితం చేశారు. తన మామగారు సయ్యద్ రాంపిళ్ల అప్పలస్వామి నెలకొల్పిన సయ్యద్ అప్పలస్వామి కళాశాల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. నిరాడంబర జీవితం, పరోపకార బుద్ధి వంటి మహోన్నత గుణాలతో విద్యార్థులకు నరసాయమ్మ ఆదర్శంగా నిలిచారు. నరసాయమ్మ మృతి వార్త తెలియగానే పలువురు ప్రముఖులు తరలివచ్చి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. భారతదేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. నరసాయమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మహిళ ఇల్లు కబ్జాకు యత్నం

- వైసీపీ నాయకుడి అరాచకం
- ఇల్లు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి
- సీపీని ఆశ్రయించిన బాధితురాలు



బాధితురాలు కొనుగోలు చేసిన ఇల్లు (ఇన్‌సెట్లో బాధితురాలు ఎస్తేరు రాణి)

వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో స్థలాల కబ్జాకు పాల్పడిన డివిజన్ నాయకులు ప్రభుత్వం మారినా తమ తీరు మార్చుకోలేదు. సింగ్‌నగర్‌లోని పేద మహిళ ఇల్లు కబ్జా చేయటానికి 60 వ డివిజన్ నాయకుడు యత్నించాడు. ఇల్లు ఖాళీ చేయాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధితురాలు విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించింది.

రైల్వే బొగ్గులైన్ క్వార్టర్స్‌లో బత్తుల ఎస్తేరు రాణి (55) నివాసం ఉంటోంది. ఆమె భర్త చిన్నారావు విధి నిర్వహణలో చనిపోవటంతో ఆమెకు రైల్వే అధికారులు ఉద్యోగం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె రైల్వే గ్యాంగ్ ఉమన్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఒక కుమారుడు. అతను వివాహం చేసుకుని వేరే ప్రాంతంలో ఉంటున్నాడు. ఆమె ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ఉంటోంది. భర్త చనిపోయిన తరువాత వచ్చిన డబ్బుతో ఆమె ఈ ఏడాది అయిదో నెలలో 60వ డివిజన్ సింగ్‌నగర్ వాంబేకాలనీ, గాంధీబొమ్మ సెంటర్ వద్ద 42 గజాల డాబాను రవితేజ వద్ద కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆమె తన ఇంటిని ఒక కుటుంబానికి అద్దెకు ఇచ్చింది. ఎస్తేరు రాణి కొనుగోలు చేసిన ఇల్లు తనదేనని, ఖాళీ చేయాలని అద్దెకున్న వారికి చెప్పడంతో పాటు ఎస్తేరు రాణికి శ్రీనివాసరెడ్డి ఫోన్ చేసి వేధిస్తున్నాడు. నున్న పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి గుడివాడలోని స్టాంపు వెండర్ వద్ద పాత స్టాంపు పేపర్ కొనుగోలు చేసి ఆ ఇల్లును కొనుగోలు చేసినట్లు అక్రమంగా పత్రాలు సృష్టించాడు. ఆ పత్రాలతో ఆ ఇల్లు తనదేనంటూ ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇల్లు ఖాళీ చేయకపోతే బలవంతంగా ఖాళీ చేయిస్తానని బాధితురాలిని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేయాలని నున్న పోలీసులకు ఆదేశించారు. వైసీపీ నాయకుడు పోలీసులపై కూడా ఒత్తిడి చేస్తూ బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించటానికి ప్రయత్నిస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి వైసీపీ ప్రభుత్వ హయాంలో 60వ డివిజన్ పరిధిలో ఎక్సెల్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్ల పక్కన ఖాళీగా ఉన్న నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలం కబ్జా చేసి దుకాణం ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చాడు. ప్రభుత్వం మారిపోవటంతో ఇటీవల దుకాణాన్ని తొలగించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- ప్రకృతి సంరక్షణ చాలా అవసరం
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్



విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ మంచి నగరమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్ వ్యాఖ్యానించారు. బబ్బూరి గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన మహా సత్సంగ్‌లో పలువురి ప్రశ్నలకు ఆయన చాలా వేగంగా జవాబులు ఇచ్చారు. దీనితోపాటు నగరంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భిన్నత్వంలో ఏకత్వం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పాల్గొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మైనారిటీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూక్ షుబ్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలా ఏర్పడింది?

జవాబు : సీజేఐలుగా పని చేసిన భగవతి, వీఆర్ కృష్ణయ్య, ఫాదర్ ఆఫ్ బెంగళూరు సిటీ డాక్టర్ లక్ష్మణరావు, శాస్త్రి ముఖ్యకారకులు. వారిలో కృష్ణయ్య హేతువాది. భగవతి విశ్వాసకుడు.

ప్రశ్న: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా మార్పును ఎలా తీసురాగలుగుతున్నారు?

జవాబు : అందరూ నా వాళ్లే అనుకుంటూ కృషి చేస్తున్నాను. తద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలుగుతున్నా

ప్రశ్న: ఇటీవల వచ్చిన వరదలకు ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఎలా ఎదుర్కోవాలి?

జవాబు : ఆత్మవిశ్వాసంతో అన్ని కష్టాలను జయించవచ్చు. ప్రతి మనిషిలో ధైర్యం, దైవంపై విశ్వాసం ఉండాలి. ప్రకృతి వైపరీత్యాలు రావడం సాధారణం. ప్రకృతి సంరక్షణ చాలా అవసరం. చెరువులు, నదులు, కాల్వలు, వృక్షసంపదను పరిరక్షించుకోవాలి. నగరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇది మన బాధ్యతగా గుర్తించుకోవాలి.

ప్రశ్న: మనుషులు ఎందుకు స్వచ్ఛంగా ఉండలేకపోతున్నారు?

జవాబు : ప్రతి ఒక్కరూ పుట్టుకతో మంచివారు. మనది నిత్యశుద్ధిబుద్ధి స్వభావం. అన్నింటినీ కనుక్కోవాలి. అదే ఆత్మశుద్ధి. ఒత్తిడి, టెన్షన్ తగ్గితే మానవత్వం బయటకు వస్తుంది.

ప్రశ్న: గురువు ఆవశ్యకత ఏమిటి?

జవాబు : ప్రతి మనిషికి ప్రథమ గురువు తల్లి. తర్వాత గురువు ఆచార్యుడు. ప్రశ్నలకు జవాబులు తెలియాలంటే గురువులు ఉండాలి. గురువు అంటే ధైర్యాన్ని ఇచ్చేవాడు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ గురువు పాత్రను పోషించాలి.

ప్రశ్న: చెడు కర్మల నుంచి ఎలా బయట పడాలి?

జవాబు : జీవితంలో గానం, ధ్యానం, జ్ఞానం ఉంటే చెడు కర్మలు తొలగిపోతాయి.

ప్రశ్న: పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఉండాలంటే?

జవాబు : రెండు రోజులపాటు సెల్‌ఫోన్లకు చార్జింగ్ పెట్టకండి. తర్వాత పిల్లలు ఆ వ్యసనం నుంచి బయటకు వచ్చేస్తారు.

ప్రశ్న: పెద్దలు చెప్పిన మాటలు విద్యార్థులకు అర్థం కావడం లేదు. ఏం చేయాలి?

జవాబు: దీనికోసమే ఆర్ట్ ఆఫ్ లివింగ్ నో యువర్ టీన్స్ అనే కోర్సును డిజైన్ చేసింది. రెండు రోజులు రెండు గంటలపాటు ఈ కోర్సులో ఉంటే అన్ని బోధపడతాయి. విద్యార్థులకు సహనం ఉండాలి. ధ్యానం చేయాలి. మెంటల్ హెల్త్‌కు అటెన్షన్ ఇవ్వాలి. వ్యాయామం, ధ్యానం చేసి విశ్రాంతి తీసుకుంటే అన్ని విషయాలు తలకెక్కుతాయి.

ప్రశ్న: యువత డ్రగ్స్‌కు ఎందుకు బానిసలవుతున్నారు?

జవాబు : యువత కొత్త అనుభూతిని కోరుకుంటున్నారు. పంచేంద్రియాల్లో గొప్ప అనుభూతి కోసం చూస్తున్నారు. దీని కోసం కొత్త అలవాట్లు చేసుకుంటున్నారు. కొంతమంది మద్యం తాగుతున్నారు. మరికొంతమంది డ్రగ్స్ తీసుకుంటున్నారు. వాటిల్లో ఏదో అనుభూతి ఉందనుకుంటున్నారు. అందుకే వాటికి అలవాటు పడుతున్నారు. ఇలా బానిసలైన వారిని సుదర్శనక్రియ ద్వారా బయటకు తీసుకురావచ్చు. ప్రపంచంలో ఎంతోమంది ఇలా బయటకు వచ్చారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారిలో విశ్వాసం కలిగించాలి. ప్రేమ అనేది ఒక వైబ్రేషన్. సంసారం ఇదే కోవకు వస్తుంది.

- మీకు నచ్చిన వ్యక్తి.. ప్రతి ఒక్కరూ ఇష్టమే
- మీకు నచ్చిన దేశం... మనిషి అంతర్గతంగా ఉండే దేశం
- చిరునవ్వుకు కారణం.. ఆర్ట్ ఆఫ్ లివింగ్
- ఫోన్ నంబర్.. కళ్లు మూసుకుని ధ్యానం చేస్తే కనెక్ట్ అవుతా
- ఆధ్యాత్మికత.. అందరికీ అవసరం
- వాట్సాప్..ఉన్నత స్థాయికి వెళ్లడానికి (వాట్ ఈజ్ అప్) అవసరమైనది
- విజయవాడ..మంచినగరం
- ఆయుర్వేదం... మెడిసిన్ ఆఫ్ కరెంట్ సెంచరీ
- రాజకీయాలు.. ప్రజలు ఉన్న చోట రాజకీయం.
- టీచర్స్ అండ్ వలంటీర్స్ .. గిఫ్ట్ ఆఫ్ ది సొసైటీ

గంగరాజు, షుబ్లీకి సత్కారం

బబ్బూ రి గ్రౌండ్స్‌లో జరిగిన సత్సంగ్‌లో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీని రవిశంకర్ సత్కరించారు. గంగరాజు 80వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు గురూజీ ఆశీస్సులు అందజేశారు. సర్వమత సమ్మేళనంలో భాగంగా ఫారూక్ షుబ్లీని వేదిక పైకి ఆహ్వానించి సత్కరించారు.



మాజీ ఎంపీ గంగరాజు, మైనార్టీ నేత షుబ్లీని సత్కరిస్తున్న రవిశంకర్

షరీఫ్‌కు సన్మానం

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా నియమితులైన శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో షరీఫ్‌ను ఏవీ రమణ, డి.నరేంద్రబాబు, రవియాదవ్, శంకర్‌నాయుడు, కట్టా జనార్దన్, రాజశేఖర్, సత్యవాణి తదితరులు శాలువాలతో సన్మానించారు.

ఫైబర్‌నెట్ చైర్మన్‌గా జీవీ రెడ్డి ప్రమాణ స్వీకారం రేపు

ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్‌గా నియమితులైన జీవీ రెడ్డి ఈనెల 15న పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని మూ డో అంతస్తులోని ఏపీఎస్ఎఫ్ఎల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని జీవీ రెడ్డి తెలిపారు.

సీఎంతో బ్రిటీష్ హైకమిషనర్ భేటీ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ హైకమిషనర్ లిండే కెమెరాన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును అసెంబ్లీలోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇండియా-యూకే భాగస్వామ్యంపై చర్చించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. ఆమెను కలవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

క్రీడారంగానికి పూర్వ వైభవం

- క్రీడా అకాడమీలు, ప్రతి గ్రామంలో ఆటస్థలం స్పోర్ట్సు విలేజ్‌లు సిద్ధం
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఇంటర్వ్యూ



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి నూతన క్రీడా పాలసీతో ముందుకెళ్తున్నామని, మట్టిలో ఉన్న మాణిక్యాలకు సానపెట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తామని శాప్ చైర్మన్ అనివిని రవినాయుడు తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ..

? క్రీడల అభివృద్ధికి మీ ప్రణాళిక

శాప్ చైర్మన్ : రాష్ట్రంలో 2027 నాటికి కుగ్రామం నుంచి ప్రతి టౌన్ వరకు ఆట స్థలాలు అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగుతాం. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తా. క్రీడా వికాస కేంద్రాలు, ఇండోర్ స్టేడియం నిర్మాణాలను పూర్తి చేస్తాం.

? ప్రభుత్వం నుంచి ఆర్థిక తోడ్పాటు లేకుండా క్రీడల అభివృద్ధి ఎలా

శాప్ చైర్మన్ : అసోసియేషన్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను రాష్ట్ర క్రీడాభివృద్ధిలో భాగం చేస్తా. ప్రతి పనిలో భాగస్వామ్యం చేసి నిధుల సమీకరణ చర్యలు తీసుకుంటా. వారి పరిధిలోనే వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేస్తాం. ఎమ్మెల్యే నిధుల్లో 20 శాతం క్రీడలకు కేటాయించాలని కోరతా.

? కోచ్‌ల ఖాళీలను ఎలా భర్తీ చేస్తారు.

శాప్ చైర్మన్ : కోచ్‌ల నియామం పెద్ద సమస్య. వచ్చే ఏడాది మార్చి తర్వాత కోచ్‌ల భర్తీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటా. ప్రతిభ, సీనియార్టీ ఆధారంగా కోచ్‌ల వేతనం కొంత పెంచే యోచన ఉంది.

? శాప్ పాలకవర్గాన్ని ఎప్పుడు ప్రకటిస్తారు

శాప్ చైర్మన్ : అతి తొందరలోనే పాలకవర్గం ప్రకటిస్తాం. గతంలో ఎంతమంది సంఖ్య ఉందో దానికి లోబడే భర్తీ చేస్తాం.

? శాప్, పీపీపీ మోడ్‌తో అకాడమీల ప్రారంభించే యోచన ఉందా


శాప్ చైర్మన్ : పారిశ్రామిక వేత్తలు, ఎస్ఆర్ఐలను కలుపుకుని పీపీపీ (పబ్లిక్, ప్రవేట్, పార్టనర్‌షిప్)తో అకాడమీలు, మల్టీపర్పస్ ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను నిర్మిస్తాం. పారిశ్రామిక రంగాల నుంచి సీఎస్ఆర్ ఫండ్స్‌ను సమీకరిస్తాం.

?జాతీయ క్రీడల ఆతిథ్యానికి సిద్ధం యాక్షన్ ప్లాన్ ఏమిటీ

శాప్ చైర్మన్ : రాష్ట్రంలో 2026-27లో జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా సీఎం చంద్రబాబు దృఢ సంకల్పంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు. మంగళగిరి, తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం, కర్నూలలో స్పోర్ట్సు విలేజ్‌ల నిర్మాణానికి రంగం సిద్ధం అవుతోంది. తిరుపతిలో కలెక్టర్ స్థలం కేటాయించారు. గుంటూరులో మంత్రి లోకేష్ చూస్తున్నారు. రాజమహేంద్రవరంలో పురందేశ్వరి ద్వారా తగు చర్యలు తీసుకుంటున్నాం.

? ఫేక్ క్రీడా సర్టిఫికెట్ల జారీని ఎలా అడ్డుకుంటారు

శాప్ చైర్మన్ : నకిలీ సర్టిఫికెట్లతో క్రీడాకారులను నడిపించే అసోసియేషన్ల ఆట కటిస్తాం. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. ఉద్యోగాల విషయాల్లో క్రీడాకారులకు అన్యాయం జరగకుండా ఉండేందుకు క్రీడాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు దీనిపై చర్చించారు. క్రీడా సర్టిఫికెట్ల జారీపై నిరంతరం నిఘా కోసం యాప్‌ను రూపొందిస్తున్నాం. ఆధార్, క్రీడా ట్రాక్ రికార్డులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.



సభ రోజులు తగ్గిపోతున్నాయి

15 రోజులకు మించడం లేదు

మీడియాతో ఎమ్మెల్యే కూన

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో ఏటా సగటున దాదాపు 45 రోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగేవని, ఇప్పుడు సభ నిర్వహణ సమయం గణనీయంగా తగ్గిపోతోందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. విభజన తర్వాత సగటున 13 నుంచి 15 రోజులు మాత్రమే సమావేశాలు జరుగుతున్నాయన్నారు. టీడీఎల్పీలో బుధవారం మీడియాతో ఆయన ముచ్చటించారు. ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు 30 రోజుల పాటు జరిగేవన్నారు.



టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రులు సత్యకుమార్, మనోహర్, లోకేశ్, అచ్చెన్న, కేశవ్‌ల సమక్షంలో డిప్యూటీ స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న రఘురామరాజు

ఉప సభాపతిగా రఘురామ ఏకగ్రీవం

- గడువులోగా ఒకటే నామినేషన్ దాఖలు
- నామినేషన్ పత్రాలపై డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంతకాలు
- నేడు సభలో ప్రకటించనున్న స్పీకర్ అయ్యన్న

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి పదవికి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సభాపతి పదవికి కూటమి అభ్యర్థిగా ఆయన పేరును మంగళవారం రాత్రి సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. బుధవారం ఉదయం అసెంబ్లీ సెక్రటరీ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ పదవికి రఘురామ పేరును ప్రతిపాదిస్తూ టీడీపీ తరఫున మంత్రి లోకేశ్, జనసేన తరఫున డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ తరఫున విష్ణుకుమార్ రాజు సంతకాలు చేశారు. ఈ కాపీలతో కూడిన మూడు సెట్ల నామినేషన్ పత్రాలను అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవరకు సాయంత్రం 4.30 గంటలకు రఘురామకృష్ణరాజు అందించారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు ముగిసేలోగా.. రఘురామ తప్ప మరెవ్వరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఉప సభాపతి ఏకగ్రీవ ఎన్నికను గురువారం శాసనసభలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించే అవకాశం ఉంది.

అసెంబ్లీలో ఆర్ఆర్ఆర్ సందడి..

ఉప సభాపతిగా తన పేరు ఖరారు కావడంతో రఘురామకృష్ణరాజు బుధవారం అసెంబ్లీలో సందడి చేశారు. ఆయనకు కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా అభినందనలు తెలిపారు. ఉపసభాపతికి అసెంబ్లీ అధికారులు కేటాయించిన చాంబర్‌ను స్వయంగా రఘురామకృష్ణరాజు పరిశీలించి చిన్న చిన్న మార్పులు సూచించారు. గురువారం మధ్యాహ్నం 2.39 గంటలకు డిప్యూటీ స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తానని తెలిపారు.

సభలో మూడు సవరణ బిల్లులు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాసనసభలో బుధవారం మూడు సవరణ బిల్లులు ప్రవేశపెట్టారు. ఏపీ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, ఏపీ మున్సిపల్ శాసనాల సవరణ బిల్లులను మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రవేశపెట్టారు. ఏపీ ఉద్యోగుల పదవీ విరమణ రెగ్యులరైజేషన్ సవరణ బిల్లును ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం వీటికి ఆమోదం లభిస్తుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ నిధులు పక్కదారి



ఐదేళ్లలో 1.02 లక్షల కోట్లు దారి మళ్లింపు

- ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించారు: ఎమ్మెల్యే కూన
- అధ్యయనం చేసి ఉచిత బస్సును అమలు చేయాలి: ఎమ్మెల్యే ఈశ్వరరావు
- గంజాయికి ఏపీని అడ్డాగా మార్చిన జగన్: ఆదిరెడ్డి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్ల జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పచ్చటి రాష్ట్రాన్ని జగన్‌కు అప్పగిస్తే, ఆయన గంజాకు అడ్డగా ఏపీని మార్చారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను సొంత జేబు సంస్థలా వాడుకుని ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసేశారు. పరిమితికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు' అని కూటమి ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా మండిపడ్డారు. బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా బుధవారం శాసనసభలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, 'వార్షిక బడ్జెట్ వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఊపిరి పోసింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది. గత ప్రభుత్వంలో సంక్షేమం అంటూనే ఎస్సీ, ఎస్టీల నిధులు రూ.26 వేల కోట్లు, బీసీల నిధులు రూ.76 వేల కోట్లు... మొత్తంగా రూ.1.02 లక్షల కోట్లను దారి మళ్లించారు. ప్రతి స్కీంను జగన్ స్కాంగా మార్చుకుని దోపిడీ చేశారు. చివరికి పాఠశాలల్లో చేసిన నాడు- నేడు పనుల్లో ఫ్యాన్లు, రంగులు కూడా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో కొనుగోలు చేశారు. వాటిని ఎవరి నుంచి కొనాలో జగనే నిర్ణయించారు. జీవో 117ను తీసుకొచ్చి పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు మూతపడేలా చేశారు' అని రవికుమార్ విమర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన జగన్... గంజాకు ఏపీకి అడ్డాగా మార్చాడు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో అనేక మంది మాదకద్రవ్యాలకు అలవాటుపడి పోయారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, 'జగన్‌రెడ్డి తన పాలనలో బటన్ నొక్కేపేరిట సకల వర్గాలను మోసం చేశారు. దళిత, గిరిజన వర్గాలకు ఆయన చేసిన మేలు ఏమీలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా, అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి ప్రజల ప్రాణాలు, పంటలు పోయినా జగన్ పెద్దగా స్పందించలేదు' అని విమర్శించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు మాట్లాడుతూ... 'తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో ఉచిత బస్సు విధానం అమలులో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిపై అధ్యయనం చేసి, ఏపీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అమలు చేయాలి' అని కోరారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా దాదాపు రూ.లక్ష కోట్లకు పైగా బకాయిలు పెట్టేశారు. యూసీలు సమర్పించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి' అని తెలిపారు. మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ 'నాడు-నేడు' పేరుతో గత వైసీపీ ప్రజాప్రతినిధులు రూ. కోట్లలో దోచేశారని ఆరోపించారు.

నన్నయ వర్సిటీలో అక్రమాలపై విచారణ జరిపించాలి: రాజానగరం ఎమ్మెల్యే

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ (జనసేన) మాట్లాడుతూ... 'నన్నయ యూనివర్సిటీలో గత ప్రభుత్వం వైసీపీ ఎమ్మెల్యేల బంధువులను వీసీలుగా, ఈసీ సభ్యులుగా, ఉద్యోగులుగా నియమించుకుని యూనివర్సిటీని భ్రష్టు పట్టించింది. యూనివర్సిటీలోఅక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలి' అని కోరారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ, జగన్ రాజకీయ కుట్రలు చేసి వాల్మీకి బోయల భవిష్యత్తును నాశనం చేశారని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఉండి శాసనసభ్యుడు రఘురామకృష్ణరాజు, నరసన్నపేట ఎమ్మెల్యే బి.రమణమూర్తి, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేథామస్, నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, గురజాల ఎమ్మెల్యే జగన్‌మోహన్, ఎమ్మిగనూరు, పూతలపట్టు, ఎలమంచిలి ఎమ్మెల్యేలు నాగేశ్వరరెడ్డి, మురళి, సుందరపు విజయ్‌కుమార్ సభలో మాట్లాడారు.

మా సమస్యలు పరిష్కరించండి

జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాసనసభ జీరో అవర్‌లో పలువురు ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను లేవనెత్తారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు... కొవ్వూరులోని ఏరియా ఆసుపత్రిని 100 పడకలఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. 'లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. వాటికి నిధులు కేటాయించి మరమ్మతులు చేయించాలి' అని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. అత్తిలిలో శిథిలావస్థలోని జూనియర్ కాలేజీ పునర్నిర్మాణం చేపట్టాలని తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఇంకా...గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్యే కూన రవి కుమార్ పలు సమస్యలు లేవనెత్తారు.

మనమే ప్రతిపక్షం..

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ గౌరవమర్యాదలు నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ ఉండాలి. ముఖ్యంగా ఆ బాధ్యత చీఫ్ విప్, విప్‌లపై ఎక్కువగా ఉంది. అందరం కలిసి టీమ్ వర్క్ చేద్దాం. అందుకే ప్రతి పదిమంది ఎమ్మెల్యేలకు ఒక విప్‌ను కేటాయించాం. ప్రతిపక్ష పార్టీకి బాధ్యత లేదు. కాబట్టి ఆ పార్టీ పాత్ర కూడా మనమే పోషించాలి. నియోజకవర్గాల్లో ప్రజలకు దగ్గరగా ఉండాలి" అని చంద్రబాబు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన శాఖలో అద్భుతంగా పని చేస్తున్నారని సీఎం కొనియాడారు. ఒకే కుటుంబంగా కలిసి ఉండి సుపరిపాలన అందిద్దామన్నారు. ప్రజా సమస్యలపై చర్చించడంతోపాటు వాటికి పరిష్కారాలు కూడా సభలో సూచించాలని కోరారు. ఆ మేరకు ఎమ్మెల్యేలను చీఫ్ విప్, విప్‌లు సిద్ధం చేయాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే, విప్ ఆదినారాయణ రెడ్డి.... వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు చేసిన అరాచకాలను సీఎంకు వివరించారు. చంద్రబాబు కల్పించుకుని...రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, దానిని సరిచేసే పనిలోనే ఉన్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పాలన చేస్తుందని, ఎమ్మెల్యేలంతా ప్రజలకు దగ్గరగా ఉండాలని చంద్రబాబు సూచించారు. అనంతరం వారిని అభినందించారు.

లోకేశ్‌ను కలిసిన చీఫ్ విప్, విప్‌లు

బుధవారం అసెంబ్లీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్‌ను చీఫ్ విప్, విప్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు. ఉభయసభల్లో సంధించాల్సిన ప్రశ్నలతోపాటు విప్‌లు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సభలో మంత్రులు కూడా ప్రశ్నించాలని ఆయన సూచించారు. ప్రతిపక్షం లేకపోయినా అర్థవంతమైన చర్చ జరగాలని లోకేశ్ ఆకాంక్షించారు. రెండు, మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలోని ఎమ్మెల్యేలకు ఒక విప్ చొప్పున కేటాయించి.. సమన్వయం చేసుకోవాలని సూచించారు.

చీఫ్ విప్‌లకు కేబినెట్ హోదా

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్, ప్రభుత్వ విప్‌లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌లకు కేబినెట్ మంత్రి హోదాను, ప్రభుత్వ విప్‌లకు సహాయ మంత్రి హోదాను కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) కార్యదర్శి వినయ్ చంద్ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులైన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం అసెంబ్లీలో సీఎం చంద్రబాబును సతీసమేతంగా కలిశారు. చీఫ్ విప్ పదవి ఇచ్చినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని సీఎంతో చెప్పారు.

డయేరియాపై వాగ్యుద్ధం

మీ పర్యవేక్షణ లోపమే కారణం

- 15 ఏళ్లుగా రానిది ఇప్పుడెందుకు వచ్చింది?
- మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వండి: బొత్స
- ఐదేళ్లలో వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేశారా?
- గతంలో ఎప్పుడైనా పరిహారం ఇచ్చారా?: సత్యకుమార్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చైర్మన్ మోషేన్‌రాజు అధ్యక్షతన బుధవారంఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. విద్యుత్ చార్జీల అంశంపై వైసీపీ సభ్యులు, ఉద్యోగుల సమస్యలపై పీడీఎఫ్ సభ్యులు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలను చైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. అనంతరం ప్రశ్నోత్తరాలు ప్రారంభమయ్యాయి. పలు ప్రశ్నల సందర్భంగా టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. విజయనగరం జిల్లా గుర్లలో ఇటీవల అతిసారం ప్రబలి పలువురు మృతి చెందిన ఘటనపై మండలిలో సుదీర్ఘ చర్చ జరిగింది. వైసీపీ పాలనలో 10 లక్షల 35 వేల అతిసార కేసులు నమోదయ్యాయని ఏ ఒక్కరినీ జగన్ పరామర్శించలేదని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పట్టించుకోకపోవడం, తాగునీటి పైపుల లీకులు, పైపులైన్ల నిర్వహణ చేయలేదన్నారు. కలుషిత నీరు, చంపా నదిలో బహిరంగ మలవిసర్జన వల్లే అతిసారం ప్రబలిందన్నారు. కలరా కేసులు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలే దీనికి కారణమన్నారు. ఘటన జరిగిన వెంటనే కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుందన్నారు. గుర్ల మండలంలో నలుగురు, రాష్ట్రంలో మొత్తం 18 మంది మరణించారని చెప్పారు. జగన్ ట్వీట్ వల్లే ప్రభుత్వం స్పందించిందని వైసీపీ సభ్యులు అనడం సరికాదన్నారు. 13వ తేదీన సంఘటన జరిగితే జగన్ 19న స్పందించారన్నారు. మంత్రి సత్యకుమార్ మాటలను విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యవేక్షణ లోపం వల్లే అతిసారం ప్రబలిందన్నారు. అతిసారంతో మృతి చెందిన వారందరికీ ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాను పదిహేనేళ్లు ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించానని, ఎప్పుడూ రాని డయేరియా ఈ నాలుగు నెలల్లో ఎందుకు వచ్చిందని బొత్స ప్రశ్నించారు. పర్యవేక్షణా లోపమే కారణమని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, మృతుల విషయంలో ప్రభుత్వంలో స్పష్టత లేదని బొత్స చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు దీటుగా సమాధానం చెప్పారు. గత ఐదేళ్లలో ఎప్పుడైనా వాటర్ ట్యాంకుల్లో పిడికెడు బ్లీచింగ్ వేశారా? అని ప్రశ్నించారు. మృతులకు పరిహారం ఇచ్చే అంశాన్ని కూటమి ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. గుర్ల ప్రాంతానికి ఇన్నాళ్లు ప్రాతినిధ్యం వహించానని చెబుతున్నందున తన వల్ల కూడా ఇది జరిగిందని బొత్స సత్యనారాయణ ఒప్పుకోవాలని మంత్రి అన్నారు. దీంతో గుర్లపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు.

గత ఐదేళ్లూ బీమా ప్రీమియం కట్టలేదు: అచ్చెన్న

పంట రుణాలపై అధిక వడ్డీ అంశంపై శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా అని చెప్పి రైతులను మోసం చేసిందని, రబీకి బీమా కట్టలేదని విమర్శించారు. ఖరీఫ్‌లో కూడా కొంతమంది రైతులకు పరిహారం చెల్లించలేదన్నారు. ఐదేళ్లలో ఎక్కడా భూసార పరీక్షలు నిర్వహించలేదన్నారు. 2022-23 రబీ కోసం ఏఎంఎఫ్‌బీవై ఉచిత బీమా పథకం కింద ప్రీమియం రూ.644 కోట్లు గత ప్రభుత్వం బీమా కంపెనీలకు చెల్లించలేదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీమా కంపెనీలకు ప్రీమియం మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు.

అమరావతికి ఇచ్చింది గ్రాంటా.. లోనా? : పీడీఎఫ్

కూటమి ప్రభుత్వం వచ్చాక బియ్యం అక్రమ రవాణాపై 1010 కేసులు నమోదు చేసి, 60 వేల టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 2019-24 మధ్య కాలంలో అసైన్డ్ భూముల ఉచిత కమతాల పథకం కింద 9,93,285 ఎకరాలను క్రమబద్ధీకరించారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసనమండలిలో తెలిపారు. వైసీపీ పెద్దలు ఎన్నికల ముందు చట్టం చేసి పేదల భూములను దోచుకున్నారని ఆరోపించారు. కాగా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. సంక్షేమం, అభివృద్ధిల కలబోత అని శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కూటమి సభ్యులు అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ..అమరావతి నిర్మాణానికి ఇస్తున్న రూ.15,000 కోట్లు గ్రాంటా..లోనా? స్పష్టత ఇవ్వాలన్నారు. కేంద్రం రుణం తీసుకుని అమరావతి అభివృద్ధికి గ్రాంట్‌గా ఇస్తున్నదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. బడ్జెట్‌పై చర్చ అనంతరం చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సభను వాయిదా వేశారు.

శిక్షణ లేకుండా పోలీసింగ్ సాధ్యమా?

మహిళా సంరక్షణ కార్యదర్శులను పోలీస్ శాఖలో విలీనం తుగ్లక్ చర్య: మంత్రి అనిత

- డీఎస్సీ నియామకాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది: మంత్రి లోకేశ్
- ప్రశ్నలు, సమాధానాలు క్లుప్తంగా ఉండాలి: స్పీకర్ అయ్యన్న
- అసెంబ్లీ క్వశ్చన్ అవర్‌లో మంత్రులపై ప్రశ్నలు సంధించిన ఎమ్మెల్యేలు



అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో అధికార పక్షమే ప్రతిపక్షమయింది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలు ప్రజా సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులు వేసిన ప్రశ్నలకు మంత్రులు స్పందించారు. మహిళా పోలీసుల సమస్యపై ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, గౌరు చరిత, మాధవీ రెడ్డి, కూన రవి కుమార్ తదితరులు మాట్లాడుతూ... "రాష్ట్రంలో 15,000 మంది మహిళా సంరక్షణ కార్యదర్శులను వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా పోలీసు శాఖలోకి మార్చింది. వారితో బలవంతంగా యూనిఫామ్ వేయించి క్షోభకు గురి చేసింది. పోలీసు నియామకాలు, శిక్షణ, విధి నిర్వహణలో జాబ్ చార్ట్ ఏంటో హోం మంత్రి వివరించాలి. పోలీసు శాఖలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించిన వారికి ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేస్తుందో చెప్పాలి' అని అడిగారు. దీనిపై హోం మంత్రి అనిత స్పందిస్తూ... 'శాంతి భద్రతల్ని పరిరక్షించే పోలీసుల ఎంపికలో దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయి. ఎంపికైన వారికి కఠిన శిక్షణ ఉంటుంది. కనీస ఫిట్నెస్‌లేని వారిని తీసుకొచ్చి పోలీసు శాఖలో విలీనం చేసిన జగన్ ఈ తరం తుగ్లక్. మహిళా శిశు సంక్షేమ శాఖలో మహిళా సంరక్షణ కార్యదర్శులుగా నియమితులైన వారిని పోలీసు శాఖలో విలీనం చేయడం సరికాదు' అని అన్నారు.

● చింతలపూడి రెండేళ్లలో పూర్తి చేస్తాం: నిమ్మల

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 10 నియోజకవర్గాల్లో సాగు, తాగు నీటి సమస్య తరచూ ఇబ్బంది పెడుతోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. 'చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఈ ఏడాది ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేస్తాం.' అని తెలిపారు. .

● విశాఖ మెట్రో ప్రతిపాదనలు సిద్ధం: నారాయణ

కేంద్ర ప్రభుత్వానికి పంపి విశాఖవాసుల మెట్రో కల సాకారం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంది' అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. గాజువాక, అనకాపల్లి ఎమ్మెల్యేలు పల్లా శ్రీను, కొణతాల రామకృష్ణ తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి పై వివరణ ఇచ్చారు.

● వైసీపీ నిర్లక్ష్యం... గిరి వర్సిటీకి శాపం: లోకేశ్

మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, 'డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు.' అని అన్నారు. గిరిజనుల సమస్యలపై మిరియాల శిరీషా దేవి, కోళ్ల లలిత కుమారి, గౌతు శిరీష, తోయక జగదీశ్వరి, వరుపుల సత్యప్రభ, అదితీ గజపతిరాజు తదితరులు మాట్లాడారు. మన్యంలో డోలీల మోత ఆగేదెన్నడు? అంటూ ప్రశ్నించారు. దీనిపై మంత్రిసుధారాణి స్పందిస్తూ...'గిరిజన ప్రాంతాల్లో చంద్రబాబు హయాంలో కాఫీతోటలు సాగైతే, జగన్ గంజాయిసాగు చేయించారు.' అని అన్నారు. .

● అదితి ప్రశ్న... లోకేశ్ సమాధానం... భేష్: స్పీకర్ అయ్యన్న

ప్రశ్నోత్తరాల ముగింపులో సభాపతి అయ్యన్న మాట్లాడుతూ, 'సభ్యుల సుదీర్ఘ ప్రసంగాలతో సమయం వృథా అవుతోంది. సభ్యులు క్లుప్తంగా సమస్యలు సభ దృష్టికి తీసుకొస్తే అంతే క్లుప్తంగా మంత్రులు సమాధానం ఇవ్వాలి. ఈ రోజు (బుధవారం) ప్రశ్నోత్తరాల్లో విజయనగరం ఎమ్మెల్యే అదితీ గజపతిరాజు చాలా క్లుప్తంగా సమస్యను సభ దృష్టికి తెచ్చారు. మంత్రుల్లో నారా లోకేశ్ చెప్పాల్సిన సమాధానం సూటిగా చెప్పారు' అని సభాపతి ప్రశంసించారు.

ఏ అర్హతతో ప్రతిపక్ష హోదా అడుగుతారు?

- అయ్యన్న, రఘురామ ఉంటారనే జగన్ సభకు రావట్లేదు: హోంమంత్రి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి, మాట్లాడే అవకాశం ఉన్నా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇంట్లో కూర్చొని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి అనిత మాట్లాడుతూ ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటున్న జగన్..ఏ అర్హతతో హోదా అడుగుతున్నారని ప్రశ్నించారు. జగన్ అసెంబ్లీకి రాడని రూ.11 పందేలు కాస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని చెప్పారు. 'స్పీకర్‌గా అయ్యన్న, డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు ఉంటారనే జగన్ అసెంబ్లీకి రావట్లేదు. జగన్ అసెంబ్లీకి వస్తే.. మాట్లాడే అవకాశం వచ్చేది. తప్పుడు పోస్టులు పెట్టి, మహిళల వ్యక్తిత్వ హననం చేస్తున్న వారికి నోటీసులిచ్చి, అరెస్ట్ చేస్తున్నాం. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ఏపీలో రాజ్యాంగం అమలు కావట్లేదని వైసీపీ సీనియర్ నేతలు మానవ హక్కుల సంఘానికి వెళ్లడం ఆశ్చర్యంగా ఉంది. తప్పు చేసిన వారిపై చర్య తీసుకుంటే తప్పా? రాజకీయ ముసుగులో ఉన్మాదంగా ప్రవర్తిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? ఆర్గనైజింగ్ క్రైమ్‌కు వర్రా రవీంద్రరెడ్డి వాంగ్మూలమే ఉదాహరణ. సభ్యసమాజం సిగ్గుపడేలా పోస్టులు పెట్టిన వారికి వైవీ సుబ్బారెడ్డి లాంటివాళ్లు వంత పాడటం సిగ్గుచేటు. ఆడబిడ్డల మర్యాదకు భంగం కలిగించినా.. అవమానపర్చినా చూస్తూ ఊరుకునేది లేదు' అని అనిత హెచ్చరించారు.

ఈనెల 19 నుంచి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.102-108

ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 19న ప్రారంభమై 22న ముగియనుంది. ఐపీఓ షేర్ల విక్రయ ధర శ్రేణిని కంపెనీ రూ.102-108గా నిర్ణయించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ తాజా ఈక్విటీల జారీ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. ఆసక్తి గల వారు కనీసం 138 షేర్ల బిడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత బిడ్ సైజును 138 షేర్ల చొప్పున పెంచుకోవచ్చు. ఇష్యూ సైజులో 75 శాతం షేర్లు సంస్థాగత ఇన్వెస్టర్లకు, 15 శాతం సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు, 10 శాతం రిటైల్ మదుపరుల కోసం కేటాయించింది. అర్హులైన ఉద్యోగుల కోసం సంస్థ రూ.200 కోట్ల షేర్లను కేటాయించింది. వీరికి ఒక్కో షేరుకు రూ.5 డిస్కౌంట్ కల్పించింది. ఎన్‌టీపీసీ ప్రస్తుత షేర్ హోల్డర్లకు సైతం రూ.1,000 కోట్ల షేర్లను కేటాయించింది. ఈ ఏడాదిలో హ్యుండయ్ ఇండియా (రూ.27,870 కోట్లు), స్విగ్గీ (రూ.11,327 కోట్లు) తర్వాత మూడో అతిపెద్ద ఐపీఓ ఇదే.

2026-27 నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ గురుదీప్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం 3,220 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్న సంస్థ.. 2025 మార్చి నాటికి ఈ సామర్థ్యాన్ని 6,000 మెగావాట్లు, 2026 మార్చి నాటికి 11,000 మెగావాట్లు, 2027 మార్చికల్లా 19,000 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,850 ▼	70,450 ▼	1,01,000 ▲
ముంబై	75,260 ▲	68,940 ▲	89,750 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	593	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	105
కరీంనగర్	90	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	104
కర్నూలు	90	నెల్లూరు	104
విశాఖపట్నం	103	అనంతపురం	104
గోదావరి	109		

స్విగ్గీ లాభాల డెలివరీ

లిస్టింగ్ రోజున 17 శాతం పెరిగిన కంపెనీ షేరు

రూ.లక్ష కోట్లు దాటిన సంస్థ మార్కెట్ క్యాప్

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీతోపాటు క్విక్ కామర్స్ సేవలందిస్తున్న స్విగ్గీ లిస్టింగ్‌కు ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ మంచి స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.390తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 5.64 శాతం లాభంతో రూ.412 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది. ఆ తర్వాత మరింత పుంజుకొని ఒక దశలో 19.30 శాతం వృద్ధితో రూ.465.30 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి స్విగ్గీ షేరు 16.91 శాతం లాభంతో రూ.455.95 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.02 లక్షల కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన రూ.11,327 కోట్ల స్విగ్గీ ఐపీఓకు సైతం ఇష్యూ సైజుతో పోలిస్తే 3.59 రెట్ల స్పందన లభించింది. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సందర్భంగా స్విగ్గీకి తన ప్రత్యర్థి సంస్థ జొమాటో సీఈఓ దీపీందర్ గోయల్ శుభాభినందనలు తెలియజేశారు.



వచ్చే 3-5 ఏళ్లు బలమైన వృద్ధి: సీఈఓ శ్రీహర్ష

వచ్చే 3-5 ఏళ్లపాటు సంస్థ వ్యాపారం బలమైన వృద్ధిని నమోదు చేసుకోనుందని స్విగ్గీ సీఈఓ శ్రీహర్ష మాజేటి ధీమా వ్యక్తం చేశారు. అలాగే, తన క్విక్ కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్ నెట్‌వర్క్, సేవల పరిధి, గిడ్డంగులను మరింత విస్తరిస్తామని మార్కెట్ లిస్టింగ్ అనంతరం శ్రీహర్ష వెల్లడించారు. గడిచిన ఏడాది కాలంలో ఇన్‌స్టామార్ట్ ద్వారా ఆఫర్ చేస్తున్న ఉత్పత్తుల విభాగాలను రెట్టింపు చేసినట్లు ఆయన చెప్పారు.

మిలియనీర్లుగా 70 మంది ఉద్యోగులు

స్విగ్గీ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌తో కంపెనీకి చెందిన 500 మంది ఉద్యోగులు కోటీశ్వరులుగా అవతరించగా.. అందులో 70 మంది మిలియనీర్లుగా (10 లక్షల డాలర్లు= రూ.8.4 కోట్లు) మారారు. సంస్థకు చెందిన 5,000 మంది ఉద్యోగులకు మొత్తం రూ.9,000 కోట్ల సంపద సమకూరింది. గతంలో స్విగ్గీ వీరికి ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్స్ (ఈసాప్స్) కింద షేర్లను కేటాయించింది. ఈసాప్స్ షేర్ల తాజా విలువ కంపెనీ సిబ్బందిని కోటీశ్వరులు, లక్షాధికారులను చేసింది.

4 నెలల కనిష్ఠానికి మార్కెట్

సెన్సెక్స్ 984 పాయింట్లు డౌన్.. 23,500 స్థాయికి జారిన నిఫ్టీ.. 2రోజుల్లో 13 లక్షల కోట్ల నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ కుప్పకూలాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 78,000 స్థాయిని కోల్పోగా.. నిఫ్టీ 23,500 స్థాయికి జారుకుంది. ధరల సూచీ 14 నెలల గరిష్ఠానికి ఎగబాకడంతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు పెద్ద మొత్తంలో తరలిపోతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆటో, యంత్రపరికరాల రంగాల షేర్లలో అమ్మకాలను పోటెత్తించారు. దాంతో సెన్సెక్స్ ఒకదశలో 1,141.88 పాయింట్లు పతనమై 77,533.30 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 984.23 పాయింట్ల నష్టంతో 77,690.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. కాగా, నిఫ్టీ 324.40 పాయింట్లు క్షీణించి 23,559.05 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఐదో రోజు. జూన్ 24 తర్వాత రెండు సూచీలు ఇంత కనిష్ఠ స్థాయిల్లో ముగియడం ఇదే ప్రథమం. గత రెండు రోజుల్లో బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13 లక్షల కోట్లకు పైగా పతనమై రూ.429.46 లక్షల కోట్లకు (5.09 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

రూ.50 లక్షల కోట్లు పాయే..

గరిష్ఠాల నుంచి 10 శాతం దిగువకు

సెన్సెక్స్, నిఫ్టీ కరెక్షన్ జోన్‌లోకి ప్రవేశించాయి. ఈ రెండు సూచీలు సెప్టెంబరులో నమోదు చేసిన సరికొత్త ఏడాది (52 వారాల) గరిష్ఠ స్థాయిల నుంచి దాదాపు 10 శాతం క్షీణించాయి. ఏదైనా కంపెనీ షేరు లేదా సూచీ ఏడాది గరిష్ఠం నుంచి పది శాతం పతనమైన పక్షంలో ఆ స్టాక్ లేదా ఇండెక్స్ కరెక్షన్ దశలోకి ప్రవేశించినట్లు భావిస్తారు. 20 శాతం క్షీణిస్తే బేర్ పూర్తిగా పట్టు బిగించినట్టే. ఈ సెప్టెంబరు 27న నమోదు చేసిన సరికొత్త 52 వారాల గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లతో పోలిస్తే, సెన్సెక్స్ ఇప్పటివరకు 8,287.3 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ సైతం 26,277 వద్ద నమోదు చేసిన సరికొత్త ఏడాది గరిష్ఠం నుంచి ఇప్పటివరకు 2,718 పాయింట్లు పతనమైంది.

బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా సెప్టెంబరు 27న నమోదైన ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.479.10 లక్షల కోట్ల నుంచి బుధవారం నాటికి రూ.429.46 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే, మార్కెట్ సంపద రూ.50 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. ప్రామాణిక సూచీలు మున్ముందు మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సూచీలు పది శాతం తగ్గినప్పటికీ, రూ.1,000 కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన 900కు పైగా కంపెనీల షేర్లు ఇప్పటికే 20 శాతానికి పైగా క్షీణించడంతో మార్కెట్ బేర్ పట్టులోకి జారుకుందన్న సంకేతాలొస్తున్నాయి. నిఫ్టీ ప్రస్తుత 23,500 స్థాయిని కూడా కోల్పోతే.. మున్ముందు 23,000 వద్దకు జారుకోవచ్చునంటున్నారు.

ఫార్చ్యూన్ 100 శక్తివంతుల్లో నంబర్ 3 సత్య నాదెళ్ల

ముకేశ్ అంబానీ, పిచాయ్‌కూ చోటు

టాప్‌లో ఎలాన్ మస్క్



న్యూయార్క్: ప్రపంచ కుబేరుల్లోనే కాదు, అత్యంత శక్తివంతులైన 100 మంది వ్యాపావేత్తల జాబితాలోనూ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానం సంపాదించారు. 'అత్యంత శక్తివంతులైన 100 మంది వ్యాపారవేత్తలు' పేరుతో ఫార్చ్యూన్ పత్రిక ఒక జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో ఉంటే, ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హంగ్ రెండో స్థానంలో, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల మూడో స్థానంలో నిలిచారు. సత్య నాదెళ్ల, జెన్‌సెన్ హంగ్ టెక్నాలజీ, కృత్రిమ మేధతో వ్యాపారాల స్వరూప స్వభావాలనే మార్చివేస్తున్నారని ఫార్చ్యూన్ పత్రిక కితాబిచ్చింది. ఫైనాన్స్, కన్స్యూమర్ టెక్నాలజీలను కొత్త పుంతలు తొక్కిస్తున్న వారెన్ బఫెట్, జెమీ డైమన్, యాపిల్ కంపెనీ సీఈఓ టిమ్ కుక్, మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్‌కీ ఈ జాబితాలో స్థానం దొరికింది.

అంబానీకి 12వ స్థానం : రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఈ జాబితాలో 12వ స్థానంలో నిలిచారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 10వ స్థానం, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ 11వ స్థానం సంపాదించారు.

ఆ మూడు బ్యాంకులే కీలకం

ఆర్‌బీఐ జాబితాలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకు

HDFC BANK We understand your world
SBI
ICICI Bank

ముంబై: బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు అత్యంత కీలకమని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ ఈ బ్యాంకులను దేశంలో వ్యవస్థీకృతంగా అత్యంత కీలక బ్యాంకులుగా (డీ-ఎస్ఐబీ) వర్గీకరించింది. దీనికి సంబంధించి బుధవారం ఒక జాబితా విడుదల చేసింది. కొన్ని నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి ఈ బ్యాంకులు కామన్ ఈక్విటీ టైర్ 1 (సీఈటీ1) కంటే అధిక మూలధన నిల్వలు కలిగి ఉండాలి. తాజా వర్గీకరణ ప్రకారం ఎస్‌బీఐని బకెట్ 4లో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును బకెట్ 2లో, ఐసీఐసీఐ బ్యాంకును బకెట్ 1లో ఆర్‌బీఐ చేర్చింది. దీని ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఎస్‌బీఐ తన సీఈటీ 1 కంటే 0.80 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.40 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 0.20 శాతం అధిక మూలధన నిల్వలు కలిగి ఉండాలి. ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ఈ బ్యాంకుల ఆర్థిక స్థితిగతులను పరిశీలించాక ఈ వర్గీకరణ చేసినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

విశాఖలో రూ.500 కోట్లతో స్టార్ హోటల్

వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డులో గల తాజ్ గేట్‌వే హోటల్‌ను పడగొట్టి ఆ స్థలంలో రూ.500 కోట్లతో అధునాతన సౌకర్యాలతో కూడిన స్టార్ హోటల్ నిర్మించనున్నట్లు వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్ తెలిపారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో 23 అంతస్థుల భవనం (మూడు టవర్లు) నిర్మిస్తున్నట్టు చెప్పారు. అందులో 374 డీలక్స్ రూమ్‌లతో హోటల్ (ఒక టవర్), సర్వీస్ అపార్టుమెంట్స్‌తో ఒక టవర్, 2.8 లక్షల చ.అ. విస్తీర్ణంతో 14 అంతస్థుల్లో గ్రేడ్-1 ఆఫీస్ స్పేస్‌తో మరో టవర్ నిర్మిస్తామన్నారు. సింగపూర్‌లోని మెరీనా బే శాండ్స్ తరహాలో నిర్మాణం ఉంటుందన్నారు. వేయి కార్లకు పార్కింగ్ సదుపాయం ఉంటుందన్నారు. టెర్రస్‌పై స్విమ్మింగ్ పూల్, హెలీప్యాడ్ వంటివి ఉంటాయన్నారు. 2028 చివరి నాటికి హోటల్ అందుబాటులోకి తీసుకువస్తామని మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్ వెల్లడించారు.

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు అవార్డులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. సౌదీ అరేబియాలో జరుతున్న సౌదీ ఎయిర్‌పోర్టు ఎగ్జిబిషన్ 2024లో ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్టు రెవెన్యూ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిజిటల్ ట్విన్, ది స్మార్ట్ ట్రాలీ పేరుతో ఈ అవార్డులు లభించాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చూపిస్తున్న ప్రతిభకు ఈ అవార్డులు ఒక గుర్తింపని చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.

స్పోర్ట్స్

సింధు ముందుకు.. లక్ష్య ఇంటికి

న్యూఢిల్లీ: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ తొలి రౌండ్‌లో పీవీ సింధు ముందంజవేయగా.. లక్ష్యసేన్ ఓటమిపాలై ఇంటిబాట పట్టాడు. సింధు 21-12, 21-8తో బుసానన్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ఇక, లక్ష్యసేన్ 22-20, 17-21, 16-21తో జున్ హావో (మలేసియా) చేతిలో ఓడాడు.

అంతా ఆ నలుగురి వల్లే!

- నా కుమారుడి కెరీర్‌కు చేటు
- ధోనీ, కోహ్లీ, రోహిత్, ద్రవిడ్‌పై శాంసన్ తండ్రి ఆరోపణ



న్యూఢిల్లీ: ధోనీ, కోహ్లీ, రోహిత్, ద్రవిడ్ తన కొడుకు ఎదుగుదలను అడ్డుకొన్నారని సంజూ శాంసన్ తండ్రి శాంసన్ విశ్వనాథ్ సంచలన ఆరోపణలు చేశాడు. వీరివల్లే శాంసన్ కెరీర్‌లో అమూల్యమైన పదేళ్లను కోల్పోయాడని అసహనం, ఆవేదన వ్యక్తం చేశాడు. 2015లో సంజూ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అయితే, కీపర్‌గా ధోనీ జట్టులో ఉండడంతో అతడిని పక్కనబెట్టేశారు. తర్వాత పగ్గాలు చేపట్టిన కోహ్లీ కూడా శాంసన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తన కుమారుడికి తగిన అవకాశాలిస్తున్న కోచ్ గంభీర్, సూర్యకు విశ్వనాథ్ కృతజ్ఞతలు తెలిపాడు.

తన్మయ్ శతకం

- హైదరాబాద్ 244/5
- ఆంధ్రతో రంజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తన్మయ్ అగర్వాల్ (240 బంతుల్లో 124 బ్యాటింగ్) శతకంతో ఆదుకోవడంతో ఆంధ్రతో బుధవారం మొదలైన రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ గౌరవప్రదమైన స్కోరు దిశగా సాగుతోంది. ఉప్పల్ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ తొలిరోజు చివరికి 5 వికెట్లకు 244 పరుగులు చేసింది. అయితే ఆంధ్ర జట్టు పేలవ ఫీల్డింగ్ హైదరాబాద్ పాలిట వరమైంది. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర 4 క్యాచ్‌లు జారవిడవగా అందులో రెండు తన్మయ్ అగర్వాల్‌వి కావడం విశేషం. ఆంధ్ర బౌలర్లలో స్పిన్నర్ విజయ్ 3 వికెట్లు తీయగా, లలిత్, సందీప్‌కు చెరో వికెట్ లభించింది.

కెప్టెన్‌గా హనుమ విహారి

ఈ సీజన్‌లో ఆడిన 4 మ్యాచ్‌ల్లో మూడింట్లో ఓడి, ఒక్క మ్యాచ్‌ని డ్రా చేసుకొని ఒకే ఒక్క పాయింట్‌తో గ్రూపులో అట్టడుగున ఉన్న ఆంధ్ర జట్టు మరోసారి కెప్టెన్‌ను మార్చింది. 4 మ్యాచ్‌లకు ముగ్గురు కెప్టెన్లను ఏసీఏ మార్చడం చర్చనీయాంశమైంది. టీమిండియాకు ఆడిన విహారి, భరత్ అందుబాటులో ఉన్నా తొలుత రికీ భుయ్‌కు, తర్వాత షేక్ రషీద్‌కు సారథ్య బాధ్యతలివ్వగా, హైదరాబాద్‌తో రంజీకి తిరిగి విహారికి పగ్గాలు ఇచ్చారు.

అర్జున్, హంపి, హారిక గేమ్‌లు డ్రా

టాటా స్టీల్ చెస్

కోల్‌కతా: తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్‌లో తొలిరోజు జరిగిన ర్యాపిడ్ విభాగం మూడు రౌండ్లను డ్రాగా ముగించాడు. బుధవారం ఇక్కడ మొదలైన ఓపెన్ కేటగిరిలో నిహాల్ సరీన్‌తో ఆరంభ రౌండ్‌ను, ఆ తర్వాత విదిత్, నారాయణన్‌లతో గేమ్‌లను అర్జున్ డ్రా చేసుకున్నాడు. 3 రౌండ్ల అనంతరం అర్జున్ 1.5 పాయింట్లతో ఏడోస్థానంలో ఉన్నాడు. ఇక.. మహిళల విభాగంలో హంపి, హారిక తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. మూడు రౌండ్లలోనూ తమ ప్రత్యర్థులతో పాయింట్ పంచుకున్నారు. తద్వారా మొదటి రోజు పోటీల తర్వాత హంపి, హారిక చెరో 1.5 పాయింట్లతో వరుసగా 4, 5 స్థానాల్లో కొనసాగుతున్నారు.

బీసీసీఐ చాలెంజర్స్ ట్రోఫీకి ఏడుగురు తెలుగమ్మాయిలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల చాలెంజర్స్ టీ20 ట్రోఫీకి ఏడుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి రాంచీలో జరిగే ఈ టోర్నీలో 6 జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో తెలంగాణ నుంచి మమత మడివాలా టీమ్-'డి'కి ప్రాతినిథ్యం వహిస్తుండగా టీమ్-'ఎ' తరఫున త్రిషా పూజిత, యశశ్రీ, అరుంధతి రెడ్డి ఆడనున్నారు. ఆంధ్ర నుంచి వాసవి అఖిల, హెన్రీటా పెరీరా టీమ్-'ఈ' నుంచి, శరణ్య టీమ్-'సి' నుంచి బరిలోకి దిగుతున్నారు.

2 టీ20ల్లో సెంచరీ చేసిన రెండో పిన్నవయసు భారత బ్యాటర్‌గా తిలక్ వర్మ (22 ఏళ్ల 5 రోజులు). యశస్వీ జైస్వాల్ (21 ఏళ్ల 279 రోజులు) టాప్‌లో ఉన్నాడు.

తిలక్ తుఫాన్



తిలక్ వర్మ (56 బంతుల్లో 107 నాటౌట్)

శతక్కొట్టిన తెలుగు కుర్రాడు

- అభిషేక్ హాఫ్ సెంచరీ
- 11 పరుగులతో భారత్ గెలుపు
- మూడో టీ20లో ఓడిన దక్షిణాఫ్రికా

సెంచూరియన్: తిలక్ వర్మ (56 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 107 నాటౌట్) సుడిగాలి శతకంతో.. భారత్ మళ్లీ గెలుపు బాటపట్టింది. బుధవారం జరిగిన మూడో టీ20లో భారత్ 11 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో పైచేయి సాధించింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 219/6 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో అలరించాడు. కేశవ్ మహరాజ్, సిమెలానె చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 208/7 స్కోరు మాత్రమే చేసింది. జెన్సన్ (17 బంతుల్లో 54), క్లాసెన్ (41), మార్‌క్రమ్ (29) టాప్ స్కోరర్లు.

అర్ష్‌దీప్ 3, వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు పడగొట్టారు. టీమిండియా తరఫున రమణ్‌దీప్ సింగ్ అరంగేట్రం చేశాడు. కీటకాల కారణంగా సౌతాఫ్రికా బ్యాటింగ్ సమయంలో సుమారు 20 నిమిషాలపాటు ఆటకు అంతరాయం కలిగింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా తిలక్ వర్మ నిలిచాడు.

భయపెట్టిన జెన్సన్: భారత స్పిన్నర్ల మాయాజాలంతో.. భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా తడబడింది. ఓపెనర్లు రికెల్టన్ (20), హెండ్రిగ్స్ (21) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. రికెల్టన్‌ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేయగా.. హెండ్రిగ్స్‌ను వరుణ్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టబ్స్ (12) రెండు ఫోర్లతో జోరు చూపడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి దక్షిణాఫ్రికా 55/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో వరుణ్, అక్షర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఫామ్‌లో ఉన్న స్టబ్స్‌ను అక్షర్ ఎల్బీగా వెనక్కిపంపాడు. రెండు సిక్స్‌లతో దూకుడుగా ఆడే ప్రయత్నం చేసిన మార్‌క్రమ్‌ను వరుణ్ క్యాచవుట్ చేయడంతో.. 10 ఓవర్లకు సౌతాఫ్రికా 84/4తో ఇబ్బందుల్లో పడింది. అయితే, క్లాసెన్, మిల్లర్ (18) ఐదో వికెట్‌కు 58 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. చివరి 30 బంతుల్లో 86 పరుగులు కావల్సి ఉండగా.. మిల్లర్‌ను పాండ్యా అవుట్ చేశాడు. ధాటిగా ఆడుతున్న క్లాసెన్‌ను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చడంతో మ్యాచ్ టీమిండియాదే అని భావించారు. కానీ, జాన్సన్ ఎడాపెడా షాట్లతో భారత శిబిరంలో గుబులు రేపాడు. 19వ ఓవర్‌లో పాండ్యా బౌలింగ్‌లో జాన్సన్ 2 సిక్స్‌లు, మూడు ఫోర్లతో 26 పరుగుల రాబట్టడంతో.. ఆఖరి ఓవర్‌లో లక్ష్యం 25 పరుగులకు దిగివచ్చింది. అయితే, జెన్సన్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ జట్టుకు ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

అటు వర్మ.. ఇటు శర్మ: డాషింగ్ బ్యాటర్ తిలక్ కెరీర్‌లో తొలి శతకంతో దుమ్మురేపగా.. గత రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన ఓపెనర్ అభిషేక్ హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డ వీరిద్దరూ రెండో వికెట్‌కు 52 బంతుల్లో 107 పరుగులు జోడించడంతో.. భారత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (0)ను జెన్సన్ వరుసగా రెండోసారి డకౌట్ చేశాడు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన తిలక్, అభిషేక్ పోటాపోటీగా షాట్లు ఆడుతూ పవర్‌ప్లేలో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వర్మ 4,6 బాదగా.. రెండో ఓవర్‌లో అభిషేక్ 4,6,4తో 15 పరుగులు రాబట్టాడు. ఇక, ఐదో ఓవర్‌లో సిమెలానె బౌలింగ్‌లో అభిషేక్ రెండు భారీ సిక్స్‌లతో మొత్తం 18 రన్స్ సాధించాడు. దీంతో ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 70/1తో భారీ స్కోరుకు బాటలువేసింది. అయితే, మధ్య ఓవర్లలో సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో టీమిండియా పరుగుల వేగం మందగించింది. 9వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న అభిషేక్.. ఆ వెంటనే స్టంపౌటయ్యాడు. కెప్టెన్ సూర్యకుమార్ (1)ను సిమెలానె స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చడంతో భారత్ 110/3తో నిలిచింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా (18) వరుస బౌండ్రీలతో స్కోరు బోర్డులో ఊపు తెచ్చే ప్రయత్నం చేశాడు. 13వ ఓవర్‌లో సింగిల్‌తో తిలక్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నా.. పాండ్యాను కేశవ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ (8) తన సహజ శైలిలో షాట్లు ఆడలేక పోయాడు. కానీ, అప్పటి వరకు ఒకింత నెమ్మదిగా ఆడుతున్న తిలక్.. 15వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో 4,6,4తో ఒక్కసారిగా గేర్ మార్చడంతో టీమ్ స్కోరు దూసుకెళ్లింది. ఆ తర్వాతి ఓవర్‌లో కొట్జీ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో చెలరేగిన తిలక్ ఏకంగా 21 పరుగులు రాబట్టాడు. రింకూను సిమెలానె బౌల్డ్ చేయడంతో ఐదో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిక్స్‌తో రమణ్‌దీప్ (15) ఖాతా తెరవగా.. బౌండ్రీతో తిలక్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. రమణ్‌దీప్ రనౌట్ అయ్యాడు. వర్మ దెబ్బకు చివరి 5 ఓవర్లలో సఫారీలు 65 పరుగులు సమర్పించుకోవడంతో.. భారత్ స్కోరు 200 మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (బి) జెన్సన్ 0, అభిషేక్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 50, తిలక్ (నాటౌట్) 107, సూర్యకుమార్ (సి) జెన్సన్ (బి) సిమెలానె 1, హార్దిక్ (ఎల్బీ) కేశవ్ 18, రింకూ (బి) సిమెలానె 8, రమణ్‌దీప్ (రనౌట్) 15, అక్షర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 20 ఓవర్లలో 219/6; వికెట్ల పతనం:** 1-0, 2-107, 3-110, 4-132, 5-190, 6-218; **బౌలింగ్:** జెన్సన్ 4-0-28-1, కొట్జీ 3-0-51-0, సిపామ్లా 4-0-45-0, సిమెలానె 3-0-34-2, మార్‌క్రమ్ 2-0-19-0, కేశవ్ 4-0-36-2.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (బి) అర్ష్‌దీప్ 20, హెండ్రిక్స్ (స్టంప్డ్) శాంసన్ (బి) వరుణ్ 21, మార్‌క్రమ్ (సి) రమణ్‌దీప్ (బి) వరుణ్ 29, స్టబ్స్ (ఎల్బీ) అక్షర్ 12, క్లాసెన్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 41, మిల్లర్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 18, జెన్సన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 54, కొట్జీ (నాటౌట్) 2, సిమెలానె (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం: 20 ఓవర్లలో 208/7; వికెట్ల పతనం:** 1-27, 2-47, 3-68, 4-84, 5-142, 6-167, 7-202; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, హార్దిక్ 4-0-50-1, అక్షర్ 4-0-29-1, వరుణ్ 4-0-54-2, రవి బిష్ణోయ్ 4-0-33-0.

ఫుట్‌బాల్ సంఘాన్ని కాపాడండి

వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ

విశాఖపట్నం: వైసీపీ నాయకులు, వారి అనుచరులనుంచి రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘాన్ని రక్షించాలని వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. నకిలీ రిజిస్ట్రేషన్లతో దొడ్డిదారిలో రాష్ట్ర సంఘాన్ని ఏర్పాటు చేసి ఫుట్‌బాలర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్న ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బృందంపై చర్యలు చేపట్టాలని అన్నారు. ఆంధ్ర క్రికెట్ మాదిరిగా నిజమైన రిజిస్ట్రేషన్లు కలిగిన జిల్లా సంఘాల సభ్యులతో రాష్ట్ర సంఘానికి ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర ఫుట్‌బాల్‌ను బతికించాలని కోరారు. కోనసీమ, మన్యం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాల నుంచి తన అనుచరుల పేర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లు సృష్టించి మోసపూరిత వ్యవహారాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఓటర్ల జాబితాపై ఫిర్యాదు చేసినా శాప్ పట్టించుకోకపోవడంతో నిస్సహాయంగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడు, క్రీడా మంత్రి, శాప్ చైర్మన్, సీఎండీలకు వినతిపత్రాలు అందజేశామని గోపాలకృష్ణ పేర్కొన్నారు.

బోపన్న జోడీ మళ్లీ..

ట్యూరిన్ (ఇటలీ): ప్రతిష్ఠాత్మక ఏటీపీ ఫైనల్స్‌లో స్టార్ రోహన్ బోపన్నకు మరోసారి నిరాశే ఎదురైంది. బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తమ గ్రూప్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలై సెమీఫైనల్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో ఆరో సీడ్ బోపన్న ద్వయం 5-7, 3-6తో టాప్ సీడ్ అరెవాలో (ఎల్ సాల్వెడార్)/పావిక్ (క్రొయేషియా) జంట చేతిలో పరాజయం పాలైంది.



గోళ్లు అందంగా..!

చేతులు అందంగా కనిపించాలంటే గోళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. బలహీనమైన గోళ్లు అనారోగ్యాన్ని సూచిస్తాయి. గోళ్లు లేత గులాబీ రంగులో నున్నగా మెరుస్తూ పొడవుగా పెరగాలంటే ఆహారంలో ఏ పోషకాలు ఉండాలో తెలుసుకుందాం!

ప్రొటీన్లు: గోళ్లు కెరటిన్ అనే ప్రొటీన్‌తో తయారవుతాయి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు లోపిస్తే గోళ్లు బలహీనంగా పెళుసుగా మారతాయి. గోళ్లు అందంగా పెరగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా లభించే చిక్కుళ్లు, టోఫు, గుడ్లు, చేపలు, చికెన్ తినాలి.

బయోటిన్: ఇది గోళ్లు విరగకుండా కాపాడుతుంది. బయోటిన్ అధికంగా లభించే గుడ్లు, బాదాం, వాల్‌నట్స్, ఓట్స్, సాల్మన్, చిలకడదుంప, అవకాడో, కాలీఫ్లవర్‌లను తరచూ తినడం వల్ల గోళ్లు బలంగా పెరుగుతాయి. బయోటిన్ లోపం అధికంగా ఉంటే వైద్యుని పర్యవేక్షణలో సప్లిమెంట్స్ వాడవచ్చు.

జింక్: ఇది గోళ్లు పెళుసుబారకుండా కాపాడుతుంది. ప్రమాదవశాత్తూ గోళ్లు విరిగినా, గోళ్లపై పగుళ్లు వచ్చినా తగిన మరమత్తులు చేసి గోళ్లు బలంగా పెరిగేలా చూస్తుంది. చిక్కుళ్లు, శనగలు, పలు రకాల నట్స్ నుంచి జింక్ పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్లు: గోళ్లు ఆరోగ్యంగా పెరగాలంటే విటమిన్లు, మినరల్స్, కాల్షియం తప్పనిసరి. గోళ్లు ఆక్సీకరణ బారిన పడకుండా ఎ విటమిన్ కాపాడుతుంది. సి విటమిన్ గోళ్లలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసి అవి దృఢంగా ఉండేలా చూస్తుంది. ఇ విటమిన్ గోళ్లకు తేమ, పోషణను అందిస్తుంది. క్యారెట్, క్యాప్సికమ్, మొలకలు, సిట్రస్ పండ్లు, స్ట్రాబెరీ, అరటి పండు, కివీ పండ్లు తరచూ తినడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ జరిగి బలంగా పెరుగుతాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తాగడం కూడా మంచిదే.



సజ్జలతో సజావుగా!

ఏ వయసువారికైనా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే చిరుధాన్యాల్లో సజ్జలు ప్రధానమైనవి. వీటికి స్వతహాగా వేడిని కలిగించే గుణం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో సజ్జలను ఆహారంగా తీసుకుంటే శరీరంలోని ఉష్ణోగ్రతను కాపాడుకోవచ్చు. వీటిలో గ్లూటెన్ ఉండదు. ఎన్నో పోషకాలతో నిండిన సజ్జలు అందించే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

ఆరోగ్యానికి...

- తరచూ సజ్జలు తినడంవల్ల వీటిలోని పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు రక్తపోటుని నిరోధిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా చేస్తాయి.
- సజ్జలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తిన్నపుడు వాటిలో ఉండే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ వల్ల ఎక్కువ సమయం కడుపు నిండిన భావన ఉంటుంది. ఇవి నిదానంగా జీర్ణమవడం వల్ల తొందరగా ఆకలి అనిపించదు. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.
- రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇవి మధుమేహ రోగులకు అమృతంలా పని చేస్తాయి. వీటిలోని పీచుపదార్థం ప్రీ బయాటిక్‌లా పని చేసి జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- సజ్జలను ఆహారంలో చేర్చుకోవడంవల్ల శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్ అంది రక్తహీనత, అధిక కొవ్వువల్ల తలెత్తే సమస్యలను నియంత్రిస్తాయి. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ శాతాన్ని పెంచి కార్డియో వాస్క్యులర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఆస్తమా తదితర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. సజ్జల నుంచి లభించే బి విటమిన్లు కండరాలను దృఢంగా మారుస్తాయి. శీతాకాలంలో వచ్చే కీళ్ల సమస్యలు, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తాయి.

అందానికి....

- సజ్జలలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫినాలిక్స్ ఉంటాయి. ఇవి శరీరంలో జీవక్రియలను వేగవంతం చేస్తాయి. చర్మ సంబంధిత సమస్యలను నివారిస్తాయి. వృద్ధాప్య ఛాయలను అడ్డుకుంటాయి.
- సజ్జలను తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఐరన్, ఇ విటమిన్ లభిస్తాయి. దీనివల్ల చర్మం మీద మొటిమలు, ముడుతలు తగ్గి మెరుపు సంతరించుకుంటుంది. సజ్జలలో ఉండే బి 6, నియాసిన్, ఫోలేట్, ఐరన్, జింక్, ప్రొటీన్ల వల్ల శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విజేత





బాడీబిల్డింగ్ అంటే ఆసక్తి... కానీ ఇంట్లో అందుకు అంగీకరించరు. అందుకే ఉద్యోగానికి వెళుతున్నానని చెప్పి... జిమ్‌లో సాధన చేసింది. ఇల్లాలిగా అటు ఇంటి పనులు... అమ్మగా ఇటు పసిబిడ్డ బాధ్యతలు... అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ అనుకున్నది సాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలిచింది. అంతర్జాతీయ పోటీల్లో తలపడి... భారతకు పతకాలు అందివ్వడమే తన లక్ష్యమంటున్న సయ్యద్ ఆసిఫా‌ను 'నవ్య' పలకరించింది.

సాహసమే ఊపిరిగా..!

"**అం**కితభావంతో కృషి చేయాలే కానీ అసాధ్యమనేది ఏదీ ఉండదు. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. పెళ్లి, పిల్లలు, కుటుంబం... ఆ తరువాత చాలామంది అమ్మాయిలు ఇక కొత్తగా ఏమీ సాధించలేమని అనుకొంటారు. కానీ నా ప్రయాణం పెళ్లయ్యి, ఒక బిడ్డ పుట్టాకే మొదలైంది. ఏపీలోని ప్రకాశం జిల్లాలోని ఓ సంప్రదాయ ముస్లిం కుటుంబం మాది. మా నాన్న ఆర్మీ ఉద్యోగి కావడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో నా విద్యాభ్యాసం సాగింది. 2014లో ఇంటర్ పూర్తి కాగానే ఇంట్లోవాళ్లు నాకు పెళ్లి చేశారు. మావారు కూడా ఆర్మీ ఉద్యోగే.

ఆయన సహకారంతో...

పెళ్లి తరువాత నేను చదువు కొనసాగించాలని అనుకున్నాను. మావారికి చెబితే సరేనన్నారు. ఆయన సహకారంతో డిగ్రీ చదివాను. మాకు ఓ బాబు పుట్టాడు. మావారి సహకారంతో ఎంబీయే కూడా పూర్తి చేశాను. తరువాత ఓ సంస్థలో ఉద్యోగం వచ్చింది. అదికూడా మార్కెటింగ్‌లో. సాధారణంగా మార్కెటింగ్ అనగానే మగవారికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ మహిళలు ఎందులోనూ తీసిపోరని నిరూపించాలని అనుకున్నాను. ఆఫీస్‌లో కూర్చొనే ఉద్యోగం కాదనుకుని మార్కెటింగ్ వైపు వెళ్లాను.

అలా మొదలైంది...

చిన్నప్పటి నుంచి నాకు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. బాబు పుట్టాక రోజూ ఉదయం లేవగానే రన్నింగ్ మొదలుపెట్టాను. క్రమంగా అది నా దినచర్యల్లో భాగమైపోయింది. ఆ క్రమంలోనే నా దృష్టి మారథాన్‌లపై పడింది. తొలిసారి 2017లో 5కేఎం మారథాన్‌లో పాల్గొన్నాను. మంచి అనుభూతిని ఇచ్చింది. మరింత సాధన చేసి... మరుసటి ఏడాది జైపూర్‌లో జరిగిన హాఫ్ మారథాన్‌లో పోటీపడ్డాను. నా ఫిట్‌నెస్ చూసి కొందరు స్నేహితులు సలహా ఇచ్చారు... బాడీబిల్డింగ్ మీద దృష్టి పెట్టమని. ఆ సలహా నచ్చింది. 'ఎందుకు ప్రయత్నించకూడదు' అనుకున్నా. అలా 2019లో బాడీబిల్డింగ్ కోసం హైదరాబాద్ పహాడీషరీఫ్‌లోని ఒక జిమ్‌లో చేరాను.

పిల్లాడిని వెంటబెట్టుకొని...

మా అబ్బాయిని వెంటబెట్టుకొని జిమ్‌కు వెళ్లేదాన్ని. నా వ్యాయామాలు అయ్యేంతవరకు వాడు అక్కడే ఉండేవాడు. జిమ్‌లో చేరిన కొత్తల్లో అందరూ నన్ను వింతగా చూసేవారు. తరువాత నా ప్రయత్నం గురించి తెలుసుకుని ఎంతో ప్రోత్సహించారు. బాడీబిల్డింగ్ కోసం ఎలాంటి వ్యాయామాలు చేయాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? తదితర అంశాల్లో సూచనలు, సలహాలు ఇచ్చేవారు. మావారికి తప్ప మా ఇంట్లో ఎవరికీ నేను జిమ్‌కు వెళుతున్న విషయం తెలియదు. వాళ్లకు తెలిస్తే ఒప్పుకోరు. అందుకే బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నానని కుటుంబ సభ్యులకు చెబుతూ వచ్చాను. నేను ఇంట్లోవాళ్ల కంట పడకుండా కసరత్తులు చేశాను.

అదే నా లక్ష్యం...

అవకాశం, అయినవారి సహకారం ఉంటే అమ్మాయిలు ఎందులోనూ తీసిపోరని చెప్పే ప్రయత్నం నాది. అంతర్జాతీయ పోటీల్లో దేశం తరుపున పాల్గొనడం ఏ క్రీడాకారులకైనా ఉద్వేగభరిత క్షణం. విజయం సాధించి మువ్వన్నెల జెండా కప్పుకున్నప్పుడు ఎంతో గర్వంగా ఉంటుంది. ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం అదొక్కటే... అంతర్జాతీయ వేదికపై తలపడి... భారత్‌కు పతకాలు తేవాలని. నేను పతకాలు సాధిస్తే... అది చూసి మరింతమంది అమ్మాయిలు స్ఫూర్తి పొందుతారనీ, బాడీబిల్డింగ్‌లోకి వస్తారనీ నా ఆశ.



అప్పటివరకు తెలియదు...

బాడీబిల్డింగ్‌లో కురచ దుస్తులు ధరిస్తారని నాకు ముందు తెలియదు. క్రీడాకారులు తమ సౌలభ్యం కోసం పొట్టి దుస్తులు ధరించడం సహజమని తరువాత అర్థమైంది. ఒక ముస్లిం మహిళగా బాడీబిల్డింగ్‌ను ఎంచుకోవడం పెద్ద సాహసమేనని చెప్పాలి. రెండేళ్లకు పైగా తీవ్రంగా శ్రమించాను. పోటీలకు కావల్సిన విధంగా నా శరీరాన్ని తీర్చిదిద్దుకున్నాను. 2022లో మొదటిసారి బరిలోకి దిగాను. జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పోటీపడ్డాను. తమిళనాడులో నిర్వహించిన దక్షిణ భారత చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాను. లుధియానాలో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానం దక్కించుకున్నాను. నా కష్టానికి ఫలితం దక్కింది. నా లక్ష్యానికి మరింత చేరువ అయ్యాను. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. మాల్దీవ్స్‌లో ఇటీవల నిర్వహించిన ప్రపంచ బాడీబిల్డింగ్ సైకిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో దేశం తరుపున పాల్గొన్నాను. ఇది నాకు లభించిన అద్భుత అవకాశం.

ఎన్నిటినో వదిలేసి...

కఠోర వ్యాయామాలవల్ల కండలు పెరగడం, ముఖాకృతిలో మార్పులు రావడంతో బంధువుల నుంచి, వారు వేసే ప్రశ్నల నుంచి తప్పించుకొనేందుకు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు వెళ్లడం మానేశాను. ఎప్పుడైనా వెళితే... 'ఏంటీ రోజు రోజుకూ మగరాయుడిలా మారిపోతున్నావు' అనేవారు. సమాధానం ఇవ్వకుండా దాటవేసేదాన్ని. బాడీబిల్డింగ్‌లో వ్యాయామాలు ఎంత ముఖ్యమో ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. దీని కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకోవాలి. ఇంట్లో అందరితో కలిసి భోజనానికి కూర్చున్నప్పుడు కొద్దిగా తినేసి పక్కకు వచ్చేదాన్ని. తరువాత ఎవరి కంటా పడకుండా నిపుణులు సూచించిన ఆహారం తీసుకొనేదాన్ని. అనుకున్నది సాధించాలంటే కొన్నింటిని త్యాగం చేయక తప్పదు. దాని కోసం నేను మంచి ఉద్యోగం వదులుకున్నాను. కుటుంబం, కట్టుబాట్లను దాటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాను. అది సత్ఫలితాలను ఇస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది."

• మగ్దుం బాషా షేక్

సలహా

మధుమేహం రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్! నాకు 40 ఏళ్లు. మధుమేహం ముప్పు పొంచి ఉందని వైద్యులు చెప్పారు. ప్రిడయాబెటిక్ పరిస్థితి మధుమేహానికి దారి తీయకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

మధుమేహం వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. అయితే జీవనశైలిలో మార్పులతో వీటిని సులువుగానే అదుపులో పెట్టుకోవచ్చు. ప్రిడయాబెటిక్‌లో చక్కెర స్థాయిలు సహజం కంటే కాస్త ఎక్కువగా, టైప్2 మధుమేహం మోతాదు కంటే కాస్త తక్కువగా ఉంటాయి. ఈ ఆరోగ్య పరిస్థితిలో ఆరోగ్యం తీవ్రంగా కుదేలయ్యే పరిస్థితి తలెత్తే వరకూ మధుమేహ లక్షణాలేవీ బయల్పడవు. కాబట్టి మధుమేహం ముప్పు పొంచి ఉన్న వాళ్లు ముందస్తు రక్తపరీక్షలు చేయించుకుంటూ చక్కెర స్థాయిల మీద ఓ కన్నేసి ఉంచాలి. మరీ ముఖ్యంగా...

- స్థూలకాయులు
- 45 ఏళ్లు దాటినవాళ్లు
- టైప్2 డయాబెటిస్ కుటుంబ చరిత్ర ఉన్నవాళ్లు
- వారంలో కనీసం మూడు సార్లు కూడా వ్యాయామం చేయనివాళ్లు
- గర్భంతో ఉన్నప్పుడు మధుమేహం బారిన పడినవాళ్లు
- పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ ఉన్నవాళ్లు

ఈ కోవకు చెందినవాళ్లు రెట్టింపు అప్రమత్తంగా నడుచుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రిడయాబెటిక్ అని నిర్ధారణ అయినప్పుడు ఆ పరిస్థితిని అంగీకరించి, అందుకు తగ్గట్టు జీవనశైలి మార్పులు చేసుకోవాలి. మందులు వాడుతూ దాన్ని అదుపులో ఉంచుకుంటే సరిపోతుందిలే! అనుకోకుండా దాంతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ, వాటిని తిప్పి కొడుతూ ఉండాలి. అందుకోసం...

- **బరువు తగ్గాలి:** అధిక బరువును వ్యాయామంతో ఏ కొంత తగ్గించుకోగలిగినా టైప్2 మధుమేహం ముప్పు తగ్గుతుంది. మొత్తం శరీర బరువులో 7% తగ్గినా స్పష్టమైన ఫలితం దక్కుతుంది. కాబట్టి వారానికి 150 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి. అంటే వారంలో ఐదు రోజుల పాటు, రోజుకు 30 నిమిషాల నడక సరిపోతుంది. వేగంగా నడవడం లేదా అంతే సమానమైన ఫలితం దక్కే ఇతరత్రా వ్యాయామాలు కూడా ఎంచుకోవచ్చు.



- **సరిపడా నిద్ర:** రోజుకు 8 గంటలు తగ్గకుండా నిద్ర పోవాలి. రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోతూ, ఉదయం ఆలస్యంగా నిద్ర లేచే అలవాటు మానుకోవాలి. అలాగే మధ్యాహ్న సమయాల్లో కునుకులకు స్వస్తి చెప్పాలి. నిద్ర లేమి తీపి తినాలనే కోరికను పెంచుతుంది. ఫలితంగా మరుసటి ఉదయం తీయని పదార్థాలను ఎక్కువగా తింటూ ఉంటాం. అధిక క్యాలరీలు కలిగి ఉండే తీపి వల్ల శరీర బరువు పెరుగుతుంది.
- **సమతులాహారం:** మాంసకృత్తులు, పీచు, పిండిపదార్థాలు సమతులంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఒకేసారి ఎక్కువ పరిమాణాలు కాకుండా తక్కువ పరిమాణాల్లో ఎక్కువ సార్లు తినాలి. వీలైనంత ఎక్కువ పీచు, మాంసకృత్తులు, వీలైనంత తక్కువ పిండిపదార్థాలు తీసుకోవాలి. ఆకుకూరలు, తీపి తక్కువ ఉండే పళ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే తృణధాన్యాలను కూడా తీసుకుంటూ ఉండాలి. పాలిష్ పట్టిన బియ్యం, గోధుమలకు బదులుగా ముడి బియ్యం, పొట్టుతో కూడిన పప్పుదినుసులను ఎంచుకోవాలి.
- **దురలవాట్లు:** ధూమపానం, మద్యపానం అలవాట్లను మానేయడం ద్వారా ప్రిడయాబెటిస్, మరింత పెరగకుండా ఆపే వీలుంది

• డాక్టర్ సందీప్ రెడ్డి గంట
సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్, హైదరాబాద్

స్ఫూర్తి



జనపనార ఉత్పత్తులతో జీవితాలను సరిదిద్ది...

కట్టెల మోపు తలకెత్తుకుని, ప్రతి రోజూ తన ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్లే మహిళను చూసి, 'అది ఆమె తల రాత' అని సరిపెట్టుకోలేకపోయింది బెంగాల్‌కు చెందిన జుంకీ అయ్యంగార్. నిరుపేద మహిళల బతుకులను సరిదిద్దే ఆలోచన దిశగా అడుగులేసి, నిర్భాగ్య మహిళలకు జీవనభృతిని అందించే 'ఓర్నా' శిక్షణా కేంద్రాన్ని స్థాపించింది. ఆసక్తికరమైన ఆమె కథ తెలుసుకుందాం!

"**ఓ**ర్నా శిక్షణా కేంద్రాన్ని స్థాపించినప్పుడు నా వయసు 57. సమాజం నుంచి ఎంతో పొందాను. ఇప్పుడు తిరిగిచ్చే సమయం వచ్చిందని అనిపించిన వెంటనే, మహిళలకు జీవనభృతిని అందించే శిక్షణా సంస్థను స్థాపించాలనే ఆలోచన టక్కున స్ఫురించింది. మాది ఉన్నత మధ్య తరగతి కుటుంబం. సమాజసేవ మాకు అలవాటే! తాతయ్య ఆడపిల్లలకు చదువు నేర్పించాలనే సంకల్పంతో వెనకబడిన ప్రాంతాల్లో బడులు నడిపేవారు. నేను ఆయన్నుంచే స్ఫూర్తి పొందాను. ఉన్నత చదువులు చదివాను. ఐఐటి ముంబయి నుంచి డిజైనింగ్‌లో మాస్టర్స్ చేశాను. యుఎస్ టఫ్ట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్ చేశాను. ప్రస్తుతం జోధ్‌పూర్, కాన్పూర్ ఐఐటి విద్యార్థులకు ప్రొడక్ట్ డిజైన్ నేర్పిస్తున్నాను. అక్కడ నేర్పిస్తున్న విద్యనే మహారాష్ట్రలోని గ్రామీణ విద్యార్థులకు కూడా ఉచితంగా నేర్పిస్తూ ఉంటాను. ఖండాలాలో రెండేళ్ల పాటు వర్క్‌షాపులు కూడా ఏర్పాటు చేశాను. ఆ సమయంలోనే కుటుంబానికి తల్లులే వెన్నెముకలు అనే విషయం అవగతమైంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఎంతటి అంతర్గత శక్తిని కలిగి ఉన్నప్పటికీ, జీవనభృతికి తోడ్పడే అవకాశాలేవీ వాళ్లకు అందుబాటులో లేవనే విషయాన్ని నేను గమనించాను. అప్పుడే వాళ్ల పరిస్థితిలో మార్పు తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. అలా బెంగాల్‌కే పరిమితమైన కాంటా పనితనాన్ని, జనపనార ఉత్పత్తులకు జోడించి, వినూత్నమైన ఉత్పత్తులను సృష్టించి, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలని భావించాను. అలా నా ప్రయాణం ఖండాలాలో మొదలైంది.

ఇంటి నుంచే ఆదాయం

ఖండాలా సందర్శించినప్పుడు, అక్కడి మన్ దేశీ ఫౌండేషన్ అనే ఒక గ్రామీణ బ్యాంకు గురించి తెలిసింది. ఆ బ్యాంకు అధికారులు వర్క్‌షాప్స్‌కు అవసరమైన వసతులు కల్పించి, చుట్టుపక్కల నివసించే గ్రామీణ మహిళలతో అనుసంధానమయ్యే అవకాశం కల్పించారు. ఓర్నా సంస్థ ద్వారా, ఇంటికే పరిమితమైన నైపుణ్యం లేని మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాం. ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిపదార్థాలను వాళ్ల ఇళ్లకే తీసుకువెళ్లి అందించి, కుట్లు, ఎంబ్రాయిడరీ పనితనాలను ఓపిగ్గా నేర్పించాం. మా ఉత్పత్తులన్నీ జనపనారతో తయారైనవే! పైగా ఇవి పర్యావరణహితమైనవి కూడా! ఇలా ఇంటిపట్టునే తయారుచేసిన ఉత్పత్తులు, మాకు అందించిన వెంటనే తగిన రుసుమును చెల్లిస్తూ ఉండడంతో మహిళలు ఎంతో చురుగ్గా పని చేయడం మొదలుపెట్టారు. ఇవి అత్యంత మన్నికైన ఉత్పత్తులు కావడంతో కొనుగోళ్లు కూడా పెరిగాయి.

ఖండాలాలో రెండేళ్ల పాటు వర్క్‌షాపులు కూడా ఏర్పాటు చేశాను. ఆ సమయంలోనే కుటుంబానికి తల్లులే వెన్నెముకలు అనే విషయం అవగతమైంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఎంతటి అంతర్గత శక్తిని కలిగి ఉన్నప్పటికీ, జీవనభృతికి తోడ్పడే అవకాశాలేవీ వాళ్లకు అందుబాటులో లేవనే విషయాన్ని గమనించాను.



విదేశీ విక్రయాలు

మొదటి విడతలో తయారైన ఉత్పత్తులను అమెరికాలో విక్రయించాలని నిర్ణయించుకున్నాను. భారతీయ చేతివృత్తుల సంప్రదాయాలను పాశ్చాత్య దేశాలకు పరిచయం చేయడంతో పాటు, మారుమూల భారతీయ చేతివృత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావాలనే సంకల్పమే ఇందుకు కారణం. వ్యాపారాన్ని విస్తరించడం కోసం 2019లో ఓర్నా ఉత్పత్తులను భారతదేశంలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చాను. గ్రామీణ మహిళా వ్యాపారులను ప్రోత్సహించే, భివ్యాడి జాత్రా అనే ప్రఖ్యాత భారతీయ వాణిజ్య జాతరలో, ప్రధాన విభాగంలో ప్రదర్శన కోసం మా ఉత్పత్తులు ఎంపికయ్యాయి. ప్రదర్శనలో మా ఉత్పత్తులు సాధించిన విజయం ఓర్నా వృద్ధికి ఎంతో బాగా తోడ్పడింది. పూణెలో ఉన్న ఓర్నాతో అనుసంధానమై ఉన్న మహిళలందరూ 18 నుంచి 45 ఏళ్ల వారే! వినియోగదారులతో పాటు, బొటిక్‌లు, టోకు వ్యాపారులకు, ఓర్నా ఉత్పత్తులను విక్రయిస్తోంది. అమెరికా, దుబాయి, యుకె, జర్మనీల్లో కూడా ఓర్నా వినియోగదారులున్నారు. సంప్రదాయం ఉట్టిపడే ఉత్పత్తులను తయారుచేయడమే మా లక్ష్యం. ఎంబ్రాయిడరీ బ్యాక్‌ప్యాక్స్, టోట్స్, పర్సులు ఎక్కువగా అమ్ముడవుతూ ఉంటాయి. అలాగే భుజాలకు తగిలించుకునే సంచులు, ల్యాప్‌టాప్ సంచులు, కోస్టర్లు, టీ టవల్స్, బాటిల్ హోల్డర్స్ కూడా తయారు చేస్తూ ఉంటాం.

అభిప్రాయాల విలువ పెరిగింది

ప్రస్తుతం ఓర్నా వార్షిక ఆదాయం 10 నుంచి 24 లక్షలు. మహిళల శిక్షణకు మాకు రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతూ ఉంటుంది. అయినప్పటికీ పట్టుదలగా నేర్చుకుని, తమ కాళ్ల మీద తాము నిలబడే స్థితికి చేరుకోవాలనే సంకల్పం ప్రతి మహిళలో నాకు కనిపిస్తూ ఉంటుంది. ఇది హర్షించదగిన విషయం. ఇప్పుడు ఆ మహిళల అభిప్రాయాలకు కుటుంబంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. వాళ్లు వాళ్ల పిల్లలకు మెరుగైన జీవితాలను అందించగలుగుతున్నారు. ఓర్నా ద్వారా నేను అనుకున్నది సాధించగలిగాను. ఈ జీవితానికి ఇంతకంటే ఏం కావాలి?"



పనిలో బిజీగా ఉన్నా..

డబ్బింగ్ చెబుతున్న రష్మిక

అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'పుష్ప 2:ది రూల్'. ఈ చిత్రంలో తన పాత్రకు డబ్బింగ్ చెప్పే పనిలో ఉన్నారు రష్మిక. ఆ ఫొటోలను బుధవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'పనిలో బిజీ అయ్యాను, సెకండాఫ్‌కు డబ్బింగ్ చెబుతున్నాను. 'పుష్ప 2' గురించి మాటల్లో చెప్పలేను. ప్రథమార్థం అద్భుతంగా ఉంటుంది. ద్వితీయార్థం అంతకు మించి అనేలా ఉండబోతోంది. ఇంకొన్ని రోజుల్లో చిత్రీకరణ పూర్తవనుంది. దీంతో చిత్రబృందాన్ని ఇకపై మిస్ అవుతున్నానే అనే ఆలోచన బాధ కలిగిస్తుంద'న్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 17న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నారు. డిసెంబర్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీలీల చేస్తున్న ప్రత్యేక గీతాన్ని ఇటీవలే చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రానా సరికొత్త టాక్ షో




సెలబ్రిటీల జీవితాల్లోని ఎవరికీ తెలియని కోణాలను ఆవిష్కరించే వెబ్ సిరీస్ 'ద రానా దగ్గుబాటి షో' ఈనెల 23 నుంచి ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ ప్రోగ్రామ్‌ని స్పిరిట్ మీడియా బేనర్‌పై రానా నిర్మించి హోస్ట్ చేస్తున్నారు. ఈ సరికొత్త అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లు ఉంటుంది. ఇందులో ప్రముఖ సెలబ్రిటీలు అన్ ఫిల్టర్డ్ సంభాషణలు, ఎక్సయిటింగ్ యాక్టివిటీస్‌లో పాల్గొంటారు. దుల్కర్ సల్మాన్, నాగచైతన్య అక్కినేని, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల, నాని, ఎస్ఎస్ రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ వంటి సెలబ్రిటీలు పాల్గొంటారు. 'సెలబ్రిటీల వ్యక్తిత్వానికి ఒక ప్రత్యేక కోణాన్ని 'ద రానా దగ్గుబాటి షో' చూపుతుంది' అని అన్నారు ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజినల్స్ హెడ్ నిఖిల్ మధోక్.




వాసు జీవితానికి వెలుగులాంటి పాత్ర

వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'మట్కా' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఇందులో కథానాయికగా నటించిన మీనాక్షి చౌదరి బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో వరుణ్‌తేజ్ వాసుగా నటిస్తే, నేను సుజాత పాత్ర పోషించాను. ఇది మూడు డిఫరెంట్ ఫేజుల్లో ఉంటుంది. వాసుతో పాటు ట్రావెల్ అయ్యే క్యారెక్టర్. ఒక్క మాటలో చెప్పాలంటే వాసు జీవితానికి వెలుగులాంటి పాత్ర ఇది. టీనేజ్‌లో ఒకలా కనిపిస్తాను. లైఫ్‌లో దశలు మారుతున్న కొద్దీ నా లుక్‌లో మార్పు ఉంటుంది. దర్శకుడు కరుణకుమార్ లుక్ విషయంలో చాలా శ్రద్ధ వహించారు. ఆయన ఎన్నో స్కెచెస్ వేసి నా క్యారెక్టర్ లుక్ డిజైన్ చేయించారు. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రల్లో డిఫరెంట్ లుక్ ఉన్న సినిమా ఇది. ఎంజాయ్ చేస్తూ ఆ పాత్ర చేశాను' అన్నారు. వరుణ్‌తేజ్ గురించి వివరిస్తూ 'చాలా మంచి వ్యక్తి. మంచి సినిమా నాలెడ్జ్ ఉంది. వాసు పాత్రను అద్భుతంగా పోషించారు. మా కాంబినేషన్లో ఒక సాంగ్ ఉంది. అది లవ్ సాంగ్. ఒక లైఫ్ స్టోరీలా ఉంటుంది. ఆ సాంగ్ ని డైరెక్టర్ గారు చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఎఫర్ట్ పెట్టారు. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు మీనాక్షి.



అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మరో అప్డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. ఈ చిత్రంలోని తొలి గీతానికి రమణ గోగుల గాత్రం అందిస్తున్నారు. 'గోదారి గట్టు మీద' అంటూ సాగే ఈ పాటను త్వరలో విడుదల చేయనున్నారు. గతంలో వెంకటేశ్ నటించిన 'లక్ష్మి' చిత్రంలోని పాటలకు రమణ గోగుల సంగీత సారథ్యం వహించారు. మళ్లీ 18 ఏళ్ల తర్వాత వెంకటేశ్, రమణ గోగుల కాంబినేషన్ ఇలా కుదిరింది.



హాసీనా ప్రేమగీతం



ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన 'సిక్స్‌టీన్స్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న చిత్రం 'రిస్క్ - ఎ గేమ్ ఆఫ్ యూత్'. ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ అశ్వా కథానాయకుడు. సన్య ఠాకూర్, జోయా ఝవేరి హీరోయిన్లు. రాజీవ్ కనకాల కీలక పాత్ర పోస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఓ హసీనా' అంటూ సాగే ప్రేమ గీతాన్ని నటుడు సత్యం రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయని ఘంటాడి కృష్ణ తెలిపారు.

ఉత్కంఠ భరిత ప్రేమకథ



పవన్ శంకర్, యాని హీరో, హీరోయిన్లుగా దర్శకుడు జి.ఎం.నాయుడు తెరకెక్కిస్తున్న చిత్రం జీపీఎల్(గాడ్స్ ప్రీమియర్ లీగ్). అల్లు సాయి లక్ష్మణ్ నిర్మాత. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి.ఎం.నాయుడు మాట్లాడుతూ' పవన్ కళ్యాణ్ అభిమానిగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నా. జీపీఎల్ టైటిల్ ఈ కథకు సరిగ్గా సరిపోతుంది. మనం పైన ఉన్న భగవంతుడి ఆదేశాల మేరకు నడుస్తాము అనే పాయింట్‌తో ఈ సినిమా కథాంశం ఉండబోతుంది' అని తెలిపారు. నిర్మాత అల్లు సాయి లక్ష్మణ్ మాట్లాడుతూ' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఈ చిత్రం ఉంటుంది. లవ్ ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ సింగిల్ షెడ్యూల్‌లో పూర్తిచేయబోతున్నాం' అని చెప్పారు. తనికెళ్ల భరణి, హెబ్బాపటేల్, బ్రహ్మాజీ, నాగ మహేష్, నవీన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్


నాన్నకు ప్రేమతో



తండ్రీ కొడుకుల అనుబంధం ఇతివృత్తంగా తెరకెక్కుతోన్న చిత్రం 'లవ్ యువర్ ఫాదర్'. పవన్ కేతిరాజు దర్శకత్వంలో కిశోర్ రాఠీ, అన్నపురెడ్డి సామ్రాజ్య లక్ష్మి నిర్మిస్తున్నారు. శ్రీహర్ష, కశిక కపూర్, రియా సింగా జంటగా నటిస్తున్నారు. గాయకుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో తండ్రి పాత్ర పోషిస్తున్నారు. ఛత్రపతి శేఖర్, రఘుబాబు, భద్రం కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిదని నిర్మాతలు తెలిపారు. మణిశర్మ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు.







భవిష్యత్‌కు భరోసా..
సీబీజీ!
కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిలో భారత్ దూకుడు

- దేశంలో 5వేల ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యంతో ముందుకు
- త్వరలోనే ఏపీలోనూ 500 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు
- వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడతో ఇంధన ఉత్పత్తి
- పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయం.. కాలుష్యానికి చెక్
- రైతులకు ఆదాయ మార్గం.. గ్రామీణ ఉపాధికి అవకాశం
- యూరప్, అమెరికా, ఆసియా దేశాలు సీబీజీపై దృష్టి

రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల భారీ పెట్టుబడితో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వ్యర్థాలతో బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేయడం దీని లక్ష్యం. ఇవి అందుబాటులోకొస్తే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.57 వేల కోట్లకుపైగా ఆదాయం వస్తుందని, రెండున్నర లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు.

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌లో ఇంధన వినియోగం శరవేగంగా పెరుగుతోంది. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం భారత్ తన ముడిచమురు అవసరాల్లో 77 శాతం, సహజ వాయువుల అవసరాల్లో 50 శాతం దిగుమతిపైనే ఆధారపడుతోంది. ఇలా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఇంధన వినియోగంలో గ్యాస్ భాగస్వామ్యాన్ని ప్రస్తుతం ఉన్న 6.5 (ప్రపంచ సగటు 23.5శాతం) శాతం నుంచి 15 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తులో ఇంధన వనరుల కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలనూ అన్వేషించాలని యోచిస్తోంది. దీనికోసం కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించి.. 2018లో సస్టెయినబుల్ ఆల్టర్నేటివ్ టువార్డ్స్ అఫర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఎస్ఏటీఏటీ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 5,000 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీలోనూ ఇవి అందుబాటులోకి రానున్నాయి.

అనేక వ్యర్థాలకు సరైన అర్థం..

కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) అనేది పునరుత్పాదక శుద్ధ ఇంధనం. ఇది కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)లాగే పెట్రోల్, డీజిల్ వినియోగానికి ప్రత్యామ్నాయం. భవిష్యత్తు ఇంధనంగానూ అభివర్ణిస్తున్నారు. ఇది పర్యావరణానికి అనుకూలం. సేంద్రీయ వ్యర్థాలతోపాటు వ్యవసాయ వ్యర్థాలైన వరి చెత్త, చెరకు, సోయా, పత్తి తదితర పంటల ద్వారా వచ్చే చెత్త, పశువుల పేడ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థాలను వాయురహిత విచ్ఛిన్న ప్రక్రియ ద్వారా సీబీజీని సహజంగా ఉత్పత్తి చేస్తారు. నీటి ఆవిరి, హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్ డయాక్సైడ్‌లను తొలగించడానికి బయోగ్యాస్‌ను శుద్ధి చేస్తారు. ఆ బయోగ్యాస్‌ను కుదించి 90 శాతం కంటే ఎక్కువ మీథేన్ కలిగిన సీబీజీగా ఉత్పత్తి చేస్తారు. రవాణా, పరిశ్రమలు, వాణిజ్య అవసరాలకు సీబీజీని వాడవచ్చు.


ఏఏ దేశాలు వాడుతున్నాయి..?

యూరప్‌లోని జర్మనీ, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ తదితర దేశాలు సీబీజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. జర్మనీలో 2010లోనే 4,136 ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. ఇప్పుడా సంఖ్య 9 వేలు దాటింది. 6.6 మిలియన్ టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆసియాలో భారత్, చైనా, నేపాల్, వియత్నాం, బంగ్లాదేశ్, కంబోడియా, ఇండోనేసియా సీబీజీ వినియోగంలో అగ్రగామిగా ఉన్నాయి. అమెరికా, బ్రెజిల్ కూడా ప్రోత్సహిస్తున్నాయి.

భారత్‌లో ఏ ఏ రాష్ట్రాల్లో..

భారత్‌లోనూ 2023 మార్చి నాటికి ఉత్తర ప్రదేశ్‌లో 131 సీబీజీ ప్లాంట్లు ఉన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, పంజాబ్, తమిళనాడుల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. మరికొన్ని రాష్ట్రాలు వీటి ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నాయి. - సెంట్రల్ డెస్క్

సీబీజీ ప్రయోజనాలు..



- రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోంది. పెట్రోల్, డీజిల్ వాహనాలు ఉద్గారాలు కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి. పంట వ్యర్థాలను కాల్చకుండా వాటితో సీబీజీ ఉత్పత్తి చేయడం వలన వాయు కాలుష్యం చాలావరకు తగ్గుతుంది. అలాగే పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని వాడకం వలన కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయి.
- దేశంలో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే.. యువతకు ఉపాధి దొరుకుతుంది. ముడిచమురు, సహజవాయువుల దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది.
- ఏటా భారత్‌లో 62 మిలియన్ టన్నులకుపైగా చెత్త పోగవుతోంది. సీబీజీ ఉత్పత్తికి ఉపయోగపడుతుంది.
- ఇంధన భద్రతకు భరోసానిస్తుంది. పెట్రోల్, డీజిల్‌లకు ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది.
- రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉంటుంది. గ్రామీణ ఉపాధికి, ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు దోహదపడుతుంది.



సంతకేసి సాగుతూ..

విరగపండిన సీతాఫలాలు.. నోట్లో నీళ్లూరించే చింతకాయలు... నిగనిగలాడే కూరగాయలతో గిరిపుత్రులు సంతకేగారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని కాశీపట్నంలో బుధవారం జరిగే సంతకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తమ ఉత్పత్తులను తీసుకొచ్చారు. మన్యం, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పండిన సరుకులను సంతలో విక్రయించారు. విశాఖ, విజయనగరం జిల్లాలవాసులు ఈ ఉత్పత్తులను కొన్నారు.







ఇదే ఫైనల్ వార్నింగ్

- ఇక్కడితో ఆపకపోతే పర్యవసానాలు దారుణంగా ఉంటాయి
- ఉన్నత విద్యామండలి జేడీకి గత అకౌంట్స్ అధికారి బెదిరింపు
- అకౌంట్ బుక్స్ అప్పగించకపోవడంపైన వాగ్వాదం
- లోకేశ్ పేషీ దృష్టికి ఘటన.. చర్యలు తీసుకునే అవకాశం

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవల రిలీవ్ అయిన ఎస్.నాగవేణి, జాయింట్ డైరెక్టర్‌ను ఆయన చాంబర్‌కు వచ్చి బెదిరించారు. తన జోలికి వస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. "మీకు చేతనైతే చైర్మన్‌తో తేల్చుకోండి. నువ్వే నాపై లేఖలు రాస్తున్నావు. నేను బెదిరించానని గతంలో లేఖలు రాశావు. ఇప్పుడు కూడా బెదిరించా అని రాసుకో. ఒక్కటే చెబుతున్నా.. ఇది ఇక్కడితో ఆగకపోతే పర్యవసానాలు దారుణంగా ఉంటాయి. నా కంటే ముందు అధికారి అకౌంట్స్ అప్పగించకుండా వెళ్లిపోతే అది అడగవు. నన్ను మాత్రం ల్యాప్‌ట్యాప్ ఇవ్వలేదని అడుగుతున్నావు. ఇదే ఫైనల్‌గా చెప్పడం.. గుర్తుంచుకో" అంటూ బెదిరించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఉన్నత విద్యామండలి జేడీ టీవీఎస్ కృష్ణమూర్తి ప్రస్తుతం ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం డిప్యూటీ రిజిస్ట్రార్ అయిన ఎస్.నాగవేణి గత ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై మండలికి వచ్చారు. అకౌంట్స్ ఆఫీసర్‌గా ఇటీవల కాలం వరకు పనిచేసి ప్రభుత్వం మారాక రిలీవ్ అయి వెళ్లిపోయారు. బుధవారం మండలి కార్యాలయానికి వచ్చిన ఆమె ఒక్కసారిగా జేడీ చాంబర్‌లోకి వెళ్లి ఆయనతో గొడవకు దిగారు. చాంబర్‌లోకి వెళ్తూనే అక్కడున్న అటెండర్లు, జేడీ పీఏ, ఇతర ఉద్యోగులను బయటకు వెళ్లాలని సూచించారు. అందరి ముందు మాట్లాడాలని జేడీ చెప్పినా ఆమె వినలేదు. గత కొన్నేళ్లుగా తనను వేధిస్తున్నారని, చైర్మన్‌తో గొడవల్లోకి తనను లాగొద్దంటూ వాగ్వాదానికి దిగారు. అకౌంట్ బుక్స్ అప్పగించలేదని జేడీ ప్రస్తావించగా, తనకు ముందున్న అధికారి కూడా ఇవ్వకుండా పారిపోయాడని ఆమె వాదించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలోనూ తనకు డిప్యుటేషన్ రాకుండా అడ్డుకున్నావ్ అంటూ జేడీపై చిందులు తొక్కారు. తనకు ఎలాంటి సంబంధం లేదని, ఏమైనా ఆధారాలుంటే చూపాలని జేడీ చెప్పినా ఆమె వినలేదు. అన్ని అకౌంట్స్ బుక్స్ అప్పగిస్తే అంతకు ముందు అధికారులపై కూడా చర్యలుంటాయని జేడీ చెప్పినా ఆమె పట్టించుకోలేదు. అలాగే క్యాష్‌బుక్స్ మాయంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'ఉన్నత విద్యామండలిలో గోల్‌మాల్' కథనాన్ని ప్రస్తావిస్తూ.. ఆంధ్రజ్యోతిపైనా ఆమె అక్కసు వెళ్లగక్కారు. కథనంలో ఎక్కడా ఆమె పేరు ప్రస్తావించకపోయినా తన గురించే రాశారన్నట్టు భావించి ఇష్టానుసారంగా మాట్లాడారు. దీంతో అకౌంట్స్ బాధ్యత అంతా తనదేనని, ఆ తప్పులకు బాధ్యత కూడా తనదేనని ఆమె స్వయంగా చెప్పినట్లైంది. కాగా ఈ ఘటనను మంత్రి నారా లోకేశ్ పేషీ దృష్టికి జేడీ తీసుకెళ్లారు. ఘటనపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిసింది.

వైసీపీ అధికారుల హవా..

తాజా ఘటన ఉద్యోగులను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం మారిన తర్వాత వైసీపీ అనుకూల అధికారులు కొందరు గొడవలు సృష్టించడానికి ప్రయత్నించారు. ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను నియమించకపోవడం, అధికారులను మార్చకపోవడంతో వైసీపీ అధికారుల హవానే ఇంకా మండలిలో కొనసాగుతోంది. డిప్యుటేషన్ గడువు ముగిసి వెళ్లిపోయిన అధికారులకు మండలిలో ఉన్న వైసీపీ అనుకూల అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. దీంతో తటస్థంగా ఉండే అధికారులు, సాధారణ ఉద్యోగులు ఎప్పుడు ఏ గొడవలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

'సరస్వతి' క్రయ విక్రయదారులకు నోటీసులు

- యాజమాన్యానికి రిజిస్టర్ పోస్టు ద్వారా.. రైతులకు స్వయంగా...

మాచవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం, పిన్నెల్లి గ్రామాల్లో సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ భూముల క్రయవిక్రయదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. పై మూడు గ్రామాల్లో సరస్వతి యాజమాన్యం 1077.38 ఎకరాలు కొనుగోలు చేసింది. వేమవరంలో 20 ఎకరాల అసైన్డ్ భూములు కొనుగోలు చేసినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఈ 20 ఎకరాల అసైన్డ్ భూముల రైతులకు, వారి నుంచి కొనుగోలు చేసిన వారికి, ఫ్యాక్టరీకి అమ్మిన వారికి నోటీసులు ఇస్తున్నారు. రైతులకు ఇంటికి వెళ్లి స్వయంగా నోటీసులు అందజేశారు. మధ్యవర్తులకు, ఫ్యాక్టరీ యాజమాన్యానికి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపినట్లు తెలిసింది.

చేనేతను ఆదుకోనున్న 'ఆద్యం'

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు దేశ, విదేశాల్లో మార్కెటింగ్ కల్పించేందుకు ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన 'ఆద్యం' హ్యాండ్ ఒయెన్ సంస్థతో ఏపీ చేనేత జౌళి శాఖ ఒప్పందం చేసుకోబోతోంది. ఇప్పటికే దేశంలోని వారణాసి, పోచంపల్లి, భుజ్ వంటి ప్రముఖ ప్రాంతాల్లోని చేనేత వస్త్ర ఉత్పత్తులతో ఒప్పందం చేసుకుని విక్రయాలకు ఊతమిస్తోన్న ఆద్యం హ్యాండ్ ఒయెన్‌తో సంప్రదించి ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, కోడుమూరు ప్రాంతాల్లోని చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న గుర్తింపును వివరించారు. చేనేత కళ, వస్త్ర నాణ్యతను పరిశీలించిన ఆద్యం ప్రతినిధులు బుధవారం రాష్ట్రంలో పర్యటించారు. ఇక్కడి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేందుకు ఏపీ చేనేత జౌళిశాఖ కమిషనర్‌తో గురువారం ఒప్పందం చేసుకోబోతున్నారు.

పిల్లలే దేశ భవిష్యత్తు: గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నేటి పిల్లలే దేశ భవిష్యత్తు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చిన్నారులందరికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పండిట్ నెహ్రూ బాలల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. చిన్నారులు దేశానికి వెన్నుముకగా ఆయన భావించారన్నారు.

సెలవులోకి టూరిజం ఎండీ ఆమ్రపాలి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ ఎండీగా బాధ్యతలు తీసుకున్న ఆమ్రపాలి సెలవుపై వెళ్లారు. ఈ నెల 11 నుంచి 24 వరకూ సెలవు పెట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మధ్య కాలంలోనే తెలంగాణ నుంచి ఆమె ఏపీకి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ఎండీ, ఏపీటీఏ సీఈవోగా పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం ఎండీగా ఒక రోజు విధులు నిర్వహించి ఆ తర్వాత సెలవుపై వెళ్లారు. కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్న నారాయణ భరత్ గుప్తాకు టూరిజం ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

18న మంత్రివర్గ సమావేశం

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సాధారణానికి భిన్నంగా ఈసారి మంత్రివర్గ సమావేశాన్ని సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ ముగిసిన తరువాత కేబినెట్ ప్రారంభంకానుంది.

మరో 4 కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం.. బుధవారం మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. రజక, కొప్పుల వెలమ, గవర, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్లలో డైరెక్టర్లను నియమించింది.

వైసీపీ గుర్తింపు రద్దు చేయాలి: సోమిరెడ్డి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీగా వైసీపీ గుర్తింపును రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరతానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ చెప్పారు.

అనుసంధానం తథ్యం

- గోదావరి- కృష్ణా-పెన్నాలను కలుపుతాం
- వాటర్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా .. సవాళ్లెన్ని ఎదురైనా గోదావరి - కృష్ణా - పెన్నా నదుల అనుసంధానం పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తద్వారా ప్రతి ఎకరాకు నీళ్లిస్తామని, ప్రతి గ్రామానికీ తాగునీరందిస్తామని వెల్లడించారు. బుధవారం శాసనసభా ప్రాంగణంలోని తన చాంబర్‌లో నదుల అనుసంధానం, వాటర్ పాలసీపై జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. 'వృథాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను మళ్లించి ప్రతి ఎకరాకూ సాగునీరందించాలంటే నదుల అనుసంధానం జరగాల్సిందే. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ద్వారా గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం పూర్తిచేసి లక్షల ఎకరాలకు సాగునీరందించాం. ఇప్పుడు గోదావరి-కృష్ణా- పెన్నా నదుల అనుసంధానంపై దృష్టిపెట్టాం. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకెళ్లే ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు తెలిపారు. అనుసంధాన ప్రతిపాదనలను జల వనరుల శాఖ సీఎం ముందుంచింది. ఆ శాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం కాలువ సామర్థ్యం పెంపుపై మరింత కసరత్తు చేయాలని చంద్రబాబు సూచించారు. ఆర్థికంగా ఇదొక పెద్ద సవాల్ అన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, సహాయ కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. పోలవరం పనుల షెడ్యూల్‌పై పూర్తిస్థాయి స్పష్టత వచ్చాక ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల ప్రణాళికను ప్రకటిస్తానని సీఎం చెప్పారు. ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న వాటర్‌పాలసీపైనా చర్చ జరిగింది. మరికొంత కసరత్తు చేశాక, ఈ పాలసీని ఆమోదిద్దామని చంద్రబాబు అన్నారు.

పెన్నాకు గో'దారి'!

(మొదటి పేజీ తరువాయి)



నాలుగు జిల్లాలతో పాటు దక్షిణ కోస్తాలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తాగు, సాగు నీరు అందించాలని యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై చర్చిస్తోంది. వీటి ప్రకారం పోలవరం ప్రధాన కుడి కాలువ నుంచి గోదావరి మిగులు జలాలను రోజు (సీజన్‌లో)కు రెండు టీఎంసీల చొప్పున కృష్ణా నదికి తరలిస్తారు. ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం నుంచి కొత్త కాలువల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లికి తరలిస్తారు. అక్కడ రిజర్వాయర్‌ను నిర్మించి, అక్కడి నుంచి నల్లమల మీదుగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బనకచర్లకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి సోమశిల, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవాకు పంపి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను సస్యశామలం చేస్తారు.

పోలవరం నుంచి 2 ప్రతిపాదనలు

గోదావరి జలాలను పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలోనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కాలువ సామర్థ్యాన్ని బట్టి కృష్ణా డెల్టాకు 17,561 క్యూసెక్కుల జలాలను తరలించవచ్చు. ప్రస్తుత కాలువ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా 23,113 క్యూసెక్కులను తరలించే వీలుందని జల వనరుల శాఖ పేర్కొంది. అలాగే కాలువ లోతును ఐదు నుంచి ఆరు మీటర్లకు తవ్వితే రోజూ 40,674 క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుందని తెలిపింది. కాగా పోలవరం కుడి ప్రధాన కాలువకు సమాంతరంగా కొత్తగా కాలువను తవ్వి గోదావరి జలాలను తరలించే మరో ప్రతిపాదననూ జల వనరుల శాఖ పరిశీలించింది. ఈ కాలువను కొత్తగా తవ్వుతున్నందున అవసరమైన మేర లోతులోనూ, లైనింగ్‌లోనూ నిర్మించే వీలుందని చెబుతోంది. గోదావరి జలాలను 90 మీటర్ల ఎత్తులో ఉన్న కృష్ణాకు ఎత్తిపోయడం వల్ల చివరి ప్రాంతానికి జలాలు వేగంగా ప్రవహించే వీలుందని జల వనరుల శాఖ పేర్కొంది. అయితే.. ఈ కాలువ తవ్వకానికి 10,000 ఎకరాల మేర భూసేకరణ చేయాల్సి వస్తుందని పేర్కొంది. ఇది చాలా కష్టసాధ్యమైనదని అభిప్రాయపడింది. ముందుగా ప్రతిపాదించినట్లుగా పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి ప్రకాశం బ్యారేజీకి, సమీపాన వైకుంఠపురం ఎత్తిపోతల పథకం నుంచి బొల్లాపల్లి రిజర్వాయరు-బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించే ప్రతిపాదన వైపే జల వనరుల శాఖ మొగ్గు చూపింది.

కృష్ణా నుంచి ఇలా...

కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. కాలువల తవ్వకానికి, బొల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించాలి. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుందని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

గరిష్ఠంగా నీటి తరలింపు!

కాలువల తవ్వకం, విస్తరణ ద్వారా గోదావరి మిగులు జలాలను వీలైనంత వరకు రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలకు తరలించవచ్చని జల వనరుల శాఖ అంచనా వేసింది. గోదావరి జలాలను ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణం జరుగుతున్న జలాశయాలు, కాలువల ద్వారా 121 రోజుల్లో 75.1 టీఎంసీలను ఎత్తిపోయవచ్చని పేర్కొంది. 117 రోజుల పాటు 11,583 క్యూసెక్కుల ప్రవాహంతో 122.7 టీఎంసీలను తరలించేందుకు కూడా వీలుందని పేర్కొంది. ఇక 116 రోజుల్లో 14,126 క్యూసెక్కుల ప్రవాహంతో 148.8 టీఎంసీలను, అదేవిధంగా 111 రోజుల్లో 17,657 క్యూసెక్కులతో 184.5 టీఎంసీలను, 107 రోజుల పాటు 21,188 క్యూసెక్కులతో 215 టీఎంసీలను, 105 రోజుల పాటు 23,166 క్యూసెక్కులతో 231.4 టీఎంసీలను, 104 రోజుల్లో 24,720 క్యూసెక్కులతో 244 టీఎంసీలను ఎత్తిపోసే వీలుందని జల వనరుల శాఖ పేర్కొంది. కాలువల ద్వారా 34,749 క్యూసెక్కుల ప్రవాహంతో 96 రోజుల పాటు 320.5 టీఎంసీలను తరలించే వీలుందని జల వనరుల శాఖ లెక్కించింది. అలాగా 92 రోజుల పాటు 38,845 క్యూసెక్కులతో 345.9 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా, పెన్నాకు ఎత్తిపోయవచ్చని గణాంకాలు వేసింది.

మా ప్రభుత్వంలో ప్రతిభతో ఆర్థిక వ్యవహారాలు

- అప్పులపై చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం చేసింది: జగన్



అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో ప్రతిభతో ఆర్థిక వ్యవహారాలను నిర్వహించామని, తమను పిలిచి అవార్డు ఇవ్వాలని మాజీ సీఎం జగన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్పురత్న బిరుదు ఇవ్వాలన్నారు. తమ ప్రభుత్వానికి కేంద్రం సహకారం అందించకూడదని, ఆర్థిక సంస్థలేవీ అప్పులు ఇవ్వడానికి వీల్లేకుండా చేయడానికి అప్పట్లో చంద్రబాబు అండ్ కో ఆర్గనైజ్డ్ క్రైమ్ చేసిందని ఆరోపించారు. 2022 ఏప్రిల్ 5వ తేదీన 10 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని ప్రచారం ప్రారంభించి, ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు నెల రోజుల ముందు ఏకంగా రూ.14 లక్షల కోట్లకు తీసుకువెళ్లారన్నారు. తమ ప్రభుత్వానికి అప్పు పుట్టకూడదని, కేంద్రం నిధులు ఇవ్వకూడదన్న రాజకీయ కుట్రతోనే ఇదంతా చేశారని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జూలైలో ఆర్థిక శాఖ సమీక్షలోనూ రూ.14 లక్షల కోట్ల అప్పు ఉందంటూ చెప్పారని అన్నారు. జూలై 22న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అప్పులు పది లక్షల కోట్ల రూపాయలు చేశారంటూ గవర్నర్‌తో చంద్రబాబు అబద్ధాలు చెప్పించారని విమర్శించారు.

108 సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

- అంబులెన్సులు ఆపితే ప్రజలకే నష్టం: షర్మిల

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అపర సంజీవిని 108 అంబులెన్స్ సేవలకు కూటమి ప్రభుత్వంలో ఆపద వచ్చిందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. ఫోన్ చేస్తే కుయ్ కుయ్ అంటూ క్షతగాత్రుల వద్దకు చేరే 108 మూగబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి అంబులెన్స్ సర్వీసుల సమ్మెకు మద్దతు కోరారని, ఉద్యోగుల డిమాండ్‌లు న్యాయమైనవి అయినందున పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంబులెన్సులు ఆపితే నష్టం ప్రజలకేనని అన్నారు. బుధవారం 'ఎక్స్'లో ఆమె పోస్టు చేశారు. 'అత్యవసర పరిస్థితిలో ప్రాణాలకు అండగా నిలిచే అంబులెన్స్ వ్యవస్థను ప్రతీకార రాజకీయాలకు వాడుకుంటున్నారు. వాహనాల్లో డీజిల్ పోయకుండా, మెడికల్ ఎక్విప్‌మెంట్ సమకూర్చకుండా, రిపేర్లు వస్తే చేయకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోంది' అని షర్మిల పేర్కొన్నారు.

సుశిక్షితులైన డ్రైవర్లే వోల్వో బస్సులు నడపాలి

- ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశం

వోల్వో, ఇతర హైఎండ్ టెక్నాలజీ బస్సులను సుశిక్షితులైన డ్రైవర్లే నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును హైకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని తేల్చిచెప్పింది. శిక్షణ ఇచ్చిన డ్రైవర్లకే ఆ బస్సులు నడిపే బాధ్యత అప్పగిస్తామని ఆర్టీసీ ఎండీ ఇచ్చిన హామీని నమోదు చేసింది. అనంతరం వ్యాజ్యంపై విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.



సైకో 'స్కీమ్'!

వైసీపీ సర్కారులో కళ్లు చెదిరే స్కామ్.. సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రభుత్వ సొమ్ము

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీ డిజిటల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌తో పాటు మరిన్ని ప్రభుత్వ విభాగాల సొమ్మును 'సోషల్ సైకో'లకు కట్టబెట్టారని ఎప్పుడో స్పష్టమైంది. ఆయా కార్పొరేషన్లలో ఉద్యోగులుగా నియమించుకుని.. వారి ద్వారా సోషల్ మీడియా పని చేయించుకున్నారు. కింది స్థాయిలో పని చేసిన వారికి ప్రభుత్వ పథకాల సొమ్ములు దోచిపెట్టినట్లు తాజాగా తేలింది. తాడేపల్లిలో పుట్టిన కంటెంట్‌కు రకరకాల బూతులు, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు జతచేసి సోషల్ మీడియాలో పెట్టడమే ఈ 'ఫ్యాక్టరీ' పని! రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయిన సోషల్ సైకోలపై పోలీసులు చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. 'ఈ పోస్టులు పెట్టినందుకు మీకు జీతాలు ఇచ్చారా? ఇంకేమైనా చేశారా?' అని ప్రశ్నించగా పలువురు అసలు విషయం బయటపెట్టారు.. తమకు చదువుకునే పిల్లలు లేకున్నా 'అమ్మ ఒడి' వచ్చేదని, వ్యవసాయం చేయకపోయినా రైతుభరోసా' ఇచ్చేవారని, మగ్గం చూడక పోయినా నేతన్న నేస్తం, ఆటో లేకున్నా 'వాహన మిత్ర' కింద లబ్ధి చేకూరిందని వెల్లడించారు. లబ్ధిదారుల జాబితాలో సోషల్ సైకోల పేర్లు చేర్చినట్లు గుర్తించిన పోలీసులు 'ఇలా కూడా చేశారా' అని ఉలిక్కిపడ్డారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరించారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా కన్వీనర్, ఉప కన్వీనర్‌కు వైసీపీ పార్టీ సొమ్ములు చెల్లించేది. ఇంకో కేటగిరీలోని వాళ్లకు ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా చెల్లింపులు జరిగాయి. జిల్లా స్థాయి సోషల్ సైకోలకు పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు సొమ్ములు చెల్లించారు. చివరి దశలో.. మండల, గ్రామ స్థాయి సోషల్ మీడియా కార్యకర్తలకు రకరకాలుగా పేమెంట్లు జరిగాయి. అందులో.. ప్రభుత్వ పథకాల నిధుల మళ్లింపు ఒకటి! అందులోనూ ఎక్కువగా 'అమ్మ ఒడి'నే వాడుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి అర్హులైన తల్లుల జాబితాను పాఠశాల విద్యా శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపేది. కానీ... బ్యాంకులకు వెళ్లే జాబితాలో మాత్రం కొన్ని పేర్లను మాయం చేసి, ఆ స్థానంలో 'సోషల్ సైకో'ల పేర్లను జత చేసేవారు. జగన్ బటన్ నొక్కగానే... లబ్ధిదారులతోపాటు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల ఖాతాల్లోకీ డబ్బులు పడేవి. 'అమ్మ ఒడి'కి సంబంధించి 40 లక్షలకు పైగా ఖాతాల్లో సుమారు లక్ష వరకూ ఇలా దొంగవే అని అంచనా! ఇతర పథకాల్లోనూ ఇదే తంతు. తమ ఖాతాల్లో డబ్బు పడలేదని అసలైన లబ్ధిదారులు ప్రశ్నిస్తే... 'మళ్లీ దరఖాస్తు చేసుకోండి' అని చెప్పేవారు. పైగా, గల్లంతైన పేర్లలో అత్యధికం టీడీపీ, జనసేన సానుభూతిపరులు, నోరెత్తి ప్రశ్నించలేని వారే ఉండేవారు. ఎవరి పేర్లను తప్పించాలో కూడా వైసీపీ సోషల్ మీడియా విభాగమే గుర్తించి, ఆ జాబితాను సిద్ధం చేసేదని సమాచారం.

డిజిటల్ ఆడిట్‌తో కూపీ...

అనర్హులకు సంక్షేమ పథకాల ద్వారా ఖాతాల్లో జమైనట్లు ఆధారాలు లభించాయి. ఇదేలా జరిగిందని పోలీసులు కొన్నిచోట్ల బ్యాంకర్లను ప్రశ్నించారు. లబ్ధిదారుల పేర్లతో తమకు పని లేదని, ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారం... వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడమే తమ పని అని వారు బదులిచ్చారు. దీనిపై తమకూ ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. బ్యాంకర్ల సూచన మేరకు దీనిపై డిజిటల్ ఆడిట్ మొదలుపెట్టినట్లు తెలిసింది. పోలీసులు డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్‌పై అవగాహన ఉన్నవారిని పిలిపించారు. సంబంధిత శాఖలు విడుదల చేసిన అర్హుల జాబితాతో బ్యాంకులకు వెళ్లిన జాబితాను పోల్చి చూస్తున్నారు. ఇప్పటికే కనీసం 25వేల తేడాలు బయటపడినట్లు తెలిసింది. ఇది విజిలెన్స్/ సీఐడీ స్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అంశంగా గుర్తించారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటే మరిన్ని సంచలన అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని తెలిపారు.

అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై

కేసులు పెడితే తప్పేంటి?

» న్యాయమూర్తులు కూడా బాధితులే: హైకోర్టు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు నమోదు చేస్తున్న కేసుల విషయంలో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై కేసులు పెడితే తప్పేముందని ప్రశ్నించింది. ఒక దశలో తమను కూడా ఉపేక్షించలేదని, అసభ్యకర పోస్టులకు న్యాయమూర్తులూ బాధితులుగా మారారని గుర్తు చేసింది. పోలీసు కేసుల్లో ఏరకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. నేరానికి పాల్పడిన వ్యక్తుల విషయంలో పోలీసులు చట్టనిబంధనల మేరకు నడుచుకుంటుంటే తాము ఎలా నిలువరించగలమని ప్రశ్నించింది. పోలీసులు నమోదు చేసిన కేసులపై అభ్యంతరం ఉంటే సంబంధిత వ్యక్తులకు క్వాష్ పిటిషన్లు దాఖలు చేసుకొనే ప్రత్యామ్నాయ మార్గం ఉందని గుర్తుచేసింది. కేసుల నమోదుపై పిల్ దాఖలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ప్రస్తుత పిల్‌పై తగిన నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేసులు పెడుతూ పోలీసులు చట్టనిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, పోలీసుల చర్యలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు, వైసీపీ ప్రభుత్వంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పోలా విజయ్‌బాబు పిల్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పోలీసుల చర్య సుప్రీంకోర్టు తీర్పుకి విరుద్ధంగా ఉందని వాదించారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాలలో 2000 మంది అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అలాంటివారిపై కేసులు పెడితే తప్పేముందని ప్రశ్నించింది. ఒక దశలో న్యాయమూర్తులు కూడా ఈ దూషణలకు బాధితులుగా మారారని గుర్తు చేసింది.

> "సామాజిక మాధ్యమంలో ఇష్టారాజ్యంగా అభిప్రాయాలు, పోస్టులు పెడతామంటే కుదరదు. తాము ఏమైనా చేస్తామనే భావనలో ఉన్నవారిని పోలీసులు చట్టం ముందు నిలబెట్టడం తప్పెలా అవుతుంది? సామాజిక మాధ్యమాల వేదికగా 2వేల మంది అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంటే, అలాంటివారిని గుర్తించి చట్టం ముందుకు తీసుకురావడంలో తప్పేముంది? ఈ తరహా పోస్టుల విషయంలో కేసులు నమోదు చేయకుండా పోలీసులను నిలువరిస్తూ బ్లాంకెట్ ఆర్డర్ (సార్వత్రిక ఉత్తర్వులు) ఇవ్వలేం?" - హైకోర్టు

బూతులే సిగ్గుపడేలా!

వైసీపీ సోషల్ సైకో ఫ్యాక్టరీ దారుణాలు.. ఎవరిని ఎలా తిట్టాలో పైనుంచి ఆదేశాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'బూతు' అనే మాట చాలా తక్కువ! అవి.. బూతులే సిగ్గుపడి చచ్చేంత బూతులు! నడివీధిలో కొట్టుకునే వాళ్లు కూడా నోరెత్తి పలికేందుకు వెనుకాడే బూతులు! 'ఇలా అన్నాడు' అని మరొకరితో చెప్పలేని, అక్షరాల్లో రాయలేని స్థాయి బూతులు! వైఎస్ జగన్మోహన్ రెడ్డికి నిజంగా మనస్సాక్షి ఉంటే... 'ఇంతటి బూతులు తిట్టిన వాళ్లను వదలొద్దు' అని ఆయనే చెప్పేవారు. 'ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తారా?' అని వాపోవడం ఆపేస్తారు! "అన్నం తినేవాళ్లెవరూ ఆ బూతులు వాడరు. వాటిని చదవాలంటేనే నాకు సభ్యత, సంస్కారం అడ్డొస్తున్నాయి" అని ఇటీవల కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పారంటే వాటి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి తన ఫేస్‌బుక్ ఖాతాలో వాడిన 40కి పైగా బూతు వ్యాఖ్యల స్క్రీన్ షాట్లను కూడా పోలీసులు సాక్ష్యాలుగా సేకరించారు. వాటిని చూస్తే 'ఇంత నీచమా' అని ఎవరికైనా అనిపిస్తుంది. బాధితుల్లో సున్నితమైన మనస్కులు వీటిని చూసి కుంగిపోవడం, క్షోభకు గురి కావడం ఖాయం. గిట్టని పార్టీల నాయకులను మాత్రమే కాదు... సోషల్ మీడియాలో వైసీపీ సర్కారును ప్రశ్నించిన సామాన్యులపైనా పచ్చి బూతులతో విరుచుకుపడ్డారు.

ఆర్గనైజ్డ్‌గా 'బూతుల ఫ్యాక్టరీ'

వైసీపీ 'సోషల్ మీడియా సైకో' ఫ్యాక్టరీని నడుపుతున్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఇదంతా వ్యవస్థీకృతంగా జరుగుతుంది. ఎవరు ఎలాంటి పోస్టులు పెట్టాలి, ఎవరిని ఎలా తిట్టాలి, సోషల్ మీడియాలో ఏం పోస్టులు పెట్టాలి, ప్రెస్‌మీట్లలో ఎలా తిట్టాలి... ఇలా ఎప్పటికప్పుడు 'పైనుంచి' ఆదేశాలు, సూచనలు వెళతాయి. పోస్టులు పెట్టేవారిలోనూ స్థాయిలు ఉంటాయి. వేలకొద్దీ ఫేక్ ఐడీలను సృష్టించి... వాటి ద్వారా విచ్చలవిడిగా పోస్టులు పెడతారు. పెద్ద సైకోలు, పిల్ల సైకోలు, ఇంకా కింది స్థాయి వారూ... ఇలా కేటగిరీల వారీగా బాధ్యతలు అప్పగిస్తారు. శ్రీరెడ్డి, పోసాని కృష్ణ మురళి, వర్రా రవీంద్రా రెడ్డి, ఇంకా రకరకాల పేర్లతో తయారైన అకౌంట్లన్నీ ఇందులో భాగమే. ఇక... వర్రా రవీంద్రా రెడ్డి పోస్టులు మరీ నీచంగా, దారుణంగా ఉంటాయి.

విభేదిస్తే బూతుల దాడి...

చేసిన మంచి చెప్పుకోవడం, విమర్శలకు బదులివ్వడం ఒక పద్ధతి. కానీ... బూతులతో దండెత్తడమే వర్రాకు తెలిసిన పాడు పద్ధతి! తమకు గిట్టని వారి పుట్టుకలనూ, తల్లులనూ అవమానించడం అతడికి సర్వసాధారణం! 'వాడు, వీడు, ...కొడుకు' వంటి పదాలను అలవోకగా వాడేస్తాడు. వావి వరుసలూ పట్టించుకోడు. సమాజంలో ఎవరూ ఇంత యథేచ్ఛగా బూతులు వాడలేరు, వాడరు, వాడలేదు! అలాంటి బూతులను ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా వేదికలపై పోస్టు చేయడమే బరితెగింపు! చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లతోపాటు వారి కుటుంబ సభ్యులపైనా అతను నీచాతి నీచమైన, జుగుప్సాకరమైన పోస్టులు పెట్టాడు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, వైసీపీతో విభేదించి బయటికి వచ్చినా బూతులే! ప్రతి చోటా కులం ప్రస్తావన తీసుకొస్తాడు. ఆయా కులాల పేర్లు ప్రస్తావించి మరీ... 'వీళ్లింతే. వీళ్లను నమ్మొద్దు' అని తిడతాడు. ఉదాహరణకు.. సినీ నటుడు పృథ్వీ బయటికి రాగానే, ఆయనను, ఆయన కులాన్నీ కలిపి బూతులు తిట్టాడు. వైసీపీలోనూ ఆయా కులాల వారున్నారన్నది మరిచిపోయాడా? తమ కులాన్ని తిడుతున్నా ఆయా నేతలు ఎందుకు ఊరుకున్నారు? జగన్ దృష్టికి తీసుకురాలేదా? అనే ప్రశ్నలకు సమాధానాల్లేవు.

షర్మిలపై నీచాతి నీచంగా..

జగన్ సోదరి షర్మిలను ఉద్దేశించి వర్రా రవీంద్రా రెడ్డి వాడిన బూతులు అన్నీ ఇన్నీ కావు. "జగన్మోహన్ రెడ్డి రెడ్డి కుటుంబంలో పుట్టాడు. రెడ్డి అయ్యాడు. మరి నువ్వు ఎవరు. శాస్త్రి కుటుంబంలో పుట్టి బాప్టిజం తీసుకున్న ఇంటికి కోడలిగా వెళ్లావు. మరి నువ్వు షర్మిల శాస్త్రివా... షర్మిల మేరీ మాతవా?" అనేది అందులో ఒక పోస్టు! మిగిలిన వాటితో పోల్చితే అతి తక్కువ బూతు ఉన్నది ఇదొక్కటే. మిగిలినవి మరీ దారుణం, నీచం! వివేకానంద రెడ్డి కుమార్తె సునీత మీదా ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. అప్పట్లో వర్రా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో అతను ఎప్పటికప్పుడు మరింత రెచ్చిపోయాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా తగ్గలేదు. అదే స్థాయిలో బూతులు కొనసాగించాడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆక్రోశం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో... ఇప్పుడు పోలీసులు జూలు విదిలిస్తున్నారు. 'సోషల్ సైకో'లను వెంటాడుతున్నారు. వాళ్ల బూతులు, నీచ వ్యాఖ్యలను యథేచ్ఛగా ప్రోత్సహించిన వైసీపీ పెద్దలు... ఇప్పుడు 'ప్రశ్నించే వారికి సంకెళ్లు... ఉక్కుపాదం... పోలీసుల అరాచకం' అని వాపోతుండటం గమనార్హం. వైసీపీ సోషల్ మీడియా వ్యూహంలో బూతులు ఒక కోణం మాత్రమే! తప్పుడు వార్తలు సృష్టించడం, ఫొటోలు మార్ఫింగ్ చేయడం, కులాల మధ్య చిచ్చు పెట్టేలా పోస్టులు పెట్టడం... ఇలాంటివి మరెన్నో ఉన్నాయి! చంపేస్తాం, నరికేస్తాం... అనే హెచ్చరికలూ చేశారు. ఇదంతా 'ఆర్గనైజ్డ్ క్రైమ్'లా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

వర్రా రవీంద్రారెడ్డిపై

మరో కేసు

» పవన్ కల్యాణ్‌పై అసభ్యకరంగా పోస్టులు

» తొలగించమని అడిగితే కులం పేరుతో దూషణ

» డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరింపులు



వర్రా రవీంద్రారెడ్డి

పులివెందుల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రారెడ్డిపై మరో కేసు నమోదైంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వర్రా అసభ్యకరంగా పోస్టులు పెట్టారని, వాటిని తొలగించమని అడిగితే కులం పేరుతో దూషించారని, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. కడప జిల్లా సిద్దవటం మండలం ఎస్.రాజంపేట గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వెంకటాద్రి 8న నందలూరు పోలీసుస్టేషన్‌లో వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవరెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఆ కేసును బుధవారం పులివెందులకు బదిలీ చేశారు.

రిమ్స్‌లో వర్రాకు వైద్య పరీక్షలు

సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డిని రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనకు రిమ్స్‌లో వైద్య పరీక్షలకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో బుధవారం సాయంత్రం 4 గంటలకు భారీ బందోబస్తుతో రిమ్స్‌కు తరలించారు. రాత్రి 7 గంటల వరకు వర్రాకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. జనరల్, ఆర్థో పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తరలించారు. రిమ్స్ వద్దకు వర్రా రవీంద్రారెడ్డి భార్య, తండ్రి, సోదరుడు వచ్చినప్పటికీ వారిని పోలీసులు అనుమతించలేదు.

టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నందుకు

కేసు పెట్టారు

» గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుడి ఆవేదన

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నందుకు వైసీపీ నేతలు అక్రమ కేసు పెట్టారని, గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యే తమ తోటలో చెట్లను అక్రమంగా నరికించేశాడని వైసీపీ బాధితులు టీడీపీ ప్రజావేదికలో బుధవారం ఫిర్యాదులు అందజేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా శివరామపురానికి చెందిన దుర్గాప్రవీణ్‌కుమార్ అర్జీ ఇస్తూ, టీడీపీ పోలింగ్ ఏజెంట్‌గా కూర్చునందుకు గత రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తనపై కక్ష కట్టి, అక్రమ కేసులు పెట్టడమే కాకుండా, డీకే పట్టాతో ఉన్న తన భూమిని రద్దు చేయించాడని వాపోయారు. తనను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు బ్రిక్స్ తయారీ పరిశ్రమను కూడా సీజ్ చేయించి, జరిమానాలు వేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లంచం తీసుకుని ఏసీబీకి చిక్కిన ఉద్యోగి సస్పెన్షన్ పెండింగ్‌లో ఉండగా, తహసీల్దార్ కార్యాలయంలో మళ్లీ పోస్టింగ్ తెచ్చుకుని, అక్రమాలకు పాల్పడుతున్నాడని బుట్టాయగూడెంకు చెందిన మోజెష్ ఫిర్యాదు చేశారు. తాత, ముత్తాతల కాలం నుంచి తమ స్వాధీనంలో ఉన్న భూమిని మార్కెట్ యార్డు కోసం తీసుకుని, పరిహారం ఇవ్వకుండానే అందులోని మామిడి చెట్లను అప్పటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అక్రమంగా నరికించారని సత్యసాయి జిల్లా పెమనకుంటపల్లి తండాకు చెందిన బొజ్జే నాయక్ వాపోయారు. 2019లో పంచాయతీరాజ్‌శాఖ కింద చేసిన పనులకు.. టీడీపీ వారమనే ఉద్దేశంతో వైసీపీ నేతలు అడ్డుకున్నారని కోనసీమ జిల్లా శివకోటికి చెందిన చాగంటి స్వామి వాపోయారు.

తెలియదు.. గుర్తు లేదు!

» రఘురామ కేసులో ప్రకాశం ఎస్పీ ఎదుట విచారణకు హాజరైన విజయ్‌పాల్

ఒంగోలు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలియదు.. గుర్తు లేదు.. ఇదీ మాజీ ఎంపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కేసులో విచారణకు హాజరైన రిటైర్డు ఏఎస్పీ విజయ్‌పాల్ ఇచ్చిన సమాధానం. సీఐడీ అధికారులపై రఘురామకృష్ణరాజు పెట్టిన కేసులో విచారణ వేగవంతమైంది. కేసులో ఏ4గా ఉన్న విజయ్‌పాల్ బుధవారం ప్రకాశం జిల్లా ఎస్పీ, విచారణాధికారి ఏఆర్ దామోదర్ ఎదుట హాజరయ్యారు. ఇప్పటికే గుంటూరులో విచారణకు హాజరైన విజయ్‌పాల్ నాలుగోసారి ఒంగోలు వచ్చారు. సుమారు 7 గంటలకుపైగా ఆయనను జిల్లా పోలీసు కార్యాలయంలో విచారించారు. ఉదయం 11.15 గంటలకు విచారణ మొదలు కాగా, మధ్యలో ఓ గంట భోజన విరామానికి తీసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6.30 వరకు విజయ్‌పాల్‌ను విచారించారు. పోలీసు విచారణకు విజయ్‌పాల్ సహకరించలేదని తెలిసింది. దీంతో మరోసారి విచారణకు హాజరు కావాలని ఎస్పీ దామోదర్ చెప్పినట్టు సమాచారం.

సోషల్ సైకోలపై

ఉక్కుపాదం

అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై కేసుల పర్వం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



హైదరాబాద్‌లో వర్మకు నోటీసు ఇస్తున్న మద్దిపాడు ఎస్ఐ

కూటమి ప్రభుత్వంలో కీలక నేతలను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ సానుభూతిపరులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇలాంటి వారిపై ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నారు. స్టేషన్లకు పిలిపించి విచారిస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన కేసులో సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎస్ఐ బి.శివరామయ్య బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆర్జీవీకి నోటీసులు అందజేశారు. ఈ నెల 19న ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. కాగా, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెట్టిన కేసుకు సంబంధించి వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో 2గంటల పాటు జరిగిన విచారణలో కాకాణి 54 ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. మరోవైపు టీటీడీ చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని కృష్ణమురళిపై తెలుగు యువత నాయకులు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, వంగలపూడి అనితను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నటి శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు విశాఖపట్నం కంచరపాలెం, అనంతపురం, రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఇదిలాఉండగా, ఫేస్‌బుక్‌లో 'నేను మావా' పేరుతో ఖాతా నిర్వహిస్తూ కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులను దూషిస్తూ అసభ్యకర పోస్టులు పెట్టిన శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త బాలాజీ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన పల్నాడు జిల్లా కంభంపాడు గ్రామానికి చెందిన నెమలిదిన్నె వెంకట రంగారెడ్డిని మాచర్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న ఆయన్ను నరసరావుపేటలోని జిల్లా కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. కాగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినందుకు శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమరనాథ్‌రెడ్డిపై నకరికల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కాపారపు వెంకటరమణపై కేసు నమోదు నమోదైంది. బుధవారం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 27 వరకు రిమాండ్ విధించడంతో పెద్దాపురం సబ్ జైలుకు తరలించారు.

అంబటి సవాల్.. అలా ముగిసింది!

ప్రతిష్ఠకు పోయి సవాల్ విసిరిన మాజీ మంత్రి అంబటి రాంబాబు... వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను తానే పోలీసులకు అప్పగించాల్సి వచ్చింది. హోంమంత్రి వంగలపూడి అనితపై ఉమ్మడి గుంటూరు జిల్లా నకిరేకల్‌కు చెందిన పావులూరి రాజశేఖర్‌రెడ్డి మార్ఫింగ్ ఫొటోలతో, అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారు. దీనిపై నూజివీడు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి.. మాజీ మంత్రి అంబటి రాంబాబును ఆశ్రయించారు. రాజశేఖర్‌రెడ్డి తనవద్దే ఉన్నాడని... అరెస్టు చేస్తారా... అంటూ ఆయన సవాల్ విసిరారు. అంబటికి కేసు పూర్వాపరాలు వివరించిన పోలీసులు ఆధారాలు చూపించారు. దీంతో ఆయనే నిందితుడిని పోలీసులకు అప్పగించేలా చేశారు. రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు గుంటూరులో అదుపులోకితీసుకుని నూజివీడు తీసుకువచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.